సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 217 | విజయవాడ, సోమవారం 7 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

గుడ్ బై



చివరి పోటీలో కాంస్యంతో సరిపెట్టుకున్న పరుగుల రాజు ఉసేన్ బోల్ట్

లండన్ : సుమారు దశాబ్దకాలం పాటు స్ప్రింట్ ఈవెంట్‌ను ఏకఛత్రాధిపత్యంగా ఏలిన బోల్ట్ తన కెరీర్‌లో చివరి 100 మీటర్ల ఫైనల్లో మూడో స్థానంలో నిలవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల రేసులో బోల్ట్ మూడో స్థానానికి పరిమితమయ్యాడు.అమెరికా స్టార్ స్ప్రింటర్ జస్టిస్ గాట్లిన్ బోల్ట్‌ను వెనక్కి నెట్టి స్వర్ణం గెలుచుకున్నాడు. 8 సార్లు ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన బోల్ట్‌ను 35 ఏళ్ల వయసులో గాట్లిన్ అధిగమించడం విశేషం. అమెరికాకే చెందిన క్రిస్టియన్ కోలెమన్ కూడా జమైకా చిరుతను అధిగమించడం విశేషం. ఈ రేసును గాట్లిన్ 9.92 సెకన్లలోనూ, కోలెమన్ 9.94 సెకన్లలోనూ పూర్తి చేయగా బోల్ట్ 9.95 సెకన్లలో పూర్తి చేశాడు. కాగా, చివరి పరుగులో మూడో స్థానంలో నిలిచినా రేపు పూర్తయిన వెంటనే బోల్ట్ ఏమాత్రం నిరాశ చెందకుండా విజేతగా నిలిచిన గాట్లిన్‌కు అభినందనలు తెలిపాడు. తరువాత అభిమానుల వైపు వెళ్లి వారితో మాట్లా డుతూ, ఫోటోలకు ఫోజులిస్తూ, సెల్ఫీలు దిగాడు. బోల్ట్ చివరి పరుగును చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివ చ్చారు. తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీ యంగా ఎంతో మంది క్రీడాభిమానులను సంపాదిం చుకున్న బోల్ట్ చివరి పరుగులోనూ గెలుపొందు తాడని ఆశించిన ప్రేక్షకులకు నిరాశ తప్పలేదు.

సామాన్యుడి బిడ్డనైతే నా గతేంటీ?

- బిజెపి నేత తనయుడు అత్యాచారానికి తెగించేవాడేమో
- వేధింపుల బాధితురాలి వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వికాస్ కుటుంబ దుష్ప్రచారం

చండీగఢ్ : నేను ఐఏఎస్ అధికారి కూతురుని కాబట్టి బతికిపోయా. ఆ రాత్రి వేళ ఆ దుండగులు నన్ను అపహరించి అత్యాచారం చేసే ఉద్దేశంతోనే వెంబడించారు. కారుకు అడ్డంగా వచ్చి దారిని దిగ్బంధించారు. అదృష్టం కొద్దీ నేను సామాన్యుడి కూతురుని కాకపోవడంతో పోలీసులు వెంటనే స్పందించి రక్షించారు. అదే సామాన్యుడి బిడ్డనైతే పట్టించుకునేవాళ్లా?..బిజెపి హర్యానా రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ నుంచి వేధింపులను ఎదుర్కొన్న బాధిత యువతి ఆవేదన ఇది

దేశంలో సామాన్యుల పట్ల, ప్రముఖుల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరించే తీరుకు ఆమె వ్యాఖ్యలు దర్పణం పడుతున్నాయి. శుక్రవారం రాత్రి వేధింపులకు గురైన సమయంలో ఛండీగఢ్ పోలీసులు తక్షణమే స్పందించి తనను రక్షించారని, అందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆమె పేర్కొన్నారు. అయితే మిగతా 9లో

రెండంకెల గ్రాఫ్ నేలచూపు



- క్రమేపి తగ్గుతున్న విస్తీర్ణం
- మూడేళ్లుగా ఇదే వరుస
- ఈ ఏడాదీ అదే దారి
- మాటల్లోనే రెండంకెల వృద్ధి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయంలో రెండంకెల వృద్ధిరేటు సాధిస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం ఊదరకొడుతుండగా రాష్ట్రంలో సాగు అంతకంతకూ తగ్గుతోంది. నవ్యాంధ్రలో తెలుగుదేశం సర్కారు అధికారంలోకొచ్చాక గడచిన మూడేళ్లలో వరుసగా సాగు విస్తీర్ణం క్షీణిస్తోంది. ఈ ఏడాదన్నా సేద్యం పెరుగుతుందనుకోగా, ఆదిలోనే హంసపాదులా పలు జిల్లాల్లో తిష్ట వేసిన వర్షాభావంతో ఆశలు ఆవిరవుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సేద్యపు గణాంకాలు నేల చూపులు చూస్తుండగా, మరికొన్ని రోజులు వానలు పడకపోతే సాగు విస్తీర్ణం బాగా తగ్గుతుందని, మూడేళ్ల కంటే కూడా దిగజారుతుందని వ్యవసాయ, అర్థగణాంక, సాగునీటి పారుదల విభాగాలు అంచనాలు కడుతున్నాయి. ఏపీలో పంటల సాగు ఖరీఫ్‌లోనే ఎక్కువ.రబీ గాలివాటం. పెద్దగా ఆశలుండవు. కాగా ఈ ఏడాది ఖరీఫ్ సమయంలోనే ప్రధాన జలాశయాల్లో నీళ్లు నిరుటి కంటే అడుగంటిన తరుణంలో ఇక రబీ గురించి ఆలోచించే పరిస్థితి లేదు.

గ్రోత్ ఇంజన్లు స్లో

మూడేళ్లుగా రెండకెల వృద్ధిరేటు సాధనకు సర్కారు ఎంపిక చేసుకున్న గ్రోత్ ఇంజన్లు (పంటలు) కదలక్లేక కదులుతున్నాయి. దీంతో పంటల విస్తీర్ణం గ్రాఫ్ క్రమేపి కిందకు దిగుతోంది. 2014-15లో ఖరీఫ్, రబీ కలుపుకొని 62.09 లక్షల హెక్టార్లలో, 2015-16లో 59.99 లక్షల హెక్టార్లు, 2016-17లో 59.53 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇక 2017-18లో 13.4 శాతం అధికంగా 67.49 లక్షల హెక్టార్లలో పంటలు సాగును సర్కారు లక్ష్యంగా నిర్ణయించింది. ఒక్క ఖరీఫ్‌లోనే 42.07 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని టార్గెట్ పెట్టుకుంది. నిరుడు కూడా ఇంచుమించు ఇలాగే లక్ష్యాలు నిర్ణయించినా ఆచరణలో చతికిలపడింది. గుణపాఠాలు తీసుకోకుండా ఈ ఏడాది కూడా గొప్పలకుపోగా ఖరీఫ్ మొదట్లోనే వాతావరణం అనుకూలించక సాగు సాగట్లేదు.

నిరుటి కంటే దారుణం

నిరుడు వేరుశనగ 80 శాతం సాగయ్యాక వర్షాభావం వచ్చింది. ఈ ఏట మొదట్లోనే రాయలసీమలో వర్షాల్లేక సాగు విస్తీర్ణం పడిపోయింది. దీంతో ఈ సంవత్సరం నూనెగింజలు బాగా తగ్గనున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్, సోమశిల, తుంగభద్ర ఏ రిజర్వాయరులోనూ నీరు లేదు. గతేడాది కంటే నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో ప్రాజెక్టుల కింద ఆయకట్టులో సాగు తగ్గనుంది. పట్టిసీమ వలన కృష్ణాడెల్టాలో వరినారుమళ్లకు, నాట్లకు కొంత వరకు ఇబ్బంది లేకపోయినా ప్రస్తుతం గోదావరిలో వరద లేనందున పట్టిసీమ నీరు ఆగిపోయింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో అసలే నీరు లేనందున భవిష్యత్తులో కృష్ణా డెల్టాలో పంటలను రక్షించడం సర్కారుకు సవాల్‌గా మారింది. సాగర్‌లో నీరు లేనందున ఈ ఏడాది కూడా కుడికాల్వ కింద సాగు లేనట్లే. ఆ మేరకు వరి తగ్గుతోంది. తుంగభద్రలో నీరు లేనందున మిగతా 9లో

సాగు క్షీణత ఇలా (లక్షల హెక్టార్లు)

సంవత్సరం	ఖరీఫ్	రబీ	మొత్తం
2014-15	39.39	22.70	62.09
2015-16	35.45	24.54	59.99
2016-17	39.60	19.93	59.53
2017-18(టార్గెట్)	42.07	25.42	67.49
2017-18 (అంచనా)	38.00	19.00	57.00



'మద్దతు ధర'కు చట్టం

- బివి రాఘవులు డిమాండ్ 2

అంతా 'సెల్ఫ్ ఫైనాన్సే'



- వర్సిటీల నిర్వహణ బాధ్యత నుండి తప్పుకుంటున్న సర్కారు
- జిఓ 36 మతలబిదే!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశ్వవిద్యాలయాల నిర్వహణ బాధ్యత నుండి తప్పుకునే దిశలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అవసరమైన నిధులు విడుదల చేయడానికి బదులుగా వాటిని వర్సిటీలే సమకూర్చుకోవాలని సూచిస్తోంది. ఇటీవల విడుదల చేసిన 36వ నెంబర్ జిఓలోని సారాంశం ఇదేనన్న అభిప్రాయం విద్యావేత్తల్లో వ్యక్తమవుతోంది. సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ కోర్సులు, విరాశాల ద్వారా నిధులు సమకూర్చుకోవాలని ఈజిఓలో ప్రభుత్వం సూచించింది. ప్రైవేట్ విద్యా సంస్థల తరహాలో ఫీజులు వసూలు చేసి యూనివర్సిటీల అభివృద్ధికి ఉపయోగించు కోవాలని ఆర్థిక శాఖ సలహా కమిటీ ఇప్పటికే యూనివర్శిటీలకు సలహాఇచ్చిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు విసిలతో సమావేశంలో సూచన మేరకు ఆర్థిక శాఖ సలహా కమిటీ సూచించింది. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలు 14 ఉన్నాయి. ఇప్పటికే అనేక యూనివర్సిటీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. ప్రభుత్వ నుంచి రావాల్సిన నిధులు అందకపోవడంతో నిర్వహణ ఖర్చులు కూడా లేక మూసేసుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్నాయి. కృష్ణా, నన్నయ్య, అంబేద్కర్, యోగి వేమన వంటి యూనివర్సిటీలు ప్రధానంగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టలాడుతున్నాయి. కృష్ణా జిల్లాలో ఉన్న కృష్ణా యూనివర్సిటీ నిర్మాణానికి రెండేళ్ల క్రితం స్థలం మంజూరయినా నిధులు లేకపోవడంతో ఆర్ట్స్ కళాశాల భవనంలో ఇప్పటికీ నడుస్తోంది. ఆంధ్ర యూనివర్సిటీకి రావాల్సిన నిధులను ఈ ఏడాది రాష్ట్రప్రభుత్వం తగ్గించేసింది. ఇప్పటికే యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యుజిసి) నిధులు కూడా యూనివర్సిటీలకు అందడం లేదు. జాతీయ గుర్తింపు మండలి(నాక్) ఇచ్చే పాయింట్లను బట్టి యూనివర్సిటీలకు యుజిసి నిధులు అందిస్తోంది. యూనివర్సిటీల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం, అంతర్గత సమస్యలు ఏర్పడ్డాయి. అన్ని యూనివర్సిటీల్లో కలిపి సుమారు 1,400 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండేళ్ల నుంచి ఈ పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో నాక్ పాయింట్లు తగిపోయి నిధులు సరిగా రావడం లేదు. ఇప్పుడు సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ కోర్సులు ద్వారా ఆదాయలు పెంచుకో వాలని ప్రభుత్వం సూచించింది. అందులో భాగంగానే అన్ని యూనివర్సిటీ ల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం జులై 26న జీవో 46 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ కోర్సులను మిగతా 9లో

హోరాహోరీ



వేడెక్కిన నంద్యాల ఉప ఎన్నిక


ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. నంద్యాలలో వైసిపి అధినేత జగన్ పర్యటనతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయికి చేరాయి. 2019లో జరిగే సాధారణ ఎన్నికలకు ఇవి సెమీఫైనల్‌గా రాజకీయ విశ్లేషకులు పరిగణిస్తున్నారు. దీంతో ఎలాగైనా నంద్యాల ఉప ఎన్నికలో గెలిచి రాజకీయ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో టిడిపి, వైసిపిలు వ్యూహ, ప్రతి వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో అడ్రస్ గల్లంతయిన కాంగ్రెస్ పార్టీ కూడా తన భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ఈ ఎన్నికల్లో అభ్యర్థిని రంగంలోకి దింపింది. భూమా నాగిరెడ్డి మృతితో ఖాళీ అయిన నంద్యాల అసెంబ్లీ స్థానం ఆ కుటుంబానికే ఏకగ్రీవంగా ఇవ్వాలని టిడిపి పెట్టిన అభ్యర్థనను వైసిపి తిరస్కరించడంతో అక్కడ ఎన్నిక అనివార్యమైంది. దీంతో అధికార తెలుగుదేశం పార్టీ నంద్యాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

మూడేళ్లపాటు అధికారంలో ఉన్నా ఏ ఒక్క పనీ చేపట్టని తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలు అనివార్యం కావడంతో నిధుల వరదతో నంద్యాలను ముంచెత్తింది. రహదారులు, పట్టణ రోడ్ల విస్తరణ, వరద నివారణ చర్యలు, కుందూ, చామకాల్వలపై బ్రిడ్జిలు, గృహాలు దాదాపుగా రూ.1300 కోట్లు విలువ చేసే పనులను యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టింది. ఈ అభివృద్ధిని కొనసాగించేందుకు టిడిపి అభ్యర్థిని గెలిపించాలని కోరుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నెల రోజుల పరిధిలో నంద్యాలలో నాలుగు రోజులపాటు మకాం చేసి వ్యూహ రచన చేశారు. అనంతరం ఆయన కుమారుడు లోకేశ్ పర్యటన, మిగతా 9లో

ఆరుతున్న నిప్పుపై జైట్లీ ఆజ్యం

- కేరళలో శాంతి చర్చల సమయంలో పర్యటన
- లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వంపై దుష్ప్రచారం
- కేరళ ఉగ్రరాష్ట్రమంటూ అనుచిత వ్యాఖ్యలు



ప్రజాశక్తి ప్రతినిధి - తిరువనంతపురం

బిజెపి సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేరళలో పర్యటించడం ఆరుతున్న నిప్పును ఎగదోసే ప్రయత్నంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయని చెబుతున్న జిల్లాల్లో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపికి, సిపిఎం స్థానిక నాయకుల మధ్య నిర్వహించిన చర్చలు సత్ఫలితాలిస్తున్న సౌహార్ద సమయంలో జైట్లీ పర్యటించి కేరళ ప్రభుత్వంపైనా, సిపిఎంపైనా దుష్ప్రచారం చేయడం గమనార్హం. జాతీయ మీడియాలో ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న పాత్రికేయులను పనిగట్టుకొని జైట్లీ పర్యటన కవరేజీకి బిజెపి రప్పించడం విశేషం. తిరువనంతపురంలోని శ్రీకరయమ్‌లో జరిగిన సంఘ్ పరివార్ ముఠాకక్షలో చనిపోయిన ఆరెస్సెస్ కార్యకర్త కుటుంబాన్ని జైట్లీ ఆదివారం పరామర్శించారు. ఒకవైపు ఈ హత్యను రాజకీయం చేస్తూనే మరోవైపు సిపిఎం కార్యకర్తలపై పరివార్ గూండాలు వారం రోజులుగా దాడులకు యత్నిస్తూనేవున్నారు. కేరళలో రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీలో ఆరెస్సెస్ నాయకులు డిమాండ్ చేసిన రెండు రోజుల్లోనే జైట్లీ కేరళలో మిగతా 9లో

విద్వేష ప్రచారంతో పెట్టుబడులపై ప్రభావం : పినరయి

కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ఒకవైపు విద్వేష ప్రచారం సాగిస్తున్న సమయంలోనే..అఖిల పక్ష పార్టీలతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ సమావేశం నిర్వహించారు. శాంతియుత వాతావరణం కొనసాగించేందుకు కట్టుబడివున్నా మని అన్ని పార్టీల నాయకులూ సమావేశంలో తీర్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ జైట్లీ వ్యాఖ్యలకు ధీటైన బదులిచ్చారు. కేరళపై ఈ రకమైన విద్వేష ప్రచారం వల్ల పెట్టుబడుల రాకపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలపక్ష సమావేశం జరిగిన తరువాత మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ రకమైన దుష్ప్రచారం కేరళకు వచ్చే పెట్టుబడుల రాకపై దుష్ప్రభావాన్ని చూపుతుందన్నారు. హింసకు పాల్పడేవారిపైక్కే పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు.

ప్రజ్ఞ

1. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఇప్పటివరకూ విజేందర్ వరుసగా ఎన్ని విజయాలు నమోదు చేశారు?
2. ముప్పవరపు వెంకయ్యనాయుడు భారత్‌కు ఎన్నో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
3. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ప్రసూతి సెలవులను ఎన్నిరోజులకు పొడిగించింది?
4. ప్రపంచ అథ్లెటిక్స్‌లో 10 వేల మీటర్ల పరుగులో స్వర్ణం సాధించింది ఎవరు?
5. పాక్‌లో షాహిద్ కనాస్ అబ్బాసి కేబినేట్‌లో చోటు దక్కించుకున్న హిందూ మంత్రి ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాతావరణం



రాష్ట్రానికి వర్ష సూచన

జార్ఖండ్ పరిసరాల్లో ఆవర్తనం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

జార్ఖండ్ నుండి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోందని, వీటి ప్రభావంతో కోస్తాలో పలుచోట్ల, తెలంగాణలో అక్కడక్కడా చెదురుమదురు జల్లులు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రెండ్రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఆదివారం నాటికి దక్షిణ జార్ఖండ్ మీదకు చేరుకున్నట్లు ప్రకటించింది. 7.6 కి.మీ ఎత్తులో ఆవరించి ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణం వైపునకు మళ్లినట్లు తెలిపింది. ఆదివారం ఉదయానికి పలాసలో 7.5, ఇచ్ఛాపురంలో 4.2, కూనవరంలో 3.3, విశాఖ ఎయిర్‌పోర్టు 3.2, అనకాపల్లి, అరకు వేలీలో 1.7, పాతపట్నం, సోంపేటలో 1.5 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

'మద్దతు ధర'కు చట్టం

బివి రాఘవులు డిమాండ్

- ప్రజా సమస్యలపై 15 నుంచి దేశవ్యాప్త ప్రచారోద్యమం
- ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు సంఘటిత పోరాటాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మద్దతు ధరను చట్టబద్ధ హక్కుగా గుర్తించి చట్టం చేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని పరిపుష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారన్నారు. బ్యాంకు రుణాలు పొందే హక్కు కల్పించాలన్నారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల రుణాలు రూ.1.56 లక్షల కోట్లను మాఫీ చేసిన కేంద్రం, రైతుల రుణాల మాఫీ తమ బాధ్యత కాదని తప్పించుకోవడం సరికాదన్నారు. రాష్ట్రాల దయాదాక్షిణ్యాల మీద రైతుల్ని వదిలేయకుండా దేశవ్యాప్తంగా రుణమాఫీ చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న అయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన కేంద్ర కమిటీ సమావేశాల్లో ప్రజలు తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రచారోద్యమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. కేంద్ర కమిటీ సమావేశాల్లో ప్రధానంగా ఆరు సమస్యల్ని గుర్తించామన్నారు. సెప్టెంబర్ 1న ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిస్తామన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగా ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టించడంలో నరేంద్రమోడీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. జీఎస్టీ, నోట్ల రద్దు కారణంగా అనేకమంది ఉపాధి కోల్పోయారన్నారు. ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.

ఎయిరిండియా, రైల్వే సహా అనేక ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రయివేటీకరించి, వాటి ఆస్తులు కొల్లగొట్టడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఈ ప్రయత్నాలను సంఘటితంగా పోరాటాలు చేసి అడ్డుకోవాలని రాఘవులు పిలుపునిచ్చారు. మహిళా బిల్లుపై అన్ని పార్టీలూ అంగీకరిస్తున్నందున ఈ బిల్లును ఆమోదించాలన్నారు. ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ, పాలస్తీనాకు వెళ్లకుండా కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారని, ఇది అమెరికాకు దగ్గర కావడం కోసమేనని ఆయన విమర్శించారు. సిపిఎం అఖిల భారత మహాసభలు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకూ పార్టీ నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకపక్ష కుటుంబపాలన సాగుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలు, భూ నిర్వాసితుల సమస్యలను ప్రస్తావిస్తున్నందుకు సిపిఎంపైనా, ప్రచురించినందుకు 'నవ తెలంగాణ' పత్రికపైనా ఆయన విమర్శలు చేస్తున్నారని తెలిపారు. 'నవ తెలంగాణ' పత్రికపై కక్షగట్టి ప్రభుత్వ ప్రకటనలు కూడా ఇవ్వడం లేదని తమ్మినేని వెల్లడించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, బి వెంకట్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి

అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాన్ని నిలిపేయాలి

దొండపాడు ఘటనను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామంలో అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వడాన్ని వ్యతిరేకిస్తున్న దళితులపైనా, వారికి సంఘీభావం తెలిపిన సిపిఎం నాయకులపైనా అగ్రకుల పెత్తందార్ల దాడి ఘటనను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో దళితుల నివాస స్థలాల పక్కన అక్రమంగా రొయ్యల చెరువుల్ని తవ్వుతున్నారని, దీనికి వ్యతిరేకంగా రెండు నెలలకుపైగా ఆందోళనలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, గూడురు ఆర్డీవో, తహసిల్దార్లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారన్నారు. అక్రమంగా చెరువులు తవ్వడానికి ప్రయత్నిస్తున్నవారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లు అధికారపార్టీ అండదండలతో ఈ నెల 5న మధ్యాహ్నం పొక్లెయిన్లు పెట్టి తవ్వకం ప్రారంభించారని పేర్కొన్నారు. నిరసన తెలియజేస్తున్న దళిత మహిళలపైనా, సిపిఎం నాయకులపైనా మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారని వివరించారు. ఈ దాడిలో తమ పార్టీ డివిజన్ సభ్యులు బివి శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయని, దొండపాడు గ్రామానికి చెందిన సబ్బే అనిల్ తల పగిలిందని తెలిపారు. అనిల్ తల్లి, మరో దళిత మహిళ ఎలిజిబెత్ రాణి తీవ్రంగా గాయపడడంతో స్పృహ కోల్పోయారని వివరించారు. పోలీసులు ఇంతవరకూ నిందితుల్ని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దోషుల్ని అరెస్టు చేయాలని, అక్రమ రొయ్యల చెరువు తవ్వకాన్ని ప్రభుత్వం నిరోధించాలని మధు డిమాండ్ చేశారు.

రైతాంగ సమస్యలపై 9న కలెక్టరేట్ల ముట్టడి

వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘాలు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భూమి అధికార్ ఆందోళన కమిటీ పిలుపు మేరకు ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపడతామని రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాలు ప్రకటించాయి. అదే రోజు విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద అన్ని ప్రజాసంఘాల మద్దతుతో ఆందోళన చేస్తామని తెలిపాయి. ఆదివారం విజయవాడ శ్రీశ్రీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. కేశవరావు మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలివ్వాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చెరకు ధర టన్నుకు రూ 4 వేలు ఇవ్వాలని, రైతుల రుణాల్ని పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. భూసేకరణ చట్టాన్ని పూర్తిగా అమలుచేసి, బంజరు భూములతో సహా అన్ని రకాల భూములకు 2013 చట్టాన్ని అమలుపర్చాలన్నారు. అటవీ చట్టాన్ని అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, ఉపాధి హామీ పనిదినాల్ని 200 రోజులకు పెంచి రూ 350 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. జమలయ్య మాట్లాడుతూ ప్రతియేటా దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. 2014లో 12,500 రైతు ఆత్మహత్యలు నమోదవగా, 2015లో 13 వేలు, 2016లో 14 వేలు నమోదయ్యాయని వివరించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పనులన్నీ యంత్రాలతో చేయిస్తున్నారన్నారు.

కౌలు రైతులకు కార్డులివ్వకపోవడంతో బ్యాంకులు రుణాలివ్వడంలేదని పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ 5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని, కౌలు రైతులందరికీ కార్డులిచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు పంచనామ ఆధారంగా నష్ట పరిహారమివ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల్ని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి. పెద్దిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. క్రాంతి, రైతుసంఘం ఉపాధ్యక్షులు నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి సమావేశంలో పాల్గొన్నారు.

జలవనరులశాఖలో 518 మంది ఎఇఇల నియామకం

నేడు పోలవరం వద్ద నియామకపత్రాలు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జలవనరుల శాఖలో నూతనంగా 518 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఎఇఇ) నియమితులయ్యారు. ఎపిపిఎస్‌సి ద్వారా నియామకమైన వీరికి పోలవరం ప్రాజెక్ట్ వద్ద సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియామక పత్రాలను అందజేయనున్నారు. దీనిద్వారా నూతన ఇంజనీర్లకు ఈ ప్రాజెక్టును సందర్శించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. జలవనరులశాఖలోకి వచ్చే యువ ఇంజినీర్లకు ఒక ప్రాజెక్ట్ స్థలంలో నియామక పత్రాలు అందచేయడం ఇదే తొలిసారని జలవనరులశాఖ ఈ సందర్భంగా పేర్కొంది. ఏఇఇలుగా ఎంపికైన అభ్యర్థులంతా సోమవారం ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సభాస్థలానికి చేరుకోవాలని ప్రభుత్వం సూచించింది.

'స్వాతంత్ర్య' వేడుకలు వైభవంగా నిర్వహించేలా కృషి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతిలో ఈనెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని వైభవంగా నిర్వహించేలా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్నతోపాటు పలుశాఖల ఉన్నతాధికారులతో దినేష్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేడుకల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వేదిక మొదలు పార్కింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా సమీక్షించారు. అనంతరం చిత్తూరు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల తీరును, సంఖ్యాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెల్టుషాపులు, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. చిత్తూరు - నాయుడుపేట, పలమనేరు-కృష్ణగిరి, పూతలపట్టు- పీలేరు- రాయచోటి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సిసిరోడ్లు, మరుగుదొడ్లు, వర్మీకంపోస్టు, వేస్ట్‌మేనేజ్‌మెంట్, ఇంకుడు గుంతల తవ్వకాలు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దినేష్‌కుమార్‌కు కలెక్టర్ వివరించారు.

గౌతం సవాంగ్ వ్యాఖ్యలపై నన్నపనేని అభ్యంతరం

- ఆయేషా కేసును ఆయనకి అప్పగించొద్దు
- సిఎం దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆయేషామీరా కేసు విషయంలో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ చేస్తున్న వ్యాఖ్యలు మొదట్నించీ అభ్యంతకరంగా ఉన్నాయని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిన సత్యంబాబును ప్రధాన నిందితుడని ఆయనెలా సంభోదిస్తారని ప్రశ్నించారు. విజయవాడలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ కేసును విచారించే స్పెషల్ ఇన్వెష్టిగేషన్ టీం (సిట్)కు గౌతం సవాంగ్ పర్యవేక్షణ వద్దన్నారు. మహిళా అధికారిని కానీ, వేరే పోలీస్ అధికారిని కానీ నియమించాల్సిందిగా డిజిపిని కోరతామన్నారు. ఇదే విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అప్పటి పోలీసులు అసలు నిందితుల్ని తప్పించి అమాయకుడి జీవితాన్ని నాశనం చేశారన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కేసును పునర్విచారణ చేయడం ఊరట కలిగించే అంశమని, అసలైన దోషుల్ని పట్టుకునేందుకు అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కేసు విషయంలో ఆయేషా తల్లిదండ్రులకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కేసును సిబిఐకి అప్పగించాలంటూ ఆయేషా తల్లిదండ్రులు కోర్టును కోరనున్నారని, పాటు మహిళా కమిషన్ కూడా ఇందుకు సహకరిస్తుందన్నారు. ఆయేషా తల్లిదండ్రులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారని, వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కోర్టు విషయంలో సహాయం చేస్తామన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆమె తాజాగా జరిగిన డాక్టర్ సూర్యకుమారి, శిరీషల ఉదంతాలపై బాధను వ్యక్తం చేశారు. వారిది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో విచారణ చేపట్టాలని పోలీసుల్ని కోరారు. మహిళలు అనాలోచితంగా ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇందుకు కారణమైన వ్యక్తుల్ని కఠినంగా శిక్షించాలని నన్నపనేని డిమాండ్ చేశారు. త్వరలోనే డాక్టర్ సూర్యకుమారి స్వస్థలం జి కొండూరు వెళ్లి ఆమె తల్లిదండ్రుల్ని పరామర్శిస్తానన్నారు. మహిళలకు అవగాహన కల్పించడానికి కమిషన్ ద్వారా అనేక కార్యక్రమాలు, వర్క్‌షాపులు, సెమినార్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళా మంత్రిని కించపర్చడం సరికాదు

డ్రస్‌కోడ్‌పై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని రాజకుమారి అన్నారు. మహిళా మంత్రిని కించపరిచే వ్యాఖ్యలొద్దన్నారు. చుడిదార్, పంజాబీ దుస్తులు సంప్రదాయ వస్త్రాలని, వాటిని తిరుమల కొండ మీద కూడా అనుమతిస్తారని గుర్తు చేశారు. అటువంటి దుస్తులు ధరించిన వారిని కించపరిచే విధంగా ఎవరు మాట్లాడినా ప్రతిఘటించాలన్నారు. ప్రజలతో, రాజకీయాలతో మమేకమైన వారు తప్పనిసరిగా సభ్యతతో కూడిన దుస్తుల్ని ధరించాలన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

పోలీసుల్లో దుమారం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేకెత్తించిన ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణకు సంబందించి ఏపి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ఆదివారం విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లో చేసిన వ్యాఖ్యలు పోలీసు వర్గాల్లో పెద్ద దుమారాన్నే లేపాయి. ఆయేషా హత్య కేసుకు సంబంధించి పునర్విచారణలో భాగంగా ప్రభుత్వం రెండు రోజుల క్రితం నియమించిన కమిటీలో డిఐజి అధికారి విచారణాధికారిగా ఉంటారని, సిపి గౌతంసవాంగ్ పర్యవేక్షణ మాత్రమే చేస్తారని పేర్కొన్నారు. కమిటీలో ఏయే అధికారులు ఉంటారనే విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత నివ్వలేదు. ఈ లోగానే గౌతంసవాంగ్ పర్యవేక్షణ కాకుండా మహిళా అధికారి పర్యవేక్షణ ఉండాలని నన్నపనేని పేర్కొనడంతో అధికారపార్టీలో ఏమి జరుగుతుందనే విషయం చర్చకు తెరదీసింది. ఈ కేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొన్న సత్యంబాబును ఇటీవల హైకోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. దీంతో ఆయేషా కేసులో అసలు దోషులెవరో తేల్చాలని ప్రజాసంఘాలు, ఆయేషామీరా తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ఆయేషా తల్లిదండ్రులు కేసు పునర్విచారణ సిబిఐకి అప్పజెప్పే విధంగా సూచించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని దర్యాప్తు ముందుకు సాగుతుందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కేసులో సత్యంబాబు నిందితుడు కాదని హైకోర్టు తీర్పు నేపధ్యంలో ప్రజల్లో అనుమానాలు ఉన్న కోనేరు సతీష్‌ను పోలీసులు విచారిస్తారా? లేదా? అనే అంశంపై సిట్ అధికారులు స్పష్టత నివ్వాల్సిన ఆవశ్యకత ఉంది. అప్పట్లో దర్యాప్తు చేసిన పోలీసు అధికారుల్లో కొందరు ప్రస్తుతం తెలంగాణాలో పనిచేస్తున్నారు. మరి కొందరు పదవీ విరమణ పొందారు. వీరిపైన ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలకు ఉపక్రమిస్తారనే విషయంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాల్సిన ఆవశ్యకత ఉంది. 2007లో కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని బాలికల హాస్టల్‌లో బిఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా దారుణ హత్యకు గురైంది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నెంబరు 477/2007 సెక్షన్లు 302, 376 ఐపిసి కింద కేసు నమోదైంది. సత్యంబాబు నిర్దోషిగా బయటకు రావడంతో పోలీసులు సిట్ నేపధ్యంలో అసలు దోషులను వెలుగులోకి తెస్తారో లేదో వేచిచూడాల్సిందే.

ముద్రగడను మళ్లీ అడ్డుకున్న పోలీసులు

- నోటికి నల్లరిబ్బన్లతో ముద్రగడ నిరసన

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కొద్దిరోజులుగా తన ఇంట్లో నిరసన తెలుపుతున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆదివారం గేటు దాటారు. దీంతో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. పాదయాత్రకు అనుమతి ఇవ్వకపోవడంతో ముద్రగడ ప్రతిరోజూ ఉదయం తన ఇంటి నుంచి పాదయాత్ర చేపట్టడం, వెంటనే పోలీసులు అరెస్టు చేస్తున్నారు. అయితే ముద్రగడ ఈసారి ఆదివారం తన ఇంటి నుంచి చాలా దూరం నడిచి, పోలీసులు కాపుగాస్తున్న గేటును దాటి వచ్చారు.

దీంతో పోలీసులు అప్రమత్తమై వెంటనే ఆయనను అడ్డుకున్నారు. పాదయాత్రకు అనుమతి లేదని చెప్పారు. ఈసందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాపులను బిసిల్లో చేరుస్తామని బూటకపు హామీలతో చంద్రబాబునాయుడు అధికారం చేపట్టారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఉద్యమిస్తున్న తమపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. జెఎసి నాయకులు ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కాపుల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కాపుజాతి పేరుతో మంత్రులు, ఎంఎల్‌ఎలుగా కొనసాగుతున్న వ్యక్తులు ముఖ్యమంత్రి భజన చేస్తూ కాపుజాతిని అపహాస్యం చేసేవిధంగా వ్యవహరిస్తున్నారని జెఎసి నాయకులు ఆరేటి ప్రకాష్, జివై దాసు, తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఇప్పటికైనా ముద్రగడ చేస్తున్న ధర్మపోరాటానికి అడ్డంకులు కలిగించే ఎటువంటి శక్తులైనా కొట్టుకుపోయే రోజులు త్వరలోనే రానున్నాయన్నారు. అనంతరం పోలీసుల తీరును ఖండిస్తూ ముద్రగడ నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పి.గన్నవరం మండలంలోని బోడపాటివారిపాలెంలో గ్రామస్తులు నిరవధిక దీక్షలు చేపట్టారు.

అశ్రునయనాల మధ్య సుధీర్ అంతిమయాత్ర

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ముంబాయిలో అనుమానాస్పదంగా మృతిచెందిన సుధీర్ అంతిమయాత్ర అశ్రు నయనాల మధ్య సాగింది. సుధీర్ మృతదేహాన్ని ఆదివారం నెల్లూరులోని సుందరయ్యనగర్‌కు తీసుకొచ్చారు. అతని పార్థీవదేహాన్ని చూసేందుకు ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రజా సంఘాల కార్యకర్తలు, కెఎన్‌ఆర్ పాఠశాల విద్యార్థులు, బంధువులు, స్నేహితులు, సిపిఎం కార్పొరేటర్ పద్మజ, సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు బివి.రమణా రెడ్డి, స్థానిక నాయకులు సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సుందరయ్య కాలనీ నుంచి బొడిగాడితోట వరకు అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర సాగింది. అనంతరం దహన సంస్కారాలు జరిగాయి.



సుధీర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నత్తనడకన అంగన్వాడీ భవనాలు

- నిర్మాణాలు ప్రారంభించనివి 2వేలు
- జులై నాటికి పూర్తి చేసినవి 673

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామాల్లోని అధిక సంఖ్యలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేకపోవడంతో అద్దె ఇళ్లు తీసుకుని, అద్దెలు చెల్లించలేక, ప్రభుత్వం నుంచి బిల్లులు సమయానికి రాక అంగన్వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయిస్తున్నా పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణాలు పూర్తి కావడం లేదు. ఈ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న అంగన్వాడీ భవనాల నిర్మాణం ఏళ్ళు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. గతేడాది 7,048 అంగన్వాడీ భవనాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడాది గడిచినా కేవలం 1,477 భవనాల్ని మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 5,571 భవనాలను ఈ ఏడాది పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది జులై నాటికి 1,116 భవనాలను పూర్తి చేయాలని నిర్ణయించగా కేవలం 673 భవనాలను మాత్రమే పూర్తి చేశారు. సుమారు రెండు వేల భవనాల వరకూ పనులు కూడా ప్రారంభించని పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులకు నిధుల కొరత లేదని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్పష్టం చేశారు. అయినప్పటికీ అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం వేగవంతం కావడం లేదు. ప్రధానంగా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వీటి నిర్మాణంలో పురోగతి కనిపించడం లేదు. క్షేత్ర స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, అధికారులు ఈ అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడం వల్లే నిర్మాణాల్లో పురోగతి లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. నగర, పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీల్లో స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. మండల స్థాయిలో అధికారులు నిర్మాణాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అంగన్వాడీ కేంద్రాల భవనాలు పూర్తి కాకపోవడంతో చిన్నారులు, అంగన్వాడీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి అంగన్వాడీ భవనాల నిర్మాణం వెంటనే పూర్తి చేయాల్సిన అవసరముంది.



తిరుపతిలో ప్రుడెన్షియల్ ఫ్యాక్టరీ

ఆ ఊరిని కాలుష్య భూతం కాటేసింది.. ఐదేళ్ల కాలంలో ఆ ఊళ్లో 40 మంది యువతీ యువకులు వింత వ్యాధులతో మృత్యువాత పడ్డారు. వందల మంది చర్మ సంబంధ వ్యాధులు, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బక్కచిక్కిన బతుకుల్లో ఈ వ్యాధులు వారిని ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. కాలుష్యం ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఈ నీటిని తాగుతున్న చిన్నారులు వయసొచ్చినా ఎదగని పరిస్థితి. 22 ఏళ్ల క్రితం తీసుకొచ్చిన ప్రుడెన్షియల్ సుగర్ ఫ్యాక్టరీ వెదజల్లే వ్యర్థంతో ఇబ్బందులు పడుతున్న కొప్పేడు దళితవాడ ప్రజలు, త్వరలోనే అనుబంధంగా విద్యుత్ ప్లాంట్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. తమ బతుకులు ఛిద్రం చేయొద్దంటూ 70 రోజులుగా నింద్ర మండల కేంద్రంలో రిలేదీక్ష కొనసాగిస్తున్నారు. అయినా ప్రజాప్రతినిధులు గానీ, అధికార యంత్రాంగం గానీ వారి గోడును పట్టించుకోకపోవడం గమనార్హం.

మనుషులను మింగేస్తున్న కాలుష్య భూతం..

- కొప్పేడులో ఐదేళ్లలో 40 మంది మృతి
- వందల సంఖ్యలో వ్యాధులతో విలవిల
- మురుగునీటిని తలపించేలా తాగునీరు
- వయసొచ్చినా ఎదగని చిన్నారులు
- విద్యుత్ ప్లాంట్ వద్దంటూ డిమాండ్
- 70 రోజులుగా కొనసాగుతున్న రిలేదీక్ష



69 రోజులుగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న దళితులు

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

నింద్ర మండలం కొప్పేడు దళితవాడ సమీపంలో 22 ఏళ్ల క్రితం 1996లో ప్రుడెన్షియల్ సుగర్ ఫ్యాక్టరీని నెలకొల్పారు. దీని యాజమాన్యం మారి ప్రస్తుతం నేతమ్స్‌గా పిలవడుతోంది. స్థానిక ప్రజల అంగీకారం లేకుండానే అప్పట్లో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. అలాగే, రాజకీయ పలుకుబడితో 15 ఏళ్ల క్రితం ఈ ఫ్యాక్టరీ పక్కనే సాయిరారా బయో కెమికల్ ఫ్యాక్టరీ నెలకొల్పారు. ఈ రెండు పరిశ్రమలు వెదజల్లే వ్యర్థాలతో కొప్పేడు దళితవాడ కాలుష్య కోరల్లో కూరుకుపోయింది. వాస్తవానికి వ్యర్థపు నీటిని శుద్ధి చేసిన తరువాతనే బయటకు వదలాలి. అలాగాక.. డైరెక్టుగా పైపుల ద్వారా రోడ్డుపైకి, గ్రామాలపైకి వదిలేస్తున్నారు. దీన్ని ఆనుకునే ఉన్న కొప్పేడు దళితవాడలో 400 నివాసాలున్నాయి. ఈ కాలుష్య నీటితో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. సుగర్ ఫ్యాక్టరీ వల్ల బూడిద ఎగిరిరావడం, కళ్లల్లో పొట్టు పడడంతోపాటు, కాలుష్యం నీటితో చర్మ సంబంధిత వ్యాధులు, మూత్రపిండం, గుండె, ఊపిరితిత్తుల జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల కాలంలో వివిధ రకాల జబ్బులతో ఈ గ్రామస్తులు 40 మంది చనిపోయారు. ఉదాహరణకు తాజాగా మాణిక్యం (38) చర్మవ్యాధితోనూ, మునస్వామి (40) గుండె సంబంధిత వ్యాధితోనూ చనిపోయారు. పెద్దఎత్తున ఆందోళన చేయడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వచ్చి సర్వే చేసి నీటిని పరీక్షించారు. విపరీతమైన కాలుష్యం ఉందని తేల్చారు. ఈ ఊరులోని బోరులో నీటిని ఎవరూ తాగరాదంటూ బోర్లనూ, 11 చేతిబోర్లనూ సీజ్ చేశారు. వీరికోసం అరణియార్ ప్రాజెక్టు నుంచి రెండు బోర్లు వేసి పైపులైను ద్వారా నీటిని తీసుకొస్తున్నారు. అయినా శబ్ద కాలుష్యం, నీటి కాలుష్యం వల్ల ఇప్పటికీ జబ్బులతో 150 మందికిపైగా బాధపడుతున్నారు.

కొత్తగా తెరపైకి విద్యుత్ ప్లాంట్

రెండు దశాబ్దాలుగా వ్యర్థాన్ని విచ్చలవిడిగా గ్రామాలపైకి వదులుతూ చక్కెర ఉత్పత్తి చేసి కోట్లు గడించిన నీతమ్స్ యాజమాన్యం, అనుబంధంగా విద్యుత్ ప్లాంట్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. చక్కెర పరిశ్రమలో రోజుకు 2,500 టన్నుల చెరకును క్రషింగ్ చేసే సామర్థ్యం ఉంది. 4.5 మెగావాట్స్ విద్యుత్ అవసరం. సామర్థ్యాన్ని 4,500 టన్నులకు పెంచాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను వీరే ఉత్పత్తి చేసుకోవాల్సి ఉంది. ఈ లెక్కన 7 మెగా వాట్లు విద్యుత్ అవసరం. దీంతో యాజమాన్యం ప్రభుత్వం నుంచి విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి తెచ్చుకుంది. ప్రస్తుతం చక్కెర పరిశ్రమ వ్యర్థాలతోనే కొప్పేడు ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని, విద్యుత్ ప్లాంట్ వస్తే ఊరే వల్లకాడవుతుందని దళితుల ఆందోళన.



చక్కెర ఫ్యాక్టరీ వదిలిన వ్యర్థాలతో రోడ్డుపక్క మైదానంలో పారుతున్న కలుషిత నీరు

మా చేతుల్లో ఏమీ లేదు



మా చేతుల్లో ఏమీ లేదు. కరెంట్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నారు. అదంతా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చూసుకోవాలి. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీ వెదజల్లే వ్యర్థాలపై కోర్టులో కేసు నడుస్తోంది. ప్రభుత్వం అన్ని షరతులు విధించే విద్యుత్ ప్లాంట్‌కు అనుమతి ఇచ్చింది. షరతుల ప్రకారం యాజమాన్యం విద్యుత్ ప్లాంట్ నడిపితేనే అనుమతి ఇస్తారు. **- బాబు, తహశీల్దార్, నింద్ర**

విద్యుత్ ప్లాంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



కొప్పేడు దళితులు ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్నారు. రోజువారి కూలి చేస్తే గాని వీరి బతుకులు సజావుగా జరిగే పరిస్థితి లేదు. ఆస్తులను సైతం వైద్యానికి అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం దళితులు ఎక్కడుంటే అక్కడ వారికి అన్యాయం చేస్తూనే ఉంది. విద్యుత్ ప్లాంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాం. సిపిఎం మద్దతు ఈ ఉద్యమానికి ఉంటుంది. **- కె.కుమార్‌రెడ్డి, సిపిఎం**

వయసొచ్చినా ఎదగని పిల్లలు



మా ఊళ్లో 200 మందికి పైగా పిల్లలున్నారు. 70 మంది వరకూ వయసొచ్చినా ఎదుగుదల లేదు. డాక్టర్లను అడిగితే కాలుష్య నీరే కారణమని చెబుతున్నారు. రెండేళ్ల సాగర్ నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. సిఎంసికి తీసుకెళితే నీళ్ల కాలుష్యమని అక్కడి డాక్టర్లు చెప్పారు. ఫ్యాక్టరీ వాళ్లు కోట్లు సంపాదించుకుంటున్నారు. మాకు మాత్రం జబ్బులను అంటగడుతున్నారు. **- మురళి, కొప్పేడు దళితవాడ**

దళితులంటే అంత అలుసా..



అదే ఏ రెడ్డో, నాయుడో ఉన్నచోట ఇలా జరిగుంటే ఒప్పుకునేవారా. ఎంతమందికో చెప్పాం. ఒక్కరు కూడా పట్టించుకోరు. ఎన్నోసార్లు అధికారులను కలిసాం. ఫలితం లేదు. ఈ బాటిల్లో ఉన్న నీరు మా ఊరి బోరులోవే. ఇలా ఉంటే చర్మవ్యాధులు రావా? కరెంట్ ఫ్యాక్టరీని నిర్మిస్తే మా గ్రామాన్ని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయం చూపించండి. లేదంటే విద్యుత్ ప్లాంట్ రాకుండా చూడండి. **- సురేష్, కొప్పేడు దళితవాడ**

మా బతుకులను ఛిద్రం చేయొద్దు



సుగర్ ఫ్యాక్టరీని తీసుకొచ్చి మా బతుకుల్లో బూడిద, దుమ్ము కొట్టారు. విద్యుత్ పరిశ్రమను తీసుకొచ్చి మరింత ఛిద్రం చేయొద్దు. అనారోగ్యంతో ఇప్పటికే 40 మంది మృతి చెందారు. మరో 150 మంది వ్యాధులతో చికిత్స పొందుతూ ఆర్థికంగా చితికిపోతున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామానికి న్యాయం చేయాలి. **- కె.మధుబాబు, కొప్పేడు దళితవాడ**



కరువు మండలాలకు కొర్రీ

కడపలో లేట్ ఖరీఫ్ పేరుతో సాకులు
27 మండలాలే గుర్తింపు?
మళ్లీ 10 మండలాలకు కుదింపు!

ప్రభుత్వం కరువు మండలాల గుర్తింపునకు కొర్రీలు వేస్తోంది. కరువు తీవ్రతను పూర్తిస్థాయిలో మదింపు వేసి దెబ్బతిన్న మండలాలను ఎంపిక చేయడం సహజం. వాటిని పూర్తిస్థాయిలో గుర్తిస్తే సబ్సిడీలు, రాయితీల భారం అధికంగా పడుతుందనే ఉద్దేశంతో మూడింట ఒక భాగానికి పరిమితం చేయడానికి కసరత్తు చేస్తోంది. ఈ ఖరీఫ్‌లో 27 మండలాలను గుర్తించినా.. లేట్ ఖరీఫ్, కెసిబెల్ట్ పేరుతో 17 మండలాలను మినహాయించి మిగిలిన 10 మండలాలేనే ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. సంపన్నదేశాలు 16 రకాల సబ్సిడీలతో రైతాంగాన్ని ఆదుకుంటుంటే రెండు, మూడు రకాల సబ్సిడీలతో రైతాంగాన్ని ఆదుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోంది. ప్రస్తుత ఏడాది 15 ఏళ్లలో ఎన్నడూ చూడని ఘోర పరిస్థితి దాపురించింది. ఈ ఖరీఫ్‌లో 1.36 లక్షల హెక్టార్లలో సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యం నిర్దేశించినా .. 34 లక్షల హెక్టార్లకే సాగు పడిపోయింది. 25 శాతం సాగుకాని దుస్థితి దాపురించింది. కనీసం లక్ష హెక్టార్లలో పైర్లు పడని దుస్థితి దాపురించింది. ఈ ఆపద నుంచి రైతులను బయటపడ వేయాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదే అయినా.. కరువు మండలాల గుర్తింపును ఊహాజనిత లెక్కలతో ముందుకు సాగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కెసి కెనాల్ బెల్ట్ పరిధిలోని కడప, చెన్నూరు, వల్లూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు, రాజుపాలెం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు లేట్‌ఖరీఫ్ కింద బద్వేల్ డివిజన్‌లోని అట్లూరు, బద్వేల్, గోపవరం, బి.కోడూరు, బి.మఠం మండలాలను మినహాయించి కరువు ప్రాంతాలుగా గుర్తించడానికి సన్నాహాలు చేస్తోంది. 2014 నుంచి కరువు మండలాల సంఖ్య పెరగలేదు. 2014లో 22 మండలాలు, 2015, 16, 17 సంవత్సరాల్లో కరువు మండలాలు 27 మండలాలకే పరిమితం చేశారు. వాస్తవంగా జిల్లాలో నాలుగు మండలాలను మినహాయిస్తే జిల్లావ్యాప్తంగా కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయని రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయరులో 29 టిఎంసిల నీరే ఉందని, నిరుడు ఇదే కాలానికి 39 టిఎంసిలకు పైగా నిల్వ ఉన్న నేపథ్యంలో లేట్ ఖరీఫ్, కెసి బెల్ట్ సాగును పరిగణలోకి తీసుకోవడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

వివాహ వేడుకలో వైఎస్.జగన్

ప్రజాశక్తి- నంద్యాల లీగల్

కర్నూలు జిల్లా నంద్యాల నియోజకవర్గ వైసిపి మాజీ ఇన్‌ఛార్జి మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కుమారుడు గంగా చరణ్‌రెడ్డి వివాహ వేడుకకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ వేడుకలో నూతన వధూవరులను జగన్ ఆశీర్వదించారు. నంద్యాల ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఓటు కీలకం కావడంతో ప్రతి కార్యకర్తను ఉత్సాహ పర్చడం కోసం ఉదయం 11 గంటలకు కడప నుంచి రోడ్డు మార్గంలో నంద్యాల చేరుకున్నారు. వివాహ వేడకలో వైసిపి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను, కార్యకర్తలను పలకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నంద్యాల అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు గౌరువెంకటరెడ్డి, మల్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సూర్యకుమారికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-జి.కొండూరు

అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన డాక్టర్ కొర్లపాటి సూర్యకుమారికి కృష్ణాజిల్లా జి.కొండూరు మండలం గడ్డమణుగు గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. 1989లో జన్మించిన ఆమె వైద్యురాలుగా పనిచేస్తున్నారు. విజయవాడ మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో ఇంజినీర్‌గా పనిచేసిన విజయకుమార్, మరియమ్మ దంపతుల కుమార్తె అయిన సూర్యకుమారి విజయవాడలోని రైవస్ కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె పార్థివ దేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామమైన గడ్డమణుగు గ్రామానికి మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు జరిపించారు. సూర్యకుమారి మృతదేహాన్ని ఎపి మహిళా ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం తల్లిదండ్రులను పరామర్శించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురు రాజకీయ నేతలు తరలివచ్చారు.

గోరేటి, సుద్దాలకు జాలాది జాతీయ పురస్కారాలు

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ

ప్రఖ్యాత సినీ కవి, కళా ప్రపూర్ణ డాక్టర్ జాలాది పేరిట నెలకొల్పిన జాతీయ ప్రతిభా పురస్కారాలు 2017కు గాను సుప్రసిద్ధ ప్రజా కవి, గాయకుడు గోరేటి వెంకన్న, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ద్వారకానగర్ ఒక హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాలాది జాతీయ పురస్కార మహోత్సవం-2017 పోస్టరును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మహాకవి పేరిట ఏర్పాటు చేసిన సంస్థ ఏటా ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 9వ తేదీన క్రమం తప్పకుండా ఈ అవార్డుకు అర్హులను ఎంపిక చేయడం అభినందనీయమని అన్నారు.

దోమతెరల జాడేది?

- ఈ ఏడాది పంపిణీ అనుమానమే
- మన్యంలో తీవ్రతరమవుతున్న మలేరియా
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మలేరియా నుంచి గిరిజనులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. గిరిజన ప్రాంతంలో ఏటా మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. మలేరియా మరణాలూ సంభవిస్తున్నాయి. సమస్య తీవ్రతకు తగ్గట్లుగా ప్రభుత్వం స్పందించడం లేదు. మలేరియా నివారణలో దోమతెరలు కీలకపాత్ర పోషిస్తాయని వైద్యులు చెప్తున్నారు. దోమ తెరల పంపిణీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. ఇతర వ్యాధులూ విజృంభిస్తున్నాయి. వ్యాధిగ్రస్తులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా మరణాలు ఆగడం లేదు. దోమ తెరల కోసం అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రభుత్వం వీటిని పంపిణీ చేపట్టడం లేదు.

21 లక్షల దోమ తెరలకు ప్రతిపాదన

ఏజెన్సీలో ఏటా ఏప్రిల్ నుంచి నవంబర్ వరకూ మలేరియా విజృంభిస్తోంది. ఈ సమయంలోనే దోమ తెరలు పంపిణీ చేయాలి. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు 21 లక్షల దోమ తెరలు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. విజయనగరం జిల్లా ఏజెన్సీకి 3.80 లక్షలు దోమ తెరలు అవసరమని అధికారులు చెబుతున్నారు. నేటికీ ఒక్క దోమతెర కూడా మంజూరు కాలేదు. జిల్లాలో ఎనిమిది గిరిజన మండలాలున్నాయి. ఈ మండలాల్లోని గిరిజనులకు 2011-12 ఆర్థిక సంవత్సరంలో 1,45,500 దోమ తెరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ముగ్గురు నుంచి ఐదుగురు సభ్యులున్న ఒక్కొక్క కుటుంబానికీ రెండు చొప్పున, ఆరుగురు పైబడిన కుటుంబానికి మూడు చొప్పున అందజేసింది. వీటివల్ల అప్పట్లో మలేరియా తీవ్రత కొంత తగ్గుముఖం పట్టింది. వీటి వినియోగ కాలం రెండేళ్లు మాత్రమే. అంటే 2013-14లో దోమ తెరలను మళ్లీ పంపిణీ చేయాలి. కానీ పంపిణీ కాలేదు. గతేడాది అప్పటి ఐటిడిఎ పిఒ చొరవ తీసుకొని 71,872 దోమతెరలను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. అవి చాలలేదని గిరిజనులు వాపోతున్నారు. ఈ ఏడాది మలేరియా తీవ్రతరం అవుతున్నా నేటికీ దోమల తెరల పంపిణీ జాడ లేదు. మలేరియాతో ఈ ఏడాది ఇంతవరకూ ఒకరు మృతి చెందినట్లు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. వాస్తవానికి ఈ వ్యాధితో ఐదుగురు మృతి చెందారని గిరిజనులు చెప్తున్నారు. దోమల నివారణకు గ్రామాల్లో అల్ఫాసైఫర్‌మైథిన్ (మలేరియా నివారణ మందు) పిచికారీ చేశారు. అయినా, దోమల నివారణ పూర్తి స్థాయిలో జరగక గిరిజనులు మలేరియా బారిన పడుతున్నారు.



గిరిజనులకు గతంలో పంపిణీ చేసిన దోమతెరలు (ఫైల్)

3.80 లక్షల తెరలకు ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో గిరిజన ప్రాంతంలోని అందరికీ 3.80 లక్షల దోమతెరలు అవసరమని గుర్తించాం. ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. అవి ఇంకా రావాల్సి ఉంది. ఈ ఏడాది మలేరియా నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. **-రవికుమార్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి**

ప్రపంచంలోని ఇతర దేశాలలో పోలిస్తే విమాన ప్రయాణికుల వద్ధి రేటు మన దేశంలోనే ఎక్కువగా ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. కార్గో సేవలపై అంతగా దష్టి సారించలేదని చెప్పారు. కార్గో సేవలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండు వస్తుందని, తద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని అమకాం, డెంకాడ మండల కాంప్లెక్స్‌ల వద్ద ఆదివారం ఆయన పలు అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)



అమరవీరుల కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న డిజిపి

సైనికుల త్యాగాలు అసామాన్యమైనవి
డిజిపి నండూరి సాంబశివరావు

ప్రజాశక్తి - తాడేపల్లి

దేశరక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు అసామాన్యమైనవని, దేశ ప్రజలు వారి సేవలు సదా గుర్తుంచుకుంటారని డిజిపి నండూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లి కనకదుర్గ వారధి దగ్గరున్న విజయవాడ క్లబ్‌లో 25 మంది అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.90వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల కుటుంబాలకు విజయవాడ క్లబ్ కమిటీ సభ్యులు ఆర్థికసాయం అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. అదిలాబాద్, ఖమ్మం, విశాఖపట్టణం రూరల్ ప్రాంతాల్లో నక్సలైట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో 485 మంది కానిస్టేబుల్స్, ముఖ్య పోలీసు అధికారులను కోల్పోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా దాడి జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. నక్సలైట్లను ఎదుర్కొనేందుకు దేశంలో గ్రేహౌండ్స్ దళాలు సిద్ధంగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. గ్రేహౌండ్స్ బలగాల సహాయంతో నక్సలైట్లను దీటుగా ఎదుర్కోవడంతో పక్క రాష్ట్రాలకు తరలిపోయారని చెప్పారు. నక్సలైట్లు దాడులకు సిద్ధపడినా ఎదుర్కొనేందుకు పోలీసులు కూడా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ మాజీ డైరెక్టర్ జనరల్ కె.దుర్గాప్రసాద్, విజయవాడ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

స్నేహం

పూలను మాల కట్టినట్టు... చెలిమెలాగా అంతుచిక్కని ఊట పారినట్టు... బాల్యంలోని జ్ఞాపకాలు విరులతోటలా వికసించినట్టు... తడిమి చూసుకున్న ప్రతిసారీ కమ్మని అనుభూతుల చిక్కని పరిమళం మనసును తాకినట్టు ఒక అద్భుతమైన అనుభూతిని... అనుభవాన్ని అందించేదే స్నేహం. స్నేహం ప్రకృతి వంటిది. ఆనందంతో పాటు ఆహ్లాదాన్నీ ఇస్తుంది. అందుకే 'ఒకే ఆత్మ ఉంటుంది రెండు శరీరాలలో/ ఒకే పాట పలుకుతుంది వేరు వేరు గుండెల్లో' అంటాడు సినీకవి ఆచార్య ఆత్రేయ. ఇటువంటి స్నేహబంధం చెరిగిపోదు తరిగిపోదు జీవితాంతం అని స్నేహానికి గొప్ప నిర్వచనం ఇస్తాడు. స్నేహబంధం నిత్యనూతనం. సృష్టిలోని అన్ని బంధాలకంటే మధురం. ఇరువురు వ్యక్తుల మధ్య పెనవేసుకున్న సన్నజాజి పరిమళాల సుమదళం. పెనవేసుకున్న కొలదీ వికసించే అనుబంధం. ఈ బంధాన్ని వర్ణించడం ఎవరితరం. 'స్నేహం పాతబడిన కొద్దీ బాగుంటుంది' అంటాడు చింగ్ చౌ. స్నేహానికి హద్దులు, ఎల్లలు వుండవు. మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యంగా ఉంటుంది. తల్లిదండ్రులతోను, తోబుట్టువులతోను చెప్పుకోలేని విషయాలను సైతం పంచుకునే ఒకే ఒక తోడు స్నేహం. కాబట్టే 'కాలం ఒడిలో పయనించే షిప్పే ఫ్రెండ్‌షిప్' అంటాడో కవి. యువతీ యువకుల మధ్య స్నేహంతో ప్రారంభమైన అనుబంధం ప్రేమగామారి, జీవన భాగస్వాములై జీవితాంతం స్నేహమాధుర్యాన్ని అనుభవించే దంపతులెందరో. స్నేహమనేది ఒకరోజు కాలక్షేపం కాదు... స్వచ్ఛమైన అనుబంధానికి చిరునామా. చిన్నప్పుడు వీధి బడిలోనో... కోతికొమ్మచ్చి ఆటతోనో ప్రారంభమై జీవితాంతం తోడు నిలిచే స్వార్థమెరుగని స్వచ్ఛమైన అనుబంధం. ఇలాంటి అనుబంధం దూరమైతే అనుభవించే బాధ వర్ణనాతీతం. 'తలవంచుకు వెళ్లిపోయావా నేస్తం/ సెలవంటూ ఈ లోకాన్ని వదిలి/ ...ధూర్తలోకంలో నిలబడజాలక/ తలవంచుకునే వెళ్లిపోయావా, నేస్తం!' అంటూ మహాకవి శ్రీశ్రీ తన మిత్రుడు కొంపెల్ల జనార్థనరావు కోసం ఆవేదన చెందుతాడు. అటువంటి స్నేహం నిత్యం కొత్త చివుళ్లు తొడుగుతూనే వుంటుంది. నిరంతరం స్నేహగీతికలు పల్లవిస్తూనే ఉంటాయి. ఆ మధురిమ జీవితాంతం సజీవంగా పరిమళిస్తూ వుండాలంటే... ఎవరికి వారు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలి. స్నేహాన్ని కాపాడుకోవాలి.

ప్రపంచీకరణ విష సంస్కృతి అన్నిరంగాల్లో ప్రవేశించినట్లే అనుబంధాల్లోనూ చొరబడిపోయింది. దానికి స్నేహమేమీ అతీతం కాదు. ఈ చొరబాటు మన బతుకుల్లోని డొల్లతనాన్ని చెప్పకనే చెబుతోంది. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వందలాది మిత్రులున్నా... దిగులు పడిన క్షణం, కలవరపడిన నిముషం మాట్లాడేందుకు... బాధను చెప్పుకునేందుకు ఒక్కరూ దొరకరు. లోలోపల కదిపి కుదిపే బాధను పంచుకోడానికి ఆప్తులొక్కరు కనిపించరు. అన్నీ బాగున్న వేళ అందరూ కబుర్లు ఒలకబోసేవారే. 'ఆత్మలాభ పరాయణు లగుచు నరులు/ ప్రాణమిత్రులవలెనె గన్పట్టుచుందు/ రవసరము దీఱ నందరు నడగుచుండ్రు/ నిజహితుడు లే డవనిలో నిశ్చితంబు' అంటాడు చిలకమర్తి తన గయోపాఖ్యానములో. అంతా ప్రాణమిత్రులవలే కనబడతారు గానీ నిజమైన హితులు కనుమరుగవుతున్న పాడుగాలం దాపురించింది. నిత్యం కలిసే స్నేహితుల కంటే... ఆన్‌లైన్‌లో కలిసే స్నేహితులకే ప్రాధాన్యత నిస్తున్నాం. హాయ్, హలో అంటూ విష్ చేయడం...గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్‌లు చెప్పుకోవడం, లైక్‌లు, షేరింగ్‌లతోనే సమయం గడిచిపోతోంది. మానవీయ బంధాలను ముట్టడించిన మార్కెటీకరణ ప్రభావం... స్నేహంలోని అర్థాన్నీ... అనుబంధాన్నీ విషాదస్మృతిగా మిగులుస్తోంది. నిజజీవితంలో వలే బాధ్యతలను పంచుకోవడం, ఒకరికోసం ఒకరై మెలగడం ఈ వర్చువల్ ప్రపంచంలో కనబడదు.

స్నేహమనే వృక్షం ఒక్కరోజులో పెరిగి పెద్దది కాదు. స్నేహాన్ని నెమ్మదిగా ఎదిగే చెట్టుతో పోలుస్తారందుకే. ఆ చెట్టు పరిమళ భరితమైన పూలు పూయాలన్నా, రుచికరమైన ఫలాలనివ్వాలన్నా... ఓపికగా పెంచి పోషించుకోవాల్సిన అవసరం ఉంది. స్నేహమూ అంతే. 'స్నేహమంటే కరగని కల/ నేస్తమంటే విరగని అల/ శూన్యమైన జీవితాన/ విరిసే నవ్వుల వాన/ తనువులు వేరైనా/ తలపులు మారేనా' అంటారు కవయిత్రి శారద శివపురపు. కారల్‌మార్క్స్- ఎంగెల్స్, ఫైడల్‌కాస్ట్రో- చేగువేరా స్నేహం ప్రపంచానికి ఆదర్శం. అలాగే భగత్‌సింగ్- శివవర్మ స్నేహం అజరామరం. భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష పడిన సందర్భంలో తనను కలిసిన శివవర్మతో 'నేను వెళ్లిపోతున్నాను. ఈ భవనాన్ని నీ భుజస్కంధాలపై మోయాల్సివుంది' అంటూ తన బాధ్యతను స్నేహితునికి అప్పగిస్తాడు. ఈ మహామహుల స్నేహం నాటినుంచి నేటి వరకూ యువతరాన్ని ఉర్రూతలూపుతునే వుంది. ఉత్తేజపరుస్తూనే వుంది. స్నేహానికి నిజమైన అర్థం చెప్పిన వారు తెలుగు గడ్డ మీద మనందరికీ తెలిసిన జంట బాపు-రమణ. ఇలా ఎంతోమంది స్నేహితులు తమ స్నేహానికి అమరత్వాన్ని సిద్ధించి పెట్టారు. స్నేహానికి వర్ణ, వర్గ, వయో భేదాలుగాని, లింగ భేదం గానీ లేవు. స్నేహం ఎప్పటికీ సజీవం. 'స్నేహానికన్న మిన్న లోకాన లేదురా/ కడదాకా నీడ లాగ నిను వీడిపోదురా/ ఈ గుండెలో పూచేటిది నీ శ్వాసగా నిలిచేటిది/ ఈ స్నేహమొకటేనురా...' అని ఓ కవి చెప్పినట్టుగా జీవితంలోని అన్ని బంధాలను భర్తీ చేయగలిగేది స్నేహమొక్కటే.

మహనీయుల మాట



రాజకీయ పరమైన స్వాతంత్ర్యం ఎంత వున్నా అది ఆకలితో అలమటించేవారిని సంతోషపెట్టలేదు.

-లెనిన్

అవినీతిలో అసలు అగ్రజులు



ఉన్నం వెంకటేశ్వర్లు

చర్చ

విశాఖ నగర పరిధిలోని గాజువాక సబ్ రిజిస్ట్రారు రు.వంద కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ దాడిలో బయట పడింది. ఇదే జిల్లాకు చెందిన మరో అధికారి గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌లో 800 కోట్ల అవినీతి సంపాదన సాగించిన వార్త రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. గడిచిన ఎనిమిది నెలల్లో ఎసిబికి చిక్కిన 16 మంది అధికారులు రు.1500 కోట్ల అవినీతి సొమ్ము కూడేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు వెల్లడించారు. రాష్ట్రంలో రు. వందల కోట్ల అవినీతికి పాల్పడ్డ అధికారులు వందమంది ఉన్నారనీ, రు.50 కోట్ల అవినీతికి పాల్పడిన వారు మరో 600 మంది ఉన్నారనీ పత్రికల్లో కథనాలు వచ్చాయి. అవినీతికి పాల్పడిన అధికారులు రెవెన్యూ, భారీ నీటిపారుదల, భూ గర్భ ఖనిజాలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వంటి కీలక శాఖల్లోని వారే కావడం గమనార్హం. పైగా ఇందులో మూడింట రెండొంతుల మంది ఉద్యోగ విరమణకు చేరువలో ఉన్నట్లు ఎసిబి మాజీ పోలీసు అధికారి ఒకరు విశ్లేషించినట్టు పత్రికల్లో వచ్చింది. మొత్తం మీద ప్రజాసేవల విభాగంలో 74 శాతం పైబడిన అవినీతితో 20 రాష్ట్రాల్లో జరిపిన సర్వేలో మన రాష్ట్రం రెండో స్థానపు కీర్తి గడించిందని సిఎంఎస్, ఇండియన్ కరెప్షన్ స్టడీ పదకొండో వార్షిక నివేదిక తేల్చి చెప్పింది.



ఈ అవినీతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా 2017 మేలో జరిగిన కలెక్టర్ల సదస్సులో మండి పడినట్టు కొన్ని పత్రికల్లో పొగడ్తలతో కూడిన కథనాలు వచ్చాయి. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కాకపోవడానికి అధికారుల అవినీతే ప్రధాన కారణమంటూ ఆ కథనాలు తేల్చాయి. ఏ అధికారి అయినా దొడ్డిదారిలో అక్రమార్జన చేయడానికి 'ఇచ్చే వారుంటేనే అధికారులు పుచ్చుకుంటారు' అని సామాన్యునికి కూడా తెలిసిన విషయాన్ని విశ్లేషించే పని తనది కాదని ఎసిబి అనుకొని ఉండొచ్చు. అప్పులూ, పెట్టుబడులూ రాబట్టడంలోనూ, అభివృద్ధి పథకాల రూపకల్పనలోనూ సిద్ధహస్తునిగా కీర్తి ప్రశంసలందుతున్న మన ముఖ్య మంత్రికి సామాన్యుడు ఆలోచించ గలిగిన ఇంత చిన్న విషయంపై ఏ అనుమానమూ రాకపోవడం ఆశ్చర్యంగొలిపే అంశమే అవుతుంది. వారికి లంచాలిచ్చి ఆస్తులు కూడేసుకునే అగ్రగణ్యులందరూ ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల, మంత్రుల స్థానాల్లోనూ, స్థానిక స్థాయిలో అధికార పార్టీ ఛోటామోటా నాయకుల స్థానాల్లోనూ ఉన్నారని రోజూ పత్రికల్లో వచ్చే కథనాలు చెబుతున్నాయి. విశాఖలో భూ కుంభకోణం, రాష్ట్రంలో ఇసుక కుంభకోణాలు నిజమేనంటూ సొంతపార్టీవారే అంటున్నారు. వారిపై ముఖ్యమంత్రి మండిపడుతున్నారే తప్ప ప్రతిపక్షాలు కోరినట్టు సిబిఐ విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని అనుకోవడం లేదు.

అంటే ఇది ఈ స్థాయికే పరిమితం అయిన అంశం కాదనుకోవాలి. అధికారుల్లో భారీ మొత్తంలో అవినీతికి పాల్పడి ఎసిబికి చిక్కిన సంఘటనలు విశాఖలోనే జరిగాయి. ఇందులో మంత్రి గంటా శ్రీనివాసరావు పేరు ప్రముఖంగా వెలుగులోకి వచ్చింది. లక్ష ఎకరాలకు చెందిన 16,375 సర్వే నెంబర్లు కనిపించలేదని కలెక్టరే ప్రకటించాల్సి వచ్చిన విషయాన్ని వైసిపి నేత వెల్లడించారు. తుఫాను కారణంగా అవి గల్లంతయ్యాయన్న అధికార కథనాలను, పాత్రికేయులు వెల్లడించిన ఈ వివరాలు పటాపంచలు చేశాయి. కొమ్మాది, మధురవాడల్లోనే రు. 3,100 కోట్ల విలువైన భూములను దర్జాగా కబ్జా చేశారు. ప్రభుత్వ భూములు 23,876 ఎకరాలూ, భీమిలి నియోజకవర్గంలో అసైన్డు భూములు 358 ఎకరాలూ గంటా, ఆయన బంధువులతో పాటు స్థానికంగా ఉన్న ఛోటామోటా నాయకులు బినామీ పేర్లతో కాజేశారన్న అవినీతి కంపు రాష్ట్రం మొత్తానికే ముక్కుపుటాలు అదరేసే స్థాయిలో ఉంది. కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఊరొదిలి వెళ్ళిన పలువురి భూములను దర్జాగా నొక్కేశారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు లంచాలు అలవర్చకుండా ఆ పని చేయలేరన్నది జగమెరిగిన సత్యం. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి దివాకర రెడ్డి అల్లుడైన టిడిపి ఎమ్మెల్సీ జి. దీపక్ రెడ్డిని 78 ఎకరాలకు సంబంధించిన కోట్లాది రూపాయల కుంభకోణంలో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో టిడిపి నాయకత్వం ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్‌చేసి చేతులు దులుపుకుంది.

రాష్ట్రాధినేత కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూములు కట్టబెట్టె ప్రయత్నం చేసిన ఉదంతాలూ ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండగా తనకు అధికారం కట్టబెడితే కాకికాడ ప్రత్యేక ఆర్థికమండలి (ఎస్ఇజెడ్)లోని భూములను రైతులకే అప్పగిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తను అధికారం చేపట్టాక నిజమని నమ్మి ఆ భూముల్లోకి దిగిన రైతులపైకి పోలీసులను పురమాయించారు. ఇదంతా గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు ఆ భూములను జిఎంఆర్‌కు కట్టబెట్టేందుకే ఈ పని చేశారని గుర్తించలేనంత అమాయకత్వంలో లేరు. ఆంధ్ర ప్రదేశ్‌తో సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఎస్ఇజెడ్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఆయా రాష్ట్రాల్లో పరిశ్రమేతర అవసరాలకు మళ్ళించారనీ, వీటి విలువ రు.6,310 కోట్లని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. ఇంకా ఈ దాహం తీరక రైతులపై రకరకాల రూపాల్లో ఒత్తిడి తెచ్చి పరిశ్రమలు, ప్రభుత్వ అవసరాల పేరిట మూడు పంటలు పండే వేలాది ఎకరాల భూములను అవసరాలకు మించి అధికారికంగా కబ్జా చేయడం చూస్తూనే ఉన్నాం. 'నీరు-చెట్టు' పథకం వచ్చాక ప్రకాశం జిల్లాలో చెరువులూ, కుంటలూ తవ్వడం పేరుతో ఎన్నో ఏళ్ళుగా సాగు చేసుకుంటున్న భూముల నుంచి సాగుదార్లను తరిమేశారు.

ఈ అవినీతి సంపాదనను పెంచుకోవడానికి లొంగిన అధికారులను లంచావతారులుగా మార్చి పనులు చేయించుకుంటున్నారు. లొంగని వారిపై బెదిరింపులకూ, దాడులకూ, బదిలీలకూ దిగుతూ అడ్డు తప్పించు కుంటున్నారు. నిజాయితీని పాతరేసేందుకే ఇటువంటి చర్యలకు దిగుతున్నారు. చివరకు పోలీసు వ్యవస్థపై కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారు. ఈ విషయాలను వెల్లడిస్తున్న విలేకర్లపైనా దాడులు చేస్తున్నారు. ఇలా అవినీతి పేట్రేగడానికి మూలం అధికార పార్టీ నేతల్లోనే ఉంది. వారి కనుసైగల ప్రకారం పనిచేసే అధికారుల అవినీతిపైనే ఎసిబి దాడులు చేస్తే, వారి అవినీతి సొమ్మును రికవరీ చేయగలదే గానీ, మొత్తంగా అవినీతిని అరికట్టలేదు. అందుకే మంత్రులు, ప్రజా ప్రతినిధుల మొదలు అధికార యంత్రాంగం వరకూ ఎవరు దారి తప్పినా నిలేసే పాలనా విధానం రావాలి. ఆ మార్పు కోసం ప్రజలూ నిలిచినప్పుడే దీనికి కొంత వరకైనా బ్రేకులు పడతాయి.

(రచయిత సీనియర్ జర్నలిస్టు)

అధికారం కోసమే ఈ ఆరాటం



కొండూరి వీరయ్య

విశ్లేషణ

అధికారం కోసం బూర్జువా పార్టీ నేతలు గడ్డి కరుస్తారన్న నానుడి మరోసారి రుజువు చేశారు నితీష్ కుమార్. 2014లో జరగబోయే ఎన్నికలకు మోడీని ప్రధాని అభ్యర్థిగా ముస్తాబు చేయటాన్ని నిరసించిన నితీష్‌కుమార్ ఎన్డీయే నుండి బయటకు వచ్చారు. ఆ తరువాత 'మహాగటబంధన్' పేరుతో లాలూప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపి మళ్లీ అధికారాన్ని కైవశం చేసుకున్నారు. 2015 శాసనసభ ఎన్నికల్లో బిజెపిని తిరస్కరించిన ప్రజలు ఆర్జెడీ-జెడియు మైత్రికి ఓటు వేశారు. కానీ రెండేళ్ల తిరక్కుండానే బిజెపి వేసిన ఉచ్చులో నితీష్ చిక్కుకున్నారు. బీహార్‌లో పాలక కూటమిలో వచ్చిన మార్పులు, నితీష్ రాజీనామా, విశ్వాస పరీక్ష నెగ్గటం వంటి పరిణామాలన్నీ శరవేగంగా జరిగాయి. వీటన్నింటినీ గమనిస్తే ఈ పరిణామాలేమీ హఠాత్తుగా జరగలేదన్నది తెలుస్తోంది. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా అటు గవర్నర్‌కు గానీ, ఇటు రాష్ట్ర బిజెపి శాఖకు గానీ, బిజెపి పార్లమెంటరీ బోర్డుకు గానీ తెలవకుండా వుంటుందా? రాష్ట్రపతి స్థానంలో ఉన్న వ్యక్తిపై నిందారోపణ చేయటం కాదు కానీ నిన్న మొన్నటి వరకు రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న కోవింద్‌కు ఈ పరిణామాలు ముందే తెలియదంటే నమ్మశక్యం కావటం లేదు. బహుశా నితీష్ పడగను బిజెపి బుట్టలో దాచిపెట్టేందుకు రామ్‌నాథ్ కోవింద్ నాగస్వరంగా పని చేశారా? అందుకు ప్రతిఫలంగానే రాష్ట్రపతి పదవి లభించిందా? అని అనుకోవటానికి కూడా ఈ పరిణామాలు ఆస్కారం ఇస్తున్నాయి.

బిజెపి చంకనెక్కి ముఖ్యమంత్రిగా విశ్వాస తీర్మానాన్ని ఆమోదించుకోవటంలో సఫలుడైన నితీష్ ఆ మరునాడే రెట్టించిన స్వరంతో చేసిన ప్రకటనలోని ఆంతర్యాన్ని విస్మరించకూడదు. '2019లో మోడీని ఓడించటం ప్రతిపక్షాలకు అసాధ్యం' అని ప్రకటించారు. దీని ద్వారా సాధారణ ఎన్నికల్లో రూపొందబోయే ప్రతిపక్ష కూటమి విషయంలో నితీష్ కుమార్ సైంధవ పాత్ర పోషించి మోడీ భక్తిని నిరూపించుకోదల్చుకున్నట్లు రూఢీ అవుతోంది. అంతే కాదు. ఆ మరునాడే అన్నా డిఎంకె ఐక్యంగా ఉంటేనే ఆ పార్టీతో తాము చేతులు కలపటానికి సిద్ధమవుతామని బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా స్పష్టం చేశారు. తద్వారా ప్రాంతీయ పార్టీల అంతర్గత వ్యవహారాల్లో బిజెపి క్రియాశీలకంగా జోక్యం చేసుకుంటుందని, తమ ఆధిపత్యాన్ని అంగీకరించని వారిని శంకరగిరి మాన్యాలు పట్టించటానికి వెనకాడబోదని తేటతెల్లమవుతోంది. వచ్చే ఏడాది ఒరిస్సాలో జరగబోయే ఎన్నికలకు ఇప్పటినుండే పావులు కదుపుతోంది. ఆ సందర్భంగానే భువనేశ్వర్‌లో 2016 ఫిబ్రవరిలో జరిగిన ఒక బహిరంగ సభలో 'దేశాన్ని ప్రతిపక్ష రహిత భారతంగా మార్చే క్రమంలో తలమునకలై ఉన్నామని' స్వయంగా మోడీనే దేశానికి సమాచారమిచ్చారు. తరువాత జరిగిన గోవా, మణిపూర్ శాసనసభ ఎన్నికల్లో బిజెపికి సంఖ్యాబలం లేకపోయినా కొనుగోళ్లకు పాల్పడి ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. అంతకు ముందే అరుణాచల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలను దేశ ప్రజలు ఇంకా మర్చిపోలేదు. తాజాగా కర్ణాటకపై బిజెపి గురిపెట్టింది. ఈ పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల్లో కనిపిస్తున్న మితవాద మొగ్గు పట్ల ఆందోళన చెందుతున్న దేశభక్తులకు కొన్ని ప్రశ్నలు తలెత్తటం సహజం.

లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు ఉన్న విషయం, ఆయనపై సిబిఐ న్యాయస్థానాలు, సుప్రీం కోర్టుల్లో కేసులు ఉన్నాయన్న విషయం నితీష్‌కు 2015 ఎన్నికల పొత్తుకు ముందే తెలుసు. ఇప్పుడు అదే అవినీతి ఆరోపణలను కారణంగా చూపించి ప్రభుత్వ భాగస్వామిగా ఉన్న ఆర్జెడీని గెంటేశారు. నాటికీ నేటికీ లాలూపై ఉన్న అవినీతి ఆరోపణల్లో కొత్తగా ఏమీ చేరలేదు. కానీ నాడు నరహంతకునిగా కనిపించిన మోడీ ప్రధాని గద్దెనెక్కిన తర్వాత సాధు జంతువుగా మారిపోయినట్లు నితీష్‌కు కనిపిస్తున్నారు. అంతేకాదు. నిజంగా తన మంత్రివర్గంలో ఉన్న ఉప ముఖ్యమంత్రిపై చెప్పుకోదగ్గ అవినీతి ఆరోపణలు (ఓటుకు నోటు కేసులో ఆరోపణలెదుర్కొంటున్న చంద్రబాబు తరహాలోనైనా) రాలేదు. ఒక వేళ వచ్చినా వాటిని అసెంబ్లీ ముందుగానీ, ప్రజల ముందుగానీ పెట్టటానికి ముఖ్యమంత్రిగా నితీష్ చేసిన ప్రయత్నం కూడా ఏమీ లేదు. 2015లో ఎన్నికల పొత్తు కోసం లాలూతో చర్చలు జరిపిన జెడియు పార్లమెంటరీ నేత శరద్ యాదవ్ కూడా నితీష్‌ను తప్పు పట్టడం గమనిస్తే ఆయనకు కూడా ఈ కప్పల తక్కెడ సమాచారం ఉన్నట్లు కనిపించటం లేదు.

నితీష్ అధికారానికి తక్షణమే వచ్చిన ముప్పు ఏమిటన్నది ముందుకొస్తున్న మరో ప్రశ్న. కనుచూపు మేరలో అటువంటి ముప్పు ఏమీ కనిపించలేదు. శాసనసభ ఎన్నికల్లో నితీష్ పార్టీ కంటే ఆర్జెడీకి ఎక్కువ సీట్లు వచ్చినా బిజెపి వ్యతిరేక ఐక్య సంఘటన నినాదానికి కట్టుబడ్డ లాలూ ప్రసాద్ యాదవ్ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడలేదు. స్వయంగా నితీష్ పేరును ఆ పదవికి ప్రతిపాదించారు. అప్పటి నుండీ ఇప్పటి వరకు ఏ ఒక్క సందర్భంలోనూ రెండు పార్టీలూ ముఖ్యమంత్రి పదవి కోసం కుమ్ములాడుకున్నదీ లేదు. అవినీతి పట్ల రాజకీయాల్లో నేరచరితుల పట్ల నితీష్ ఎంచుకున్న రాజకీయ వైఖరిని కూడా ఆయన సమర్థించుకోవాల్సిన అవసరం ఉంది. గోవా ముఖ్యమంత్రిగా ఉన్న పారికర్ గోవాను వదిలి కేంద్రంలో రక్షణ శాఖ పగ్గాలు ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? తిరిగి నగ్నమైన అవకాశవాదంతో రాష్ట్రంలో మైనారిటీ ప్రభుత్వానికి మద్దతు కొనుగోలు చేసేందుకు గోవా ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో నితీష్ దేశానికి వివరణ ఇవ్వాలి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వ్యాపం (మధ్యప్రదేశ్ మెడికల్ కళాశాలల కుంభకోణం) మీద మోడీ, నితీష్‌లు ఎందుకు మాట్లాడటం లేదో స్పష్టం చేయాలి. 17 కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎలా అర్హత కలిగినవాడవుతాడో కూడా సమాధానం చెప్పాలి. భారీ అవినీతి, అధికార దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజస్థాన్ ముఖ్యమంత్రిని మార్చే సత్తా అవినీతిపై అహర్నిశలు పోరాడుతున్న మోడీకి, బిజెపికి ఎందుకు లేదో వివరించాలి. ప్రజా ప్రాతినిధ్య చట్ట ప్రమాణాలు ఉల్లంఘించి మంత్రిగా కొనసాగుతున్న కెటి రామారావు విషయంలో రాష్ట్రంలోని బిజెపి ఎందుకు నోరెత్తటం లేదో, 'ఓటుకు నోటు' కేసులో ఆరోపణలెదుర్కొంటున్న చంద్రబాబు విషయంలో అక్కడి బిజెపి నేతలు నోరు మూసుకోవటానికి కారణాలు ఏమిటో స్పష్టం చేయాలి. అంతేకాదు. దిగుమతి సుంకాలు కట్టకుండానే కేంద్ర ఖజానా నుండి వేల కోట్లు వసూలు చేసిన మోడీ-షాల ప్రియ మిత్రుడు గౌతం అదానీ విషయంలో అటు కేంద్ర ఆర్థిక శాఖ గానీ, ఇటు విద్యుత్ శాఖ గానీ, వాణిజ్యం, పరిశ్రమలు శాఖ గానీ ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదో దేశానికి సంజాయిషీ ఇవ్వాలి.

ఈ మొత్తం పరిణామాలు బిజెపి భావి రాజకీయ వ్యూహం గురించి ఒక అంచనాకు రావటానికి ఉపయోగపడతాయి. నితీష్-మోడీ మైత్రికి పునాదులు వేసిన సూత్రం అవినీతిపై పోరాటం కాదు. అధికారం కోసం ఆరాటం. 2014 ఎన్నికల్లో అధికారానికి రావటానికి మోడీ చేసిన అనేక వాగ్దానాల్లో ఒక్కటీ నెరవేర్చలేకపోయారు. విదేశాల్లో ఉన్న నల్లధనం అక్కడే భద్రంగా ఉంది. పైగా దేశంలోని నల్లధనాన్ని కూడా బంగారు బిస్కట్ల రూపంలో మార్చుకోవటానికి వీలుగా సంపన్న వర్గాలు, ఖజానా దండిగా ఉన్న వెంకయ్య నాయుడు ట్రస్ట్ లాంటి ట్రస్టులు కిలోల లెక్కన బంగారం నిల్వలు దాచుకోవచ్చని తాజాగా ఆదేశాలు జారీ చేశాయి. మరో ఏడాదిలో ఎన్నికలకు దేశం సిద్ధమవుతోంది. అయినా రైతాంగం ఆదాయం రెట్టింపు చేస్తామన్న మోడీ వాగ్దానం ఏ గంగలో మునిగిందో ఆయనే చెప్పాలి. అవినీతిపై పోరాటం పేరుతో పెద్ద నోట్ల రద్దు ద్వారా ప్రజల ముక్కు పిండి మరీ వసూలు చేసిన లక్షల కోట్ల రూపాయల లెక్కలు కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు తేల్చలేకపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత ఉపాధి, వ్యవసాయేతర ఉపాధి మరింత పతనావస్థకు చేరింది. జిఎస్టీ చట్టంతో గ్రామీణ ప్రాంతాల్లో కోటి వరకు ఉన్న చిన్న, సన్నకారు పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్ఖానాలు దివాళా తీసే ప్రమాదం వచ్చింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల నినాదాన్ని ఏ కబేళాకు తరలించారో తెలియడం లేదు. పశువిక్రయాలపై నిషేధాజ్ఞలు వేడి నీళ్లకు చన్నీళ్లు అన్నట్లుగా గ్రామీణ కుటుంబాలకు తోడవుతున్న పాడి ఆదాయాన్ని ఎండగట్టాయి. ఈ పరిస్థితుల్లో 2019లో అధికారానికి రావటంపై బిజెపికే కాదు మోడీకి సైతం అనుమానాలు ఉన్నాయి. అందువల్లనే బిజెపి వైఫల్యాలు ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు ఐక్యం కాకుండా ఉండేందుకు పథకం ప్రకారమే బిజెపి పాత మిత్రులకు గాలం వేస్తోంది. ఈ గాలానికి చిక్కిన నితీష్ వంటి వాళ్లు ఇప్పటి నుండే అవాస్తవాలు, అభూత కల్పనలతో మోడీ గుణగానాలతో దేశాన్ని మోసం చేయటానికి, వాస్తవాలు ప్రజల దృష్టికి రాకుండా చూడటానికి సైంధవ పాత్ర పోషించటానికి సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో బిజెపి యేతర పార్టీలు స్వతంత్రంగానైనా, ఉమ్మడిగానైనా అధికారం కోసం బిజెపి, దాని తోడు దొంగలు పడుతున్న ఆరాటాన్ని ప్రజల ముందు ఎండగట్టాలి. అప్పుడే బిజెపి నగ్న రూపం ప్రజల ముందుకు వస్తుంది. సైంధవుడు అడ్డుపడినంత మాత్రాన మహాభారతం ఆగిపోలేదన్న విషయాన్ని నితీష్ లాంటివాళ్లు, నితీష్ పాత్ర పోషించటానికి దక్షిణాది రాష్ట్రాల్లో సిద్ధమవుతున్న మరికొద్ది మంది నాయకులు గుర్తించాలి. ★



నితీష్-మోడీ మైత్రికి పునాదులు వేసిన సూత్రం అవినీతిపై పోరాటం కాదు. అధికారం కోసం ఆరాటం. 2014 ఎన్నికల్లో అధికారానికి రావటానికి మోడీ చేసిన అనేక వాగ్దానాల్లో ఒక్కటీ నెరవేర్చలేకపోయారు. ఈ పరిస్థితుల్లో 2019లో అధికారానికి రావటంపై బిజెపికే కాదు మోడీకి సైతం అనుమానాలు ఉన్నాయి. అందువల్లనే బిజెపి వైఫల్యాలు ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు ఐక్యం కాకుండా ఉండేందుకు పథకం ప్రకారమే బిజెపి పాత మిత్రులకు గాలం వేస్తోంది.

ఉద్యోగాల భర్తీ కోసం విశాల పోరాటం



వి.వి.శ్రీనివాసరావు

సందర్భం

ఇంటికో ఉద్యోగం అని ఎన్నికల్లో ఊదరగొట్టిన కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇప్పుడు ఆ ఊసే లేకుండా పాలన సాగిస్తున్నారు. ఈ అలసత్వాన్ని చూస్తూ ఊరుకోని నిరుద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. నెలరోజులుగా ఎపిలో నిరుద్యోగ సమస్యపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో అనేక రూపాల్లో నిర్వహిస్తున్న పోరాటం ప్రభుత్వంలో కదిలిక తెచ్చి, ఉద్యోగా ల భర్తీకి దోహదం చేస్తుందని భావిస్తున్నాం.

2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో 'జాబు రావాలంటే-బాబు రావాలని', 'ఇంటికో ఉద్యోగం ఇస్తామని', 'ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని' టిడిపి హామీ ఇచ్చింది. ఇలా యువత, విద్యార్థుల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన చంద్రబాబు ఇప్పుడు ఆ హామీలనే మర్చిపోయారు. అంతేకాదు ప్రత్యేక హోదాతో కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తాయని వాటి ద్వారా లక్షల ఉద్యోగాలు వచ్చి నిరుద్యోగుల కష్టాలు తీరిపోతాయని బాకాలు ఊదారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో గానీ, ఉపాధి కల్పనలో గానీ నిరుద్యోగులను, రాష్ట్ర ప్రజలను అధికార తెలుగుదేశం, బిజెపిలు నిలువునా మోసం చేశాయి.

'కమలనాథన్ కమిటీ' నివేదిక ప్రకారం రాష్ట్రంలో 1 లక్షా 42 వేల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. వయోపరిమితి పెంపు గడువు 2017 జూన్‌తో ముగియడంతో ఈ ఏడాది రిటైర్ అవుతున్నవాళ్లు 35 వేల వరకూ ఉన్నారు. ఎపిపిఎస్సీ ద్వారా 20,250 పోస్టులు భర్తీ చేస్తామని 2016 ఫిబ్రవరిలో ప్రభుత్వం ప్రకటించింది. కాని నేటికీ పట్టుమని 10 వేల పోస్టులకు కూడా నోటిఫికేషన్‌లు ఇవ్వలేదు. ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో చిత్తశుద్ధితో కాకుండా అనేక లొసుగులు పెట్టి కోర్టులకు వెళ్లే విధంగా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. లక్షల్లో ఖాళీలుంటే వందల్లో నోటిఫికేషన్లు వస్తున్నాయి. తెలుగుదేశం మేనిఫెస్టోలో ప్రతి ఏడాదీ డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని పేర్కొంది. గత ప్రభుత్వం ఇచ్చిన 2014 డిఎస్సీని నిరుద్యోగులు పోరాటం చేస్తే గాని భర్తీ చేయలేదు. 2015 నుండి 2017 వరకు డిఎస్సీ నోటిఫికేషన్ ఊసే లేదు.



గతేడాది ప్రభుత్వం నిర్వహించిన సాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో 34 లక్షల మంది నిరుద్యోగులు వున్నారు. అయితే రిజిస్టర్డ్ నిరుద్యోగులు 9 లక్షల మందేనని ప్రకటించి నిరుద్యోగులను తక్కువ చేసి చూపిస్తున్నారు. అంటే నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టడానికి ప్రభుత్వం పక్కదారులు వెతుకుతోంది.

నేడు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనల సందర్భంగా

కొత్త ఉద్యోగాల కంటే - ఊడదీసిన ఉద్యోగాలే ఎక్కువ!

ఈ కాలంలో వృద్ధాప్య ఫించన్లు ఇచ్చే సిపిఎస్‌లు, క్లస్టర్ యాక్టివిస్టులు, విలేజ్ యాక్టివిస్టులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వైద్య విధాన పరిషత్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, స్పెస్ ఉద్యోగులు, హౌసింగ్ డిపార్టుమెంట్‌లో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులు దాదాపు 40వేల మందిని తెలుగుదేశం ప్రభుత్వం తొలగించింది. ఇచ్చే వాటికన్నా ఊడ బీకింది మూడురెట్లు ఎక్కువ. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. వీరిలో దాదాపు ఒక లక్ష మంది వరకు ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డారు. ఈ మూడేళ్లల్లో వందలాది పరిశ్రమలతో రాష్ట్ర ప్రభుత్వం అనేక ఒప్పందాలు చేసుకుంది. అంతేకాక వీటి ద్వారా ఐదారు లక్షల ఉద్యోగాలు వస్తాయని ఆర్భాటంగా ప్రకటించింది. కానీ రాష్ట్రంలో అదనంగా వచ్చిన పరిశ్రమలు గానీ, ఉద్యోగాలు గానీ ఎక్కడా కనిపించడం లేదు. కోస్తా జిల్లాలో శ్రీకాకుళం-చెన్నైయ్ కారిడార్ పేరుతో ఉద్యోగాల కల్పనంటూ ప్రభుత్వం ఊదరకొట్టినా ఎక్కడా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. కానీ ఆయా కంపెనీలకు మాత్రం లక్షలాది ఎకరాల భూములను కారుచౌకగా కట్టబెడుతోంది. ఒక వైపు ఆ భూముల్లో పరిశ్రమలు రాక, వ్యవసాయం చేయక అవన్నీ బీడుబారాయి. ఈ ఘటనలు ఇప్పటికే భూ కేటాయింపులు జరిగిన చోట కనిపిస్తున్నాయి. రైతులు, ప్రజలు తమ భూములు, ఊళ్లు త్యాగం చేస్తే వచ్చిన ఎస్ఇజెడ్‌లు, హబ్‌ల వంటి సంస్థల్లో కూడా స్థానికులకు అవకాశం కల్పించడం లేదు. అసలు నిర్వాసితులంటేనే కంపెనీ గేటు దగ్గరకు కూడా రానీయడం లేదు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఒక్క పైసా ఖర్చులేకుండా 3500 ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ప్రభుత్వానికి ఉన్నా ఇప్పటికీ దీనిపై స్పందించడం లేదు.

నిరుద్యోగ భృతిపై కపట నాటకం!

ఇటీవల రాష్ట్రంలో నిరుద్యోగుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని గమనించిన చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యగ భృతిపై ఒక ప్రకటన చేసింది. అయితే ఈ ప్రకటనలో కూడా అనేక మతలబులు, మడతపేచీలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులు కడుపు మండి ఉన్నారని గమనించే, కనీసం ప్రకటనలతోనైనా వారిని సంతృప్తి పరిచేందుకు ఈ ఎత్తుగడ వేస్తున్నట్లు కనిపిస్తోంది. గత బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి కోసం రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇదే ప్రభుత్వం గతేడాది నిర్వహించిన సాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో 34 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. మరి ప్రభుత్వం కేటాయించామని చెబుతున్న ఈ రూ.500 కోట్లు ఏ మూలకొస్తాయో పాలకులే చెప్పాలి! పైగా రాష్ట్రంలో రిజిస్టర్డ్ నిరుద్యోగులు 9 లక్షల మందేనని ప్రకటించి నిరుద్యోగులను తక్కువ చేసి చూపిస్తున్నారు. అంటే నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టడానికి ప్రభుత్వం పక్క దారులు వెతుకుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల భర్తీలోనూ, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వంలో కదలిక తెచ్చేందుకు యువతీ, యువకులను భాగస్వామ్యం చేస్తూ డివైఎఫ్ఐ ఉద్యమానికి రూపకల్పన చేసింది. నిరుద్యోగుల్లో విస్తృతమైన ప్రచారం చేయడం, వారిని పోరాట పథంలో నడిపించేందుకు నడుంబిగించింది. తద్వారా ఈ పోరాటం ఉద్యోగాల భర్తీకి, నిరుద్యోగ భృతిని సాధించేందుకు దోహదం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఈ మోసకారి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే దిశగా రూపుదిద్దుకుంటుందని ఆశిస్తున్నాం.

(రచయిత డి.వై.ఎఫ్.ఐ. రాష్ట్ర ఉపాధ్యక్షులు)

అగ్గిలా అడుగు

మెయిల్

అడుగు!
ఎవరడగ వద్దన్నారు?
ఏం కావాలో ఎలా కావాలో
అలా.. అడుగు
క్షుణ్ణంగా అడుగు అవగాహనతో
అడుగు
అనుమానం నివృత్తి అయ్యేంత
వరకు
గంట కొట్టినట్టు అగ్గిలా అడుగు
ఒకర్ని కాకుంటే ఇంకో ఇద్దర్ని అడుగు
అడిగేందుకే పుట్టినట్టు
ఆ హక్కు నీకే సొంతమైనట్టు
అడుగుటలో దిట్టగా పట్టా పొందినట్టు
సమాధానం దొరికే వరకు
ఆగేది లేదని అడుగు
అడుగుతున్నాడని అనిపించేలా కాదు
ఏమడుగుతాడో అని అదిరిపడేలా అడుగు
దిక్కులు చూడవద్దనడం లేదు
చూసే అడుగు
చుట్టూరా.. ఏం జరుగుతోందో గమనిస్తూ అడుగు
తప్పుచేసిన వాడికి ముచ్చెమటలు పట్టి
చలనమొచ్చేలా అడుగు
ప్రలోభాలకు లొంగకుండా ప్రగల్భాలకు పోకుండా
ప్రతిపక్షమై అడుగు అధికారంతో అడుగు
కష్టం తెలిసొచ్చేలా నష్ట నివారణ జరిగేలా
ప్రజలు హర్షించేలా నిగ్గదీసి అడుగు
ఏకి పడేస్తూ అడుగు
అడిగీ అడిగీ కుళ్ళునంతా కడుగు
కలిసొచ్చే వాళ్ళు నీ గెలుపు చూసైనా వస్తారు.
కాకపోతే ఒకటి!
నిన్నెవరైనా ఏమైనా అడిగితే
విసుక్కోకుండా వినయంగా వివరంగా
చెప్పడానికి సిద్ధంగా వుండు
నీలాగే వాళ్ళు వాళ్ళలాగే నీవు
ఇక నీలినీడలు ఎక్కడుంటాయి
అగ్గి నిప్పులెందుకు అవసరమౌతాయి
అంతటా సతత హరితారణ్యపు
హర్షాతిరేకాలే కదా కనబడతాయి.

యాములపల్లి నరసిరెడ్డి

జీవన family



స్ఫూర్తిదాయక అనుబంధం మాధుర్యపు మమకారం

అక్క స్ఫూర్తితో తమ్ముడు...తమ్ముడి స్ఫూర్తితో అక్క.. తెలుగు సాహిత్యరంగంలో తమ రచనలతో సుసంపన్నం చేయడమే కాదు. ఆత్మీయ జీవనానుబంధాన్ని అవిష్కరిస్తున్నారు. వారే ప్రముఖ సాహితీవేత్తలు వాడ్రేవు చినవీరభద్రుడు.. అతని సోదరి వాడ్రేవు వీరలక్ష్మీదేవి. 'అక్కే లేకపోతే నాకు సాహిత్యమంటే ఏమిటో సౌందర్యమంటే ఏమిటో తెలిసేవి కావు' అని వీరభద్రుడు అంటే.. 'గత రెండున్నర దశాబ్దాలుగా తమ్ముడు రాస్తున్న ప్రతి వాక్యం నన్ను ప్రభావితం చేస్తోంది' అని చెప్పే వీరలక్ష్మీదేవీ.. వీరిద్దరి పరస్పరానుబంధ అనుభూతుల అక్షర భాషణ.. 'రాఖీ' సందర్భంగా 'జీవన' పాఠకుల ప్రత్యేకం.



వాడ్రేవు వీరలక్ష్మీదేవి తెలుగు నాట అత్యుత్తమ కథలు రాస్తున్నవారిలో ఒకరు. ఆమె తమ్ముడు వాడ్రేవు చినవీరభద్రుడు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖలో ఉన్నతాధికారిగా ఉంటూనే మరోవైపు అక్షర సేద్యాన్ని చేస్తున్నారు. నవల, కథ, కవిత్వం, వ్యాసం, విమర్శ, పరామర్శ, యాత్రాకథనాలు.. పెయింటింగ్ ఇలా విభిన్న ప్రక్రియల్లో తనదైన మార్గంలో ముందుకు సాగుతున్నారు. వీరిద్దరి గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. ఒకరి హృదయంలో మరొకరికి గల ఆత్మీయ భావనలే ఎల్లప్పుడూ... వారి మనోఔన్నత్య పరిమళాలను వెదజల్లుతున్నాయి.

అక్క కళ్లల్లోంచే ప్రపంచాన్ని చూసా!

మా అక్క వాడ్రేవు వీరలక్ష్మీదేవి విశాఖపట్టణం జిల్లా ప్రస్తుతం కొయ్యూరు మండలంలో ఉన్న తోటలూరు అనే చిన్న గిరిజన గ్రామంలో 1954లో పుట్టింది. అది మా అమ్మ పుట్టిల్లు. ఆ ఊరు ఇప్పటికీ చిన్న పల్లె. అక్కడ నుంచి ఈ 63 ఏళ్లల్లో ఆమె ఎంత ప్రయాణం చేసిందనీ.. మా మొత్తం తాలూకాలోనే ఆమె మొదటి పోస్ట్ గ్రాడ్యుయేట్. మా మొత్తం తరంలోనే ఆమె మొదటి లెక్చరర్. మొదటి మహిళా రచయిత. రోడ్డు, కరెంట్, హైస్కూల్‌చ కాలేజీ, రేడియో, వార్తాపత్రికలు లేని ప్రాంతం నుంచి ఆమె విద్యావంతురాలిగా, భావుకురాలిగా, జీవిత దార్శనికురాలిగా మారడం వెనుక, తన జీవితం మీద తాను సాధికారికత సంపాదించుకోవడం వెనుక ఆమె చేసిన ప్రయాణం.. పడ్డ కష్టాలూ మామూలు కావు. అవన్నీ ఆమె అక్షరరూపంలో పెడితే ఈనాటి యువతీయువకులకి ఆ అనుభవాల నుంచి నేర్చుకోవలసింది ఎంతో కనిపిస్తుంది.



నా మనస్సుకు జన్మనిచ్చింది..

మా అక్క కన్నా నేను తొమ్మిదేళ్ళు చిన్నవాణ్ణి. ఆమె గురించిన నా జ్ఞాపకాలు నా ఐదో ఏట నుంచో, ఆరో ఏట నుంచో మొదలయ్యాయి అనుకుంటే.. దాదాపు 48 ఏళ్ళ జ్ఞాపకాల పరంపరనంతా నేను తలుచుకోవలసి ఉంటుంది. కానీ ఒక్కమాటలో చెప్పాలంటే.. మా అమ్మ నా భౌతిక శరీరానికి జన్మనిస్తే.. మా అక్క నా మనస్సుకి జన్మనిచ్చింది. మా అక్కే లేకపోతే నాకు సాహిత్యమంటే ఏమిటో, సౌందర్యమంటే ఏమిటో తెలిసి ఉండేవి కావు. మా శరభవరంలో మా చిన్నప్పటి వసంతకాలపు అడవి.. వైశాఖమాసపు అపరాహ్ణాలూ, వర్షాకాలమంతటా ఎడతెరిపి లేకుండా కమ్ముకునే ముసురు, శరత్కాలాల వెన్నెల రాత్రులు.. హేమంత సంక్రాంతీ నన్ను సమ్మోహన పరిచేవంటే.. అందుకు కారణం వాటిని నేను మా అక్క కళ్ళతో చూసినందు వల్లనే.

కుటుంబ బాధ్యత తలకెత్తుకుంది

ఆడపిల్లని చదివించడం ఆ రోజుల్లో కష్టం మాత్రమే కాదు.. అసాధ్యం కూడా. కానీ మా నాన్నగారు ఆమెని చదివించారు. ఆ తర్వాత అక్క మా నాన్నగారినీ, మా కుటుంబాన్నీ కష్టసమయంలో రెండు చేతులా ఆదుకుంది. ముగ్గురు తమ్ముళ్ళనీ, నలుగురు చెల్లెళ్ళనీ చదివించి, వాళ్ళకొక జీవితాన్ని సమకూర్చింది. ఆమె సాహిత్య జీవితం అంతా ఒక ఎత్తూ, ఈ కృషి ఒక్కటీ ఒక ఎత్తు. ఈ ప్రయాణంలో ఆమె చూసిన ఎగుడుదిగుళ్ళ గురించి ఎక్కడా రాయకపోయి ఉండవచ్చు. ఇతరులెవరికీ తెలియకపోవచ్చు. కానీ మా హృదయాల్లో మాత్రం అవి చెక్కుచెదరకుండా సజీవంగా ఉంటాయి.

ప్రభావితురాలైన గురువు

మా అక్క గొప్ప ఉపాధ్యాయురాలు. ఆమె తరగతిగదిలోనూ, బయటా కనీసం రెండుతరాల్ని ప్రభావితం చేసింది. ఇప్పటికీ యువత ఆమె చుట్టూ మూగుతారంటే.. ఆమెలోని గురువుకున్న గురుత్వాకర్షణ శక్తి అలాంటిది. మల్లంపల్లి శరభయ్యగారూ, భమిడిపాటి జగన్నాథరావుగారూ వంటి మహనీయులు ఆమెకు గురువులు. ఆమెకి తమ్ముణ్ణి అయినందున నాక్కూడా వారే గురువులు. 'ఉత్తమోత్తమ గురుల శిష్యుండనైతి/గురుడనైతిని సచ్ఛిష్యకోటులకును' అని కవి అన్న మాటలు ఆమె విషయంలో అక్షర యథార్థాలు.



గొప్ప కథా రచయిత్రి

మా అక్క గొప్ప కథకురాలు అని నేను మళ్ళా చెప్పనవసరం లేదు. 'ఉత్సవ సౌరభం' 'కొండ ఫలం' తదితర అనేక కథా సంపుటాలు చదివినవాళ్ళకి ఈ సంగతి తెలుసు. స్త్రీ సమస్యలకి పరిష్కారం ఆర్థికస్వాతంత్ర్యంతో ఆగదనీ.. అక్కణ్ణుంచి మళ్ళీ మరొక కొత్త ప్రయాణం, పోరాటం మొదలవుతాయనీ ఆమె గత 35 ఏళ్ళుగా చెప్తూ వచ్చింది. నాకు తెలిసి ఆమె '24 కారెట్' కథ (1983) రాసేనాటికి తెలుగు సాహిత్యంలో మిలిటెంట్ స్త్రీవాద సాహిత్యమేదీ ప్రభవించనే లేదు (బహుశా ఒక్క రాజమండ్రి సావిత్రి రాసిన 'ఈ దేశంలో ఇదో వర్గం' కథ ఒక్కటీ మినహాయిస్తే). కానీ అక్క ముందుచూపుకి తెలుగు సాహిత్యలోకం, విమర్శకులు ఆమెకి ఇవ్వవలసిన గుర్తింపు ఇవ్వకపోవడం నాకు మనసుకి చాలా కష్టం కలిగిస్తుంది. 20వ శతాబ్ది తెలుగు రచయిత్రుల రచనలతో సాహిత్య అకాడమీ కోసం అబ్బూరి ఛాయాదేవి రూపొందించిన సంకలనంలో అక్క రచన లేకపోవడం పెద్ద లోటు. కానీ జీవితమంతా విలువల కోసం నిలబడే అక్కలాంటి రచయిత్రి పేరుకోసం పాటుపడక పోవడం వల్ల ఇట్లాంటి సాహిత్య తప్పిదాలు తప్పవనుకుంటాను.



సాహిత్య కృషి చేయాలి

ఆమె కొంత సాహిత్య విమర్శ, సమీక్షా చేసింది. 'సాహిత్యానుభవం' పేరిట వచ్చిన ఆ వ్యాస సంకలనం ఆధునిక తెలుగువిమర్శలో లెక్క పెట్టదగ్గ పుస్తకాల్లో ఒకటని అనుకుంటాను. గత కొన్నేళ్లపాటు 'చినుకు' మాసపత్రికలో ఆమె భారతీయ నవలల్లో ఉత్తమరచనల్ని తెలుగుపాఠకులకి పరిచయం చేస్తూ వస్తోంది. ఈ కృషిలో ఆమెని మాలతీచందూర్‌తో పోల్చకుండా ఉండటం కష్టం. ఇవి కాక ఆమె కాలమిస్టుగా రాసిన ఆణిముత్యాల్లాంటి రచనలు 'ఆకులో ఆకునై', 'మా ఊళ్ళో కురిసిన వాన' పేరిట పుస్తకరూపంలో తెచ్చింది. వాటిని ఆరాధ్య గ్రంథాల్లాగా పఠించే భావుక పాఠకుల్ని నేను స్వయంగా చూశాను. ఆమె ఎప్పుడో రాసిన 'వెల్లువ' నవల తరువాత మళ్ళా మరే నవలా రాయలేదు. ఆమె నుంచి కనీసం రెండు మూడు అత్యుత్తమ నవలలు రావలసి ఉంది. భారతీయ నవలల్లో ఉత్తమోత్తమ రచనల్ని చదివినందు వల్లా, అటువంటి నవలలు తెలుగులో రావట్లేదని నాలానే తనూ ఆవేదన చెందుతున్నందు వల్లా.. అట్లాంటి లోటును పూరించాల్సిన బాధ్యత ఆమెదే అనుకుంటాను. ఈ సందర్భంగా ఆమె నుంచి మంచి రచనలు మరిన్ని రావాలనీ, తరిగిపోని మమకారపు మాధుర్యాలను మా అందరికీ అందిస్తూనే ఉండాలనీ నా ఆకాంక్ష.

- చిన వీరభద్రుడు

- బెందాళం క్రిష్ణారావు

తమ్ముడి అక్షర వెలుగుల్లో కొత్తచూపు..

నేను ఐదో తరగతి చదువుతున్నప్పుడు అమ్మ ఈ తమ్ముడికి జన్మనిచ్చింది. నా తమ్ముళ్లందరి కన్నా చిన్నోడు మా చినవీరభద్రుడు. మా ఇద్దరికీ వయసులో తొమ్మిది, పది సంవత్సరాల వ్యత్యాసం ఉంటుంది. నాలుగు నెలల పిల్లవాడిగా ఉన్నప్పుడు నేను ఆరోతరగతి చదవడానికి పక్కూరికి వెళ్లి, అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆరో తరగతి పరీక్షలయ్యాక మా ఊరొచ్చాను. ఆరోజు బాగా చీకటిగా ఉంది. మాది మారుమూల గ్రామం. నేనింటికి వచ్చేసరికి అమ్మ హరికేన్ దీపాన్ని వెలిగించి ఉంది. నేనింట్లో అడుగు పెట్టడంతోనే అమ్మను అడిగా.. 'చిన్నతమ్ముడు ఎంత పెద్దోడయ్యాడో చూపించమ్మా!' అని.. అందుకు అమ్మ ఇంట్లో మూల చీరతో కట్టిన ఊయల వేపు చూపించింది. నేను అటు పరుగెత్తి ఊయల్లో నిద్రపోకుండా అన్నీ గమనిస్తున్న తమ్ముడ్ని చూసా. అప్పటికి నల్లని శరీరంతో, నేరేడు పళ్లలా మెరుస్తున్న కళ్లతో.. ఉన్న తమ్ముడ్ని ఎంతో అపురూపంగా చూశాను. అ జ్ఞాపకం ఎప్పటికీ చెక్కుచెదరదు. చిన్నతనంలో ప్రతి సందర్భంలోనూ ఎప్పుడూ నాతోనే.. నా వెంటే తిరగాడుతూ ఉండేవాడు. వీరభద్రుడి ఎదుగుదల అంతా నా కళ్లముందే జరిగింది.

పరిపక్వత గలవాడు

తమ్ముడు మాత్రం అందరితో చెబుతుంటాడు మా అక్కే నన్ను ప్రభావితం చేసిందని. కానీ గత రెండున్నర దశాబ్దాలుగా వీరభద్రుడు రాస్తున్న ప్రతీ వాక్యం నన్ను ప్రభావితం చేస్తూనే ఉంది. మా అందరిలో కన్నా అతనికే స్పష్టమైన దార్శనికత ఉంది. అలౌకిక ప్రపంచ దర్శనాన్ని చేశాడు. తన అక్షరాల ద్వారా. జీవితంలోని అన్ని కోణాల్లో ఉండే వెలుగుల్ని పసిగట్టి సారాంశాన్ని తెలుసుకుని, అక్షరాల్లోకి పంపించే విద్యని తెలుసుకున్నాడు వీరభద్రుడు. చాలా ఏళ్ల సాధన చేస్తే గానీ అటువంటి పరిపక్వత రాదు. ఈ సందర్భంగా వీరభద్రుడు నా 'చిన్న'తమ్ముడు అయినందుకు అనందిస్తున్నాను.

- వీరలక్ష్మీదేవి





ఆత్రుతగా ఆహారం తీసుకోవద్దు

ఆందోళన, కోపం, బాధ వీటివలన మనం తీసుకునే ఆహారం విషయంలో మార్పు వస్తుంది. అంతేకాదు మనం తీసుకున్న ఆహారం కూడా వంట పట్టదు. ఆహారం ఎప్పుడూ కూడా నిదానంగా నమిలి తినాలి. కాని ఎప్పుడైతే మన మనసు బాగుండదో అప్పుడు తొందరగా తినేసి అక్కడి నుంచి వెళ్లిపోవాలని అనుకుంటాం. ఇలా చకచకా తినడం మంచిది కాదు. మనం బాగా వత్తిడికి లోనైనప్పుడు ఆహారం తీసుకుంటే ఆహారం జీర్ణం అవడం కూడా కొంచెం కష్టమే అవుతుంది. ఆహారం తీసుకునేటప్పుడు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకూడదు. ఆ సమయంలో సీరియస్ విషయాలను చర్చించకూడదు. వీలు కుదిరితే నవ్వుతూ మాట్లాడుకోవాలి. వీలైనంత వరకు మౌనంగా భోజనం తినడం మంచిది. అసలు సమస్యని భోజన సమయంలో చర్చించడం, దాని గురించి ఆలోచనలో పడడం వంటివి చేయకూడదు. ప్రశాంతంగా తీసుకున్న ఆహారమే వంటికి బాగా వంటపడుతుంది. చాలామంది శుభ్రంగా తింటారు. అయిన మేము ఎంత తిన్నా అది వంటపట్టటం లేదని బాధపడుతుంటారు. దీనికి కారణం తినేటప్పుడు ఏదో ఒకటి ఆలోచించడం, చర్చించడం వంటివి ముఖ్య కారణాలు. ఆహారం తీసుకునేటప్పుడు ప్రశాంతంగా ఉండాలి. అప్పుడే మనం తిన్నదంతా శుభ్రంగా వంటపడుతుంది.

బరువు పెరగాలా?

బరువు తగ్గాలంటే కష్టంగానీ పెరగటం కష్టమా అని చాలా మందికి అనిపిస్తుంటుంది. కాని కొందరు ఎంత ప్రయత్నించినా బరువు పెరగరు. బరువు పెరగాలన్నా పెద్ద కసరత్తులే చేయాల్సి ఉంటుంది. కొన్ని చిట్కాలు పాటిస్తే బరువు పెరుగుతారు.

- బరువు పెరగకపోవడానికి చాలా కారణాలు ఉంటాయి. సరైన ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం వల్ల బరువు పెరగకపోవచ్చు.
- ముఖ్యంగా పిల్లలు బరువు పెరగకపోవడానికి రక్తహీనతలాంటి వ్యాధులు కారణం కావచ్చు. కాబట్టి ముందుగా ఏ కారణం చేత బరువు పెరగడం లేదో ఒకసారి డాక్టరుతో పరీక్ష చేయించాలి. ఏ వ్యాధి లేదని తేలితే అప్పుడు ఆహారపు అలవాట్లే కారణం అని నిర్ధారణకు రావచ్చు.
- ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయగానే తప్పకుండా ఏదైనా ఒక ఫ్రూట్‌ను తీసుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్‌కు లంచ్‌కు మధ్యలో స్నాక్స్ తీసుకోవాలి. దీనివల్ల అదనపు క్యాలరీలు లభిస్తాయి.



- రాత్రి అన్నం తిన్న వెంటనే గ్లాసు పాలు, ఒక పండు తీసుకోవాలి.
- ప్రతి రోజు చేసుకునే కూరలలో నువ్వుల పొడి, పల్లీల పొడి వేసుకుంటే అదనపు శక్తి లభిస్తుంది.
- అటుకులు, బెల్లంను పిల్లలకు పెట్టవచ్చు. మొక్కజొన్న, గోధుమ, రాగులు, సజ్జలు తదితర ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు పెట్టినా బరువు పెరుగుతారు. అన్నంలో నెయ్యి వేసుకుంటే అదనపు శక్తి లభిస్తుంది.

జీవన సౌరభం

ఒక మంచి పుస్తకం వందమంది మిత్రులకు సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

మీ కోసం

ఆహారంలో క్యాబేజీ తీసుకుంటే మంచిది. ఇందులో ఉండే గ్లుటమైన్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది.



హిందుస్థాన్ షిప్‌యార్డ్ పురాతన నామం ?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, గుంటూరు.
సెల్ : 9985288150

మాదిరి ప్రశ్నలు

1. రాష్ట్రంలో రాజీవ్ ఇంటర్నెట్ విలేజ్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు ?
ఎ. 2008 ఆగస్టు బి. 2004 ఏప్రిల్
సి. 2004 ఆగస్టు డి. 2006 జనవరి

2. 'బునకర్ బీమా యోజన పథకం' ఏ కార్మికులను ఆదుకునేందుకు ప్రవేశపెట్టారు ?
ఎ. బొగ్గు గనులు బి. పంచదార పరిశ్రమలు
సి. చేనేత పరిశ్రమలు డి. బీడీ కార్మికులు

3. రాష్ట్రంలో (2014-15)లో గ్రానైట్ ఉత్పత్తి ఎంత పెరిగింది ?
ఎ. 15,000 నుంచి 50,000 సిబిఎం వరకూ
బి. 25,000 నుంచి 5,000 సిబిఎం వరకూ
సి. 35,000 నుంచి 50,000 సిబిఎం వరకూ
డి. 40,000 నుంచి 50,000 సిబిఎం వరకూ

4. లక్షల పరిమితికి లోబడి చిన్న పరిశ్రమలకు స్థిర మూలధన పెట్టుబడులపై ఇచ్చిన సబ్సిడీ ?
ఎ. 15 శాతం బి. 20 శాతం
సి. 30 శాతం డి. 10 శాతం

5. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 2015 నుంచి సెప్టెంబర్ 2015 మధ్య పారిశ్రామిక ఎగుమతుల విలువ (రూ. కోట్లలో) ?
ఎ. 19,183.74 కోట్లు బి. 17,250.50 కోట్లు
సి. 16,918.64 కోట్లు డి. 18,452.85 కోట్లు

6. 2015-16 సంవత్సరానికిగానూ (2015 ఏప్రిల్ నుంచి 2015 సెప్టెంబర్ వరకూ) సాఫ్ట్‌వేర్ (ఐటి అండ్ ఐటిఈఎస్) ఎగుమతుల విలువ ?
ఎ. 1,27,500 కోట్లు బి. 1,72,500 కోట్లు
సి. 1,57,500 కోట్లు డి. 1,32,500 కోట్లు

7. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్, టిఐఎఫ్‌ఎసిలు సంయుక్తంగా ఏర్పరచిన సంస్థ ?
ఎ. సిఐబిఎఫ్ బి. ఎపిఐడిసి
సి. ఐఎఫ్‌సిఐ డి. ఐడిబిఐ

8. కింది ప్రభుత్వరంగ సంస్థలు వాటిని ఏర్పాటు చేసిన సంవత్సరంలో సరిగా జతపరిచినది ?
ఎ. భారత హెవీ ప్లేట్స్ అండ్ వెస్సల్స్ లిమిటెడ్ – 1966
బి. భారత డైనమిక్స్ లిమిటెడ్ – 1970
సి. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, విశాఖ – 1982
డి. భారత హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ – 1960

9. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఏ నగరంలో ఉంద ?
ఎ. లక్నో బి. నాగపూర్
సి. హైదరాబాద్ డి. జైపూర్

10. కిందివాటిలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి సరైనది (2014-15 వరకూ) ?
ఎ. యూనిట్లు – 1,11,387
బి. పెట్టుబడి – రూ.20,592.14 కోట్లు
సి. ఉద్యోగిత – 12,42,294 మంది
డి. పైవన్నీ 2015

11. దేశంలో పారిశ్రామిక విధానంలో సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ?
ఎ. కర్ణాటక బి. రాజస్థాన్
సి. ఆంధ్రప్రదేశ్ డి. గోవా

12. ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్ స్కీం కింద గుర్తించిన, విజయవాడ వద్ద ప్రారంభించిన పారిశ్రామిక సముదాయం ?
ఎ. ఫార్మాక్లస్టర్ బి. ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్
సి. పవర్ టామ్ క్లస్టర్ డి. ఆటో కంపోనెంట్ క్లస్టర్

13. 2015 సెప్టెంబర్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో సెజ్‌ల ద్వారా సుమారు ఎంత మంది ఉద్యోగాలు పొందారు ?
ఎ. 79,895 బి. 89,895
సి. 62,895 డి. 99,895

14. హిందుస్థాన్ షిప్‌యార్డ్ పురాతన నామం ?
ఎ. టాటా స్టీమ్ నావిగేషన్ కంపెనీ
బి. బిర్లా స్టీమ్ నావిగేషన్ కంపెనీ
సి. సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ
డి. పైవేవీకావు

15. 2015-16లో (2015 సెప్టెంబర్ నాటికి) రాష్ట్రంలో సెజ్‌ల ఉత్పాదక విలువ (రూ. కోట్లలో)
ఎ. 4,295.31 కోట్లు బి. 4,500 కోట్లు
సి. 3,584.40 కోట్లు డి. 5,800 కోట్లు

16. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలకు, సెక్రటేరియట్‌తో ప్రత్యక్ష సంబంధాలను, జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సులు దేని ద్వారా నిర్వహిస్తారు ?
ఎ. ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్
బి. సెక్రటేరియట్ నాలెడ్జ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్
సి. ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్
డి. ఆంధ్రప్రదేశ్ స్టేట్‌వైడ్ ఏరియా నెట్‌వర్క్ (ఎపిఎస్‌డబ్ల్యూఎఎన్)

17. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఎన్నో స్థానంలో నిలిచింది ?
ఎ. 13వ స్థానంలో బి. రెండో స్థానంలో
సి. మూడో స్థానంలో డి. నాల్గో స్థానంలో

18. విశాఖ ఉక్కుకర్మాగారానికి ఎప్పుడు శంకుస్థాపన చేశారు ?
ఎ. 20 జనవరి 1977 బి. 20 జనవరి 1971
సి. 20 జనవరి 1987 డి. 20 జనవరి 1991

19. 2015 అక్టోబర్ వరకూ ఆంధ్రప్రదేశ్ మినరల్స్ మైనింగ్ సెక్టార్ (2015-16) మొత్తం ఆదాయం ఎంత నమోదైంది ?
ఎ. 716.17 కోట్ల రూపాయలు
బి. 816.16 కోట్ల రూపాయలు
సి. 916.16 కోట్ల రూపాయలు
డి. 616.17 కోట్ల రూపాయలు

20. మన రాష్ట్రంలో పారిశ్రామికోత్పత్తి సూచీ తయారీకి తీసుకొన్న మొదటి ఆధార సంవత్సరం ?
ఎ. 1960 బి.1956
సి. 1980 డి. 1993–94

21. వైజాగ్, చెన్నయి ఇండస్ట్రియల్ కారిడార్ (ఈస్ట్ ఎకనామిక్ కారిడార్) ద్వారా ఎన్నో నోడులను ప్రారంభించారు ?
ఎ. 19 నోడ్స్ బి. 12 నోడ్స్ సి. 4 నోడ్స్ డి. 13 నోడ్స్

22. రాష్ట్రంలో ఎపిఐఐసిని ఎప్పుడు ఏర్పాటు చేశారు ?
ఎ. 1973 బి. 1980 సి. 1985 డి. 1990

23. టెక్స్‌మాకో సిమెంట్ లిమిటెడ్ ఏ జిల్లాలో ఉంది ?
ఎ. కర్నూలు బి. కడప
సి. గుంటూరు డి. విజయనగరం

24. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య సంస్థ (ఎపిఎస్‌టిసి) ఎప్పుడు స్థాపించారు ?
ఎ. 1970 జూన్ బి. 1972 మే
సి. 1974 జూన్ డి. 1976 మే

25. 2015 సెప్టెంబర్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మాస్యూటికల్స్ సెజ్‌లు ఎన్ని పనిచేస్తున్నాయి ?
ఎ. 10 సెజ్‌లు
బి. రెండు సెజ్‌లు
సి. నాలుగు సెజ్‌లు
డి. ఏడు సెజ్‌లు

26. భారతదేశ టంగస్టన్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఎంత శాతం ఉత్పత్తి చేస్తుంది ?
ఎ. 18 శాతం బి. 17 శాతం
సి. 20 శాతం డి. 37 శాతం

27. రాష్ట్రంలోనే కాక భారతదేశంలోనే తొలుత మాంగనీసు ఏ ప్రాంతంలో ఉత్పత్తి చేశారు ?
ఎ. కడప బి. శ్రీకాకుళం
సి. కర్నూలు డి. నెల్లూరు

28. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నల్ల గెలాక్సీ గ్రానైట్ విస్తారంగా లభించే జిల్లా ?
ఎ. నెల్లూరు బి. కృష్ణా
సి. ప్రకాశం డి. ఖమ్మం

29. ఆంధ్రప్రదేశ్ తోళ్ల పరిశ్రమల అభివృద్ధి సంస్థ (లిడ్‌కాప్) ఏర్పాటు చేసిన సంవత్సరం ?
ఎ. 1963 సంవత్సరం బి. 1975 సంవత్సరం
సి. 1960 సంవత్సరం డి. 1972 సంవత్సరం

30. పారిశ్రామిక ఉత్పత్తుల సూచీని ఎన్ని వస్తు సముదాయాలుగా లెక్కగడతారు ?
ఎ. మూడు బి. నాలుగు
సి. రెండు డి. ఐదు

31. బునకర్ బీమా యోజన కింద లబ్ధిపొందే చేనేత కార్మికుల సంఖ్య ?
ఎ. లక్ష బి. రెండు లక్షలు
సి. మూడు లక్షలు డి. నాలుగు లక్షలు

32. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఎక్కడ ఉంది ?
ఎ. ఢిల్లీ బి. బెంగళూరు
సి. చెన్నయి డి. హైదరాబాద్

33. ఫార్మా పరిశ్రమ టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌గా వ్యవహరించేది ?
ఎ. ముఖ్యమంత్రి
బి. కేంద్ర రసాయనాల మంత్రి
సి. వ్యవసాయశాఖా మంత్రి
డి. భారీ పరిశ్రమలశాఖా మంత్రి

34. జనపనార పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన జిల్లా ?
ఎ. గుంటూరు బి. చిత్తూరు
సి. కృష్ణా డి. శ్రీకాకుళం

35. పరిశ్రమల ఆధునీకరణకు అవశ్యకమైన ఉత్పాదకాలను ఏర్పాటు చేసే పరిశ్రమలు ?
ఎ. ఉత్పాదక వస్తు పరిశ్రమలు
బి. మధ్యస్థ వస్తు పరిశ్రమలు
సి. బేసిక్ వస్తు పరిశ్రమలు
డి. వినియోగ వస్తు పరిశ్రమలు

36. యూనివర్సల్ టుబాకో కంపెనీ లిమిటెడ్ స్థాపించిన సంవత్సరం ?
ఎ. 1965 బి. 1970 సి. 1945 డి. 1957

37. తొలి పారిశ్రామిక విధాన తీర్మానం జరిగిన సంవత్సరం ?
ఎ. 1948 బి. 1952 సి. 1972 డి. 1956



38. మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు ?
ఎ. 50 కోట్లు బి. 100 కోట్లు
సి. ఐదు కోట్లు డి. 10 కోట్లు

39. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ప్రధానమంత్రి ట్రోఫీ'ని పొందిన కర్మాగారం ?
ఎ. విశాఖ స్టీల్ ప్లాంట్
బి. బోధన్ చక్కెర కర్మాగారం
సి. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్
డి. గోదావరి ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ

40. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 2015 నుంచి సెప్టెంబర్ 2015 మధ్య పారిశ్రామిక ఎగుమతుల విలువ ? (రూ. కోట్లలో)
ఎ. 19,183.74 బి. 17,250.50
సి. 16,918.64 డి. 18,452.85

41. మైకా ఖనిజాన్ని అధికంగా వినియోగించుకునే పరిశ్రమలు ?
ఎ. అద్దకం బి. ఎలక్ట్రానిక్స్
సి. మాంగనీసు డి. సున్నపురాయి

42. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కేంద్రం ఎక్కడ ఉంది ?
ఎ. హైదరాబాద్ బి. ముంబయి
సి. కోల్‌కతా డి. చెన్నయి

43. కృష్ణా-గోదావరి పరీవాహక ప్రాంతంలో లభ్యమవుతున్న సహజ వాయువును వినియోగించుకుని నడుపుతున్న ఎరువుల కర్మాగారం ?
ఎ. నాగార్జున ఫెర్టిలైజర్స్
బి. గోదావరి ఫెర్టిలైజర్స్
సి. కోరమాండల్ ఎరువుల కర్మాగారం
డి. ఆంధ్ర ఫెర్టిలైజర్స్

44. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ప్రత్యేక ఆర్థిక మండలాన్ని (సెజ్) ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ. హైదరాబాద్ బి. కాకినాడ
సి. విశాఖపట్నం డి. నెల్లూరు

45. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ. హైదరాబాద్ బి. పరవాడ
సి. నెల్లూరు డి. రాజమండ్రి

46. కిందివాటిలో 2012-13 నాటికి ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి ప్రభుత్వరంగ సంస్థల్లో అత్యధిక లాభాలు నమోదుచేస్తున్న మొదటి ఐదు సంస్థలు ?
1. ఎపి జెన్‌కో
2. ఏపి ట్రాన్స్‌కో
3. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
4. ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
5. ఏపీఎస్‌ఆర్టీసి
6. ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్
ఎ. 1,2,3,4,5 బి. 1,2,3,4,6
సి. 2,3,4,5,6 డి. 1,2,4,5,6

47. దేశంలో రాష్ట్ర స్థాయిలో పారిశ్రామిక విత్తసంస్థ ఏ రాష్ట్రంలో మొట్టమొదటిగా ఏర్పడింది ?
ఎ. పంజాబ్ బి. కేరళ
సి. ఆంధ్రప్రదేశ్ డి. తమిళనాడు

48. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ డెస్క్ పాలసీని ఎప్పుడు ప్రారంభించింది ?
ఎ. 2015, ఏప్రిల్ 29 బి. 2015 డిసెంబర్ 18
సి. 2015 మార్చి 31 డి. 2015 జూన్ 2

49. ఆస్బెస్టాస్ మైనింగ్ అండ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఎక్కడ స్థాపించారు ?
ఎ. పులివెందుల (కడప) బి. కర్నూలు
సి. చిత్తూరు డి. అనంతపురం

50. మొత్తం 524 పరిశ్రమలలో 522 తయారీ రంగానికి సంబంధించినవి కాగా, మిగిలిన రెండు పరిశ్రమలు ఈ రంగానికి సంబంధించినవి ?
ఎ. గనుల తవ్వకం, విద్యుత్ రంగం
బి. పెట్రోలియం, రసాయనిక పరిశ్రమలు
సి. రబ్బరు, ప్లాస్టిక్
డి. సిమెంట్, గాజు పరిశ్రమ

51. వైజాక్ చెన్నయి ఇండస్ట్రియల్ కారిడార్ విస్తీర్ణం ?
ఎ. 1000 చదరపు కిలోమీటర్లు
బి. 2,10,100 చదరపు కిలోమీటర్లు
సి. 1,10,000 చదరపు కిలోమీటర్లు
డి. 15,000 చదరపు కిలోమీటర్లు

52. నెల్లూరు జిల్లా 'తడ'లో ప్రారంభించిన బూట్ల తయారీ సంస్థ ?
ఎ. అపాచి బి. ఓల్గాస్ లిమిటెడ్
సి. అగర్వాల్ ఇండస్ట్రీస్ డి. బ్రాండిక్స్

53. అగ్రి ఎక్స్‌పోర్ట్ జోన్‌ను ఏ జిల్లాలో ఏర్పాటు చేశారు ?
ఎ. నెల్లూరు బి. ప్రకాశం
సి. చిత్తూరు డి. తూర్పుగోదావరి

54. రాష్ట్రంలోని అన్ని మండలాలలో ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధాలు దీనిద్వారా ఏర్పడతాయి ?
ఎ. ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్
బి. సెక్రటేరియట్ నాలెడ్జ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్
సి. ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్
డి. ఆంధ్రప్రదేశ్ స్టేట్‌వైడ్ ఏరియా నెట్‌వర్క్ (ఎపిఎస్‌డబ్ల్యూఎఎన్)

55. 2012-13లో ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి ప్రభుత్వరంగ సంస్థల్లోని మొదటి ఐదు సంస్థల్లో (టాప్-5) మూలధన పెట్టుబడి శాతం ?
ఎ. 64.54 శాతం బి. 75.54 శాతం
సి. 85.74 శాతం డి. 44.54 శాతం

సమాధానాలు : 1.సి, 2.సి, 3.సి, 4.ఎ, 5.ఎ, 6.బి, 7.బి, 8.డి, 9.సి, 10.డి, 11.సి, 12.డి, 13.సి, 14.సి, 15.ఎ, 16.డి, 17.సి, 18.బి, 19.ఎ, 20.బి, 21.సి, 22.ఎ, 23.బి, 24.ఎ, 25.సి, 26.బి, 27.బి, 28.సి, 29.డి, 30.బి, 31.ఎ, 32.డి, 33.ఎ, 34.డి, 35.సి, 36.బి, 37.ఎ, 38.బి, 39.ఎ, 40.ఎ, 41.బి, 42.ఎ, 43.బి, 44.సి, 45.బి, 46.బి, 47.ఎ, 48.ఎ, 49.ఎ, 50.ఎ, 51.సి, 52.ఎ, 53.సి, 54.ఎ, 55.బి.

★

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భూసంస్కరణలు - మధ్యవర్తుల తొలగింపు చట్టాలు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూసంస్కరణలు రెండు దశలలో జరిగాయని పేర్కొనవచ్చు. మొదటి దశలో 1947–70 మధ్యకాలంలోనూ, రెండో దశలో 1970 తర్వాత భూసంస్కరణలు అమలయ్యాయి.

మొదటిదశలో భూసంస్కరణలు రావడానికి అనేక కారణాలు దోహదపడ్డాయి. ప్రధానంగా ఆనాడు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అమలులో ఉన్న భూస్వామ్య విధానాల వల్ల ఇవి అమలులోకి వచ్చాయి. జమీందారీ, ఇనాందారీ, రైత్వారీ విధానాలు వంటి వాటివల్ల వ్యవసాయం సాగు ఉత్సాహవంతంగా ఉండేది కాదు. ఈ విధానాలవల్ల రైతాంగంలో వ్యతిరేకత వ్యక్తమయ్యింది. అంతేగాక ఈ కాలంలో రైతాంగ ఉద్యమాలు భూసంస్కరణలు రావడానికి దోహదపడ్డాయి. నిజాం ప్రాంతంలో దేశ్‌ముఖ్‌లకు, దేశాయ్‌లకు వ్యతిరేకంగా ముస్లిం రైతు ఉద్యమం 1920లో ప్రారంభమయ్యి రైతు సంఘం ఏర్పాటయ్యింది. ఆచార్య ఎన్.జి.రంగా నేతృత్వంలో 1928 సంవత్సరంలో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఏర్పాటయ్యింది. 1936 సంవత్సరంలో అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటయ్యింది. బ్రిటిష్ పాలనలో ప్రభుత్వ పన్నులకు వ్యతిరేకంగా చీరాల పేరాల ఉద్యమం, పెదనందిపాడు, పల్నాడు అటవీ సత్యాగ్రహం వంటి ఉద్యమాలు రాజకీయంగా దోహదపడ్డాయి.

భూస్వాములు రాజకీయ అధికారాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడం ద్వారా గ్రామాల్లో ఆధిపత్యాన్ని సంపాదించారు. గ్రామాల్లో భూమిపై ఆధిపత్యంతో పాటు రాజకీయ అధికారం వారి పలుకుబడికి కారణమయ్యాయి. 1931లో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో జమీందారీ వ్యవస్థ రద్దుకు తీర్మానం చేశారు. అంతేగాక 1936 సంవత్సరంలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో జమీందారీ వ్యవస్థ రద్దుకు ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ పథకం రూపొందించారు. 1947 సంవత్సరంలో జమీందారీ వ్యవస్థ రద్దు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. 1948 సంవత్సరంలో జె.సి.కుమారప్ప నేతృత్వంలో వ్యవసాయ సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు.

మొదటి దశలో మూడు రకాల భూసంస్కరణలు అమలు చేశారు.
1. మధ్యవర్తుల తొలగింపు చట్టాలు
2. కౌలు సంస్కరణ చట్టాలు
3. కమతాల గరిష్ట పరిమితి నిర్ణయ చట్టాలు

మధ్యవర్తుల తొలగింపు

దేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో మొదట రాజ్యానికి, రైతుకు మధ్య అంచెలంచెలుగా ఏర్పడిన దళారీల వ్యవస్థ తొలగింపునకు భూసంస్కరణలు అధిక ప్రాముఖ్యతను ఇచ్చాయి. ఈ దళారీలు ఉత్పత్తికి ఏమాత్రం దోహదపడకుండా వాస్తవంగా సాగుచేసేవారిని అనేక రకాలుగా వేధిస్తూ పంటలో గణనీయమైన వాటాను అనుభవిస్తూ పరాన్నభుక్కులుగా జీవించేవారు. ప్రధానంగా వీరిని తొలగించడానికి ఆంధ్రప్రదేశ్‌లో మధ్యవర్తుల తొలగింపు చట్టాలు రెండుసార్లు అమలుచేశారు.

ఎ. ఆంధ్రాలో జమీందారీ రద్దు చట్టం (1948)

ఆంధ్రరాష్ట్రం 1948 సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కాకపోవడంచేత ఆంధ్రప్రాంతంలో జమీందారీ విధానాన్ని రద్దు చేస్తూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రం జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందినదిగా పరిగణించారు. అంతేగాకుండా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన మొట్టమొదటి భూసంస్కరణల చట్టం ఇదే.

ఈ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి జమీందారీ ఎస్టేట్స్ పూర్తిగా రద్దయ్యాయి. జమీందారీ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా గత సంవత్సరాలలో వచ్చిన వార్షిక ఆదాయం ఆధారంగా సగటు వార్షిక ఆదాయంపై 25 రెట్ల వరకూ పరిహారం చెల్లించాయి.

బి. తెలంగాణ ప్రాంతంలో జాగిర్‌దార్ల రద్దు చట్టం (1949)

హైదరాబాద్‌లో ఉన్న భూస్వాములవల్ల రైతాంగం, కౌలుదార్లలో కలిగిన అశాంతిని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలను, సూచనలను ఇవ్వడానికి జనరల్ చౌదరి హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆ ప్రతిపాదించిన జాగీర్దార్ల రద్దు చట్టం–1949 కారణంగా తెలంగాణా ప్రాంతంలో 6,535 జాగీర్లు రద్దు చేశారు. 1949 అక్టోబరు నుంచి 1950 మార్చి వరకూ జాగీర్దార్లకు తాత్కాలిక అలవెన్సులు ఇచ్చారు. 1950 ఏప్రిల్ నుంచి హైదరాబాద్ జాగీర్ రెగ్యులేషన్‌లోని ఫార్ములా ప్రకారం జాగీర్దారులకు నష్టపరిహారం ఇచ్చారు.

ఈ చట్టం తెలంగాణా ప్రాంతంలో చేసిన కీలకమైన చట్టంగా గుర్తించారు. ఈ చట్టం ప్రకారం తెలంగాణా ప్రాంత లోని జాగీర్దార్లన్నింటినీ స్వాధీనం చేసుకుని వాటిని రైత్వారీ భూములుగా ప్రకటించింది. దీనిద్వారా జాగీర్దార్ల దోపిడీ నుంచి రైతులకు స్వేచ్ఛ లభించి యాజమాన్య హక్కులు లభించాయి.

సి. తెలంగాణా ప్రాంతంలో ఇనాందార్ల రద్దు చట్టం (1955)



స్వాతంత్ర్యం తరువాత ఇనాం విధానాన్ని రద్దు చేయాలని ప్రజాస్వామ్యవాదులు కోరారు. ఆనాటి హైదరాబాద్ శాసనసభలో దీనిని ప్రజాతంత్ర వాదులంతా బలపరిచారు. ఫలితంగా 1955లో తెలంగాణా ప్రాంత ఇనాం భూములు రద్దు చట్టం ఆమోదించారు. అయితే ఈ చట్టాన్ని అమలు చేయడంలో చాలా జాప్యం చోటుచేసుకుంది.

మత సంబంధమైన ట్రస్టుల ఆధీనంలో ఉన్న భూములను మినహాయించి, మిగిలిన అన్నిరకాల ఇనాం భూములను ఈ చట్టం ద్వారా రద్దుచేశారు. కౌలుదార్లకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ రక్షణ ఇచ్చేందుకు ఈ చట్టం ప్రయత్నించింది. ఇనాందార్లవద్ద, కౌలుదార్ల వద్ద భూపరిమితిని విధించడం, ఈ చట్టం యొక్క ప్రత్యేకగా పేర్కొనవచ్చు.

ఈ చట్టం అమలులో అనేక సమస్యలు ఎదురయ్యాయి. 1970, మార్చిలో హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేస్తూ ఇనాంలు రద్దు చేస్తూ కౌలుదార్లను రైతులుగా చేస్తూ ఇనాందార్లను సాధారణ రైతులుగా చేస్తూ అందరికీ రక్షణ కల్పిస్తూ తీసుకువచ్చిన ఈ చట్టం న్యాయపరమైన అంశాల కారణంగా పూర్తిగా అమలుకాలేకపోయింది. జమీందారీ వ్యవస్థ రద్దు కోసం అనేక రాయితీలు ఇవ్వడంవల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం ఎక్కువయ్యింది. జమీందార్లు న్యాయస్థానాలను ఆశ్రయించి, చట్టంలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. జమీందార్లు తమ కుటుంబ అవసరాలకు కొంత భూమిని ఉంచుకోవచ్చనే నెపంతో అధిక సంఖ్యలో కౌలుదార్లను తొలగించారు. అయితే తదనంతర కాలంలో ఈ పరిస్థితులు కౌలు సంస్కరణ చట్టాల్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అంతేకాకుండా తదనంతర కాలంలో వచ్చిన భూగరిష్ట పరిమితి చట్టానికి ఈ చట్టం మార్గదర్శకం అయ్యింది.

డి. ఆంధ్రప్రాంతంలో ఇనాందారీ రద్దు చట్టం 1956

ఇనాందార్ల హక్కులను తగ్గిస్తూ, కౌలుదార్లకు రక్షణ కల్పిస్తూ ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం ఇనాం భూముల నిర్ధారణకు సదరు ఇనాం భూమి ఏదైనా సంస్థకు చెందినదా, లేక వ్యక్తికి సంబంధించినదా అని నిర్ణారించుకుని తహశీల్దార్‌ను నియమించారు. ఇనాం భూముల పరిధిలోని నిరుపయోగ భూములు, అడవులు, గనులు, పంటకాలువలు, చెరువులు వంటివన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో అప్పటి వరకూ వాటిపై ఉన్న ఇనాందార్ల హక్కులు రద్దయ్యాయి. కౌలు దారుడి స్వాధీనంలో ఏదైనా ఇనాం భూమి ఉన్నట్లయితే భూమిలో 2/3 వంతుకు కౌలుదారుడికి పట్టా జారీచేశారు. మిగిలిన 1/3 వంతు భూమికి ఇనాందారుడికి రైత్వారీ పట్టాలు మంజూరుచేశారు. అనగా సంబంధిత భూమిపై 2 : 1 నిష్పత్తిలో కౌలుదారునికి, ఇనాందారునికి హక్కులు కల్పించారు. కౌలురుడికి భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించారు. ఈ చట్టాన్ని అనుసరించి వ్యక్తిగత, సంస్థలకు చెందిన ఇనాములు రద్దయ్యాయి. ఆ ఇనాం భూములకు సంబంధించి సదరు వ్యక్తికి లేక సంస్థకు రైత్వారీ పట్టాలు అందజేశారు. ఈ చట్టాన్ని అనుసరించి, రైత్వారీ పట్టా పొందిన ఇనాందారుడు, సంస్థ, రైతులు కూడా ప్రభుత్వానికి భూమిశిస్తును చెల్లించాలి.

★

ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్- బెంగళూరులో ఏడు పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో ఏడు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.
పోస్టు పేరు : ఇన్‌స్ట్రక్టర్
విభాగాలు : బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మెటీరియల్స్
మొత్తం ఖాళీలు : ఏడు (జనరల్–2, ఓబీసీ–3, ఎస్సీ–1, ఎస్టీ–1).
వేతనం : రూ.52,000–రూ.77,000.
అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ, రెండేళ్ల ఉద్యోగానుభవం.
వయోపరిమితి : 2017 ఆగస్టు 11 నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ వికలాంగుల కేటగిరీలో అభ్యర్థులకు నిబంధనల మేర వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
ఎంపిక విధానం : సీవీ, ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం : నిర్దేశిత విధానంలో దరఖాస్తు పత్రాన్ని నింపి, దానికి తాజా సీవీ జతచేసి recruitment @admin.iisc.ernet.in , ugpr@ug.iisc.in మెయిల్ ఐడీలకు గడువులోగా పంపాలి.
దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : ఆగస్టు 11, 2017.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.iisc.ac.in

మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌లో 20 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీలు


తమిళనాడులోని చెన్నయిలో ఉన్న మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎంఎఫ్ఎల్)లో 20 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.
పోస్టు పేరు : ట్రేడ్ అప్రెంటీస్
విభాగాల వారీ ఖాళీలు : ఫిట్టర్–6, టర్నర్–1, వెల్డర్–1, ఎలక్ట్రీషియన్–4, మెకానిక్ (ఇన్‌స్ట్రుమెంట్–4/ రిఫ్రిజిరేటర్, ఏసీ–1/ మోటార్ వెహికల్–1/ డీజిల్–1/ డ్రాట్స్‌మ్యాన్–1)–8.
శిక్షణ వ్యవధి : డీజిల్ మెకానిక్‌కు రెండేళ్లు, మిగిలిన ట్రేడ్‌లకు ఏడాది.
స్టైపెండ్ : డీజిల్ మెకానిక్ ట్రేడ్‌కు మొదటి ఏడాది రూ.7,666, రెండో ఏడాది రూ.8,630, మిగిలిన పోస్టులకు రూ.8,630.
అర్హతలు : సంబంధిత ట్రేడ్ విభాగాలను అనుసరించి ఐటీఐ. అలాగే ncvtmis.gov.in లేదా apprentice ship.gov.in ద్వారా అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని ఉండాలి.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తులకు చివరి తేదీ : ఆగస్ట్ 9, 2017.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.madrasfert.nic.in

'వంశధార' గ్రామాల్లో నిర్బంధం

- భారీగా పోలీసు బలగాల మోహరింపు
- భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

వంశధార ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామాల నుంచి నిర్వాసితులను బలవంతంగా వెళ్లగొట్టడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో అసాధారణ పరిస్థితుల్లో విధించాల్సిన సెక్షన్-30, 144 సెక్షన్‌ను ఆదివారం నుంచి అమల్లోకి తెచ్చింది. శాంతిభద్రతల పరిరక్షణ పేరిట విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి రెండు వేల మంది ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు, 20 మంది డిఎస్‌పిలు, 140 మంది సిఐలు, ఎస్‌ఐలను నిర్వాసిత గ్రామాల్లో మోహరింపజేసి నిర్బంధం ప్రయోగిస్తోంది. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని భయానక వాతావరణం నిర్వాసిత గ్రామాల్లో నెలకొంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలోని పాడలి, దుగ్గుపురం, తులగాం, గార్లపాడు తదితర నిర్వాసిత గ్రామాల కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ఆరా తీసి అనుమానాలు నివృత్తి చేసుకున్న తర్వాతే గ్రామాల్లోకి వెళ్లడానికి ఆయా గ్రామస్తులను అనుమతిస్తున్నారు. పాలకొండ ఇన్‌ఛార్జి డిఎస్‌పి వి.సుబ్రమణ్యం తన సిబ్బందితో పర్యటిస్తూ, జిల్లా ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. నిర్వాసితులు ఆందోళన ఉధృతం చేస్తే, ఎలా అణచివేయాలో పోలీసులకు డిఎస్‌పి సూచించినట్లు సమాచారం. 108 వాహనాలతో పాటు, అగ్నిమాపక వాహనాలు, ఇతర వాహనాలను సిద్ధం చేసుకున్నారు. తామేం తప్పు చేశామని, తమ గ్రామాల్లో ఇంతమంది పోలీసులను మోహరించారని తులగాం గ్రామ నిర్వాసిత మహిళలు ప్రశ్నించగా, పోలీసులు సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు.



శ్రీకాకుళం జిల్లా వంశధార నిర్వాసిత గ్రామాల్లోని పరిస్థితిని ఎస్‌పికి వివరిస్తున్న డిఎస్‌పి

సిపిఎం ఖండన

వంశధార నిర్వాసితులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. పునరావాసం కల్పించాలని కోరినందుకు హిరమండలం, కొత్తూరు మండలాల్లో సెక్షన్-30, 144 సెక్షన్ విధించడాన్ని, నిర్వాసిత గ్రామాల్లో పోలీసు బలగాలను దించి, నిర్వాసితులను భయందోళనలకు గురి చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకుండా, చట్టపరమైన బాధ్యతలను ప్రభుత్వం నిర్వర్తించకుండా నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయాలనడం, పౌరసరఫరాలను, పింఛన్లను నిలిపివేయడం నిర్వాసితులపై యుద్ధం ప్రకటించడమేనని తెలిపారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, నిషేధపు ఆజ్ఞలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు : ఎస్‌పి

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి త్రివిక్రమవర్మ హెచ్చరించారు. నిర్వాసిత గ్రామాల రహదారులను ఆదివారం ఆయన పరిశీలించారు. గతంలో చేపట్టిన ఆందోళనల్లో నిర్వాసితులు విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. నిర్వాసిత సంఘం నాయకులతో సోమవారం తాను సమావేశమవుతానని, నిర్వాసితుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిర్వాసితులు సహకరించాలని కోరారు.



పోలీసులను ప్రశ్నిస్తున్న తులగాం గ్రామ మహిళలు

పోరాటం ఫలితంగానే రెగ్యులరైజ్

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - పాడేరు రూరల్ (విశాఖ)

సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు చేసిన పోరాటం ఫలితంగానే మన్యంలోని ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో పని చేస్తున్న 53 మంది కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రామారావు అధ్యక్షతన జరిగిన విజయోత్సవ సభలో నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశాఖ మన్యంలో వివిధ శాఖల్లో సుమారు 30 వేల మందికి పైగా కార్మికులు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చినా ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయకుండా అరకొర వేతనాలతో కార్మికుల శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. తక్షణమే మిగిలిన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

అణువిద్యుత్ కేంద్ర నిర్మాణం ఆగదు

మంత్రి కళా వెంకట్రావు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్ (విశాఖ)

శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు స్పష్టం చేశారు. విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం బ్లాక్-3 నూతన భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు. నిర్వాసితులు సంతోషంగా ఉండాలని 6,000 గృహాలను నిర్మించనున్నామని తెలిపారు. ఈ పని ఎల్ అండ్ టి కంపెనీకి అప్పగించనున్నామన్నారు. ఈ అణువిద్యుత్ కేంద్రాన్ని కొవ్వాడ ప్రాంత ప్రజలు వ్యతిరేకించి ఉద్యమిస్తున్నా ఎందుకు నిర్మిస్తున్నారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇది కేంద్రం పరిధిలోని అంశమని, రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేదని సమాధానమిచ్చారు. ప్రమాదం సంభవించి పర్యావరణం నాశనమవతుందని ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించగా మన దేశం అభివృద్ధి చెందాల్సి ఉందని, అందుకు అణువిద్యుత్ కేంద్రం తప్పనిసరని పేర్కొన్నారు. భవిష్యత్తులో సంభవించే ప్రమాదాలను ఎదుర్కొనే సామర్థ్యం ఉందా, ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటి అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా ముగించేశారు.

కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా ర్యాలీ

అడ్డుకున్న పోలీసులు - ఎనిమిది మంది అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

'కొవ్వాడలో అణు పార్కు పెట్టొద్దు - ఉత్తరాంధ్రను శ్మశానం చేయొద్దు' అని కోరుతూ కొవ్వాడ అణుపార్కు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో నిరసన ర్యాలీ జరిగింది. హిరోషిమా డే సందర్భంగా రామతీర్థం జంక్షన్ నుంచి స్టేట్ బ్యాంకు వైపు ర్యాలీగా వస్తుండగా జె.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ తన సిబ్బందితో అడ్డుకున్నారు. డి.గోవిందరావు, తేజేశ్వరరావు, వెంకటరమణ, బాలి శ్రీనివాసరావు, ఎస్.సీతారామరాజు సహా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రను మరో హిరోషిమాగా మార్చొద్దని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికాకు తలొగ్గి కొవ్వాడలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు పూనుకోవడం ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనని విమర్శించారు. ఎటువంటి అనుమతులూ లేకుండా భూసేకరణ చేయడం చట్టాలను ఉల్లంఘించడమేనని తెలిపారు.

యుగ కవి వేమన

వేమన సాహితీ సమాలోచన సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

వేమన ఒక యుగకర్త అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన సమాజంలో అనమానతలను, దుర్మార్గ దురాచారాలను తన పద్యాల ద్వారా ఎండగట్టిన ప్రజా కవి అని కీర్తించారు. నెల్లూరులోని జెఎస్ విజ్ఞాన కేంద్రంలో సాహితీ ప్రవంతి ఆధ్వర్యాన 'వేమన సాహితీ సమాలోచన సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు ప్రముఖ సాహితీ విమర్శకులు డా.మేడిపల్లి రవికుమార్ డా.కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డా.కాళి దాసు పురుషోత్తం విచ్చేశారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రవంతి అధ్యక్షులు డా. ఈదూరు సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా.మేడిపల్లి మాట్లాడుతూ నతకవులు, భక్త కవులు, భుక్త కవులు ఎందరో ఉన్నా ప్రజా కవులు కొందరే ఉంటారని తెలుగు సాహిత్యంలో 'ప్రజాకవి' అన్న పేరు పొందే అర్హతకు ఆద్యుడు వేమన అని అన్నారు. ఎంఎల్‌సి విఠపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాజిక సాహితీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల కమిషన్ అనుమతితో పుష్పరాజ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర ఎన్నికల సంఘం అనుమతితో రాష్ట్ర ఆహార కమిషన్ కార్యవర్గం బాధ్యతలను పుష్పరాజ్ చేపట్టనున్నారు. స్వీకరణ సోమవారం వెలగపూడి సచివాలయంలో జరగనుంది. కార్యవర్గంలో సభ్యురాలిగా ఉన్న కృష్ణమ్మ నంద్యాల ప్రాంతానికి చెందిన వారు కావడంతో కమిషన్ బాధ్యతల స్వీకారానికి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనివార్యం అయింది. దీంతో కార్యవర్గం బాధ్యతల స్వీకరణ పెండింగ్‌లో పడింది. నంద్యాలలో ఉప ఎన్నిక జరుగుతుండటంతో ఈ కార్యవర్గం బాధ్యతలు స్వీకరించరాదని ఆమె ఈ నియోజకవర్గంలో పర్యటించరాదని రాష్ట్ర ఎన్నికల అధికారులు నిర్దేశించారు. దీనిపై కమిషన్ ఛైర్మన్ జెఆర్ పుష్పరాజ్ రాష్ట్ర ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను సంప్రదించారు. తాము ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించామని, అక్కడ నుంచి అనుమతి రాగానే తెలియజేస్తామని భన్వర్‌లాల్ చెప్పినట్లు పుష్పరాజ్ తెలిపారు. రెండు రోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చింది. అయితే కృష్ణమ్మ నంద్యాలలో పర్యటించకూడదనే ఆంక్షలు విధించారు. దీంతో ఎన్నికలు పూర్తయ్యే వరకూ గుంటూరులోనే ఉండాలని టిడిపి నేతలు ఆమెకు సూచించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. తొమ్మిది
2. 13వ
3. 180 రోజులు
4. మో ఫరా
5. దర్శన్‌లాల్

అక్రమ కేసులతో ఉద్యమాలను అణచలేరు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

దళితుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దుర్మార్గమని, అక్రమ కేసులతో ఉద్యమాలను అణచలేరని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు స్పష్టం చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైఎస్‌ఆర్‌సిపి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అక్రమ కేసులను నిరసిస్తూ ఆదివారం దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. ప్రజారంజక పాలనను అందించాల్సిన ముఖ్యమంత్రి ప్రజాకంటక పాలనను చేస్తున్నారని, రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మారుస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. దళితులపై కొనసాగుతున్న వివక్ష, వారి సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు బనాయింపు పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల గొంతును నొక్కాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తెలుగుదేశం ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందని తెలిపారు. ప్రతిపక్షాలను కలుపుకొని రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె కుమార్‌రెడ్డి, నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం, సిపిఐ నాయకులు వెంకయ్య, పెంచులయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీదేవి, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు రాజేంద్రతోపాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తిరుపతిలో నిరసన దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న పి మధు

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించండి

ప్రభుత్వాస్పత్రి వద్ద దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ/గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడ మండలం దొండపాడులో దళితులపై దాడులకు పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు, దళిత సంఘాలతోపాటు పలువురు రాజకీయ నాయకులు విజయవాడ ప్రభుత్వాస్పత్రి వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాజధాని ప్రాంత కన్వీనర్ సిహెచ్.బాబూరావు మాట్లాడారు. దొండపాడులో ఎటువంటి అనుమతులు లేకుండా రొయ్యలు, చేపల చెరువులు తవ్వడం చట్ట విరుద్ధమని తెలిపారు. దీన్ని అడ్డుకున్న దళితులపై అధికార పార్టీ నాయకుల అండతో కత్తులు, గొడ్డళ్లు, రాళ్లతో దాడులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించి, తక్షణం గాయపడిన వారికి మెరుగైన చికిత్సను అందించాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కె.పార్థసారధి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.వనజ, పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, సిపిఐ మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడివాడలో అఖిలపక్షం ధర్నా

దొండపాడులో దళితులపై దాడి చేసిన భూస్వాములను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు అఖిలపక్షం నాయకులు తెలిపారు. సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.వనజ, దళిత సంఘాల జెఎసి రాష్ట్ర కన్వీనర్ మారుమూడి విక్టర్, వైసిపి ఎస్‌సి విభాగ జిల్లా అధ్యక్షులు నలుకుర్తి రమేష్ దాడిలో గాయపడిన వారి కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. మూడేళ్లుగా దళితులు ప్రాణ భయంతో జీవిస్తున్నారని, ఇందుకు దొండపాడు ఘటననే నిదర్శనమని అన్నారు. వనజ మాట్లాడుతూ.. దొండపాడు సంఘటన కారంచేడును తలపిస్తోందని, ఘర్షణ వాతావరణం నెలకొని ఉన్నా కనీసం పోలీసు పహారానూ ఏర్పాటు చేయకపోవడం దారుణమని అన్నారు. దళిత సంఘాల జెఎసి రాష్ట్ర కన్వీనర్ మారుమూడి విక్టర్ మాట్లాడుతూ.. సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

సుప్రీంకోర్టులో అయినా దళితులకు బాసటగా నిలవాలి

చుండూరు మృతవీరుల సంస్మరణ సభలో నాయకులు



మృతవీరుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చుండూరు(గుంటూరు)


చుండూరు దళితుల ఊచకోత ఘటనపై పోలీసులు, పాలకులు సుప్రీం కోర్టులో అయినా బాధిత దళితులకు సహకారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. చుండూరు మృతవీరుల 21వ సంస్మరణ సభ గుంటూరు జిల్లా చుండూరులోని అంబేద్కర్ నగర్‌లో ఆదివారం నిర్వహించారు. సభకు చుండూరు బాధితుల సంఘం అధ్యక్షులు జాలాది మోజెస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ఘటన జరిగి 21 ఏళ్లయినా బాధితులకు న్యాయం జరక్కపోవడం దళితుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అగ్రకుల పెత్తందార్ల ఒత్తిడి మేరకే కేసును జడ్జి జస్టిస్ నర్సింహారెడ్డి కొట్టేశారని, దీనిపై సుప్రీం కోర్టుకు అప్పీల్ చేశారని చెప్పారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఘటన వాస్తవాలను సుప్రీం కోర్టుకు అందించాలన్నారు. డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ చుండూరు ఘటన ప్రాంతంలో మృతవీరుల స్తూపం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై మద్యం షాపు యాజమాన్యం దాడి

- క్షమాపణ చెప్పాలని పిఒడబ్ల్యూ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు)/ నిడదవోలు(పశ్చిమగోదావరి)

మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలపై దురుసుగా ప్రవర్తించిన షాపు నిర్వాహకులతో క్షమాపణ చెప్పించాలని పిఒడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా బాపట్ల 24వ వార్డు ఇమ్మడిసెట్టివారిపాలెం వద్ద అపార్టుమెంటు ఎదురు సూర్యలంక రోడ్డులో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలిగించాలని ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు ఆందోళన చేశారు. ఈ ప్రాంతంతో మద్యం దుకాణం ఏర్పాటుతో కూలి పనులు చేసుకొని జీవించే కుటుంబ యజమానులు మద్యానికి బానిసైతే ఆ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అదీగాక సూర్యలంక పర్యాటక కేంద్రం వెళ్ళేదారిలో ఈ షాపు ఉన్నకారణంగా సముద్ర స్నానానికి వెళ్ళే యాత్రికులు మద్యం సేవించి ప్రమాదాల బారిన పడతారన్నారు. దీంతో షాపు నిర్వాహకులకు, మహిళలకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. మద్యం షాపు ప్రధాన నిర్వహకుడు గంటా రాజబాబు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడికి దిగారని మహిళా సంఘం నాయకులు తెలిపారు. వీరి మధ్య జరిగిన గొడవ తీవ్రస్థాయికి చేరడంతో ఎక్సైజ్ పోలీసులు, బాపట్లటౌన్, రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మహిళా సంఘం నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన రాజబాబును పిలిపించి సోమవారం పోలీసు స్టేషన్ వద్ద సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామ ని మహిళలకు హామీ ఇవ్వడంతో వారు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.



గుంటూరు జిల్లా బాపట్లలో మహిళలతో షాపు నిర్వాహకుల వాగ్వాదం

జూట్‌మిల్లు కథ మళ్లీ మొదటికి

పునఃప్రారంభంపై అనుమానాలు - మిల్లు నడపలేమని యాజమాన్యం నోటీసు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పట్టాభిపురంలోని భజరంగ్ జూట్‌మిల్లు కథ మళ్లీ మొదటికొచ్చింది. రెండేళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఇటీవల కార్మిక శాఖ మంత్రి సమక్షంలో జరిగిన జాయింట్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలు ఫలించలేదు. అందుకు భిన్నంగా యాజమాన్యం వ్యవహరిస్తోంది. సరిపడా కార్మికులు లేరనే సాకుతో మిల్లును నడపలేమని, మిల్లు గేటుపై డైరెక్టర్ పేరుతో ఆదివారం హఠాత్తుగా నోటీసు వెలిసింది. దీంతో కార్మికుల్లో మళ్లీ నిరాశ అలముకుంది. 2015 జులై 5న యాజమాన్యం మిల్లుకు అక్రమ లాకౌట్ ప్రకటించిన నాటి నుంచి దశలవారీగా ఆందోళనలు జరిగాయి. 2017 జులై 17న కార్మిక శాఖ మంత్రి పితాని సత్యన్నారాయణ సమక్షంలో జరిగిన చర్చల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మిల్లు తెరిపించాలని ప్రభుత్వం యాజమాన్యాన్ని ఆదేశించింది. ఆ చర్చల్లో తీసుకున్న నిర్ణయం ప్రకారం జులై 21వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకూ కార్మికుల నమోదు కార్యక్రమం చేపట్టగా 1176 మంది వరకూ నమోదయ్యారు. అయితే యాజమాన్యం తమకు రెండు షిఫ్టులు నడపటానికి ఆ సంఖ్య సరిపోదని, కనీసం 1800 మంది కావాలని చెబుతోంది. వాస్తవంగా చర్చల్లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ముందు ఒక షిఫ్ట్ నడపాలి. తర్వాత నమ్మకం పెరిగి కార్మికులు మరింత మంది నమోదు అవుతారని మిల్లు పరిరక్షణ సమితి నాయకులు గతంలోనే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం వెలువరించిన నోటీసుతో ఆగస్టు 16 నుంచి మిల్లు పున:ప్రారంభంపై నీలినీడలు అలముకున్నాయి.

సిఎంపై జగన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నా

- తుని ఘటనకు మంత్రి యనమల కుటుంబ సభ్యులే కారణం
- కిర్లంపూడిలో ఇంటికో పోలీసును పెట్టాల్సిన అవసరం ఏముంది?
- వైసిపి నేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - కాకినాడ

నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా వైసిపి అధ్యక్షులు జగన్ సిఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నానని వైసిపి రాష్ట్ర నేత బొత్స సత్యనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని సరోవర్ హోటల్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి పుష్కరాల్లో పబ్లిసిటీ పిచ్చితో 27 మంది సామాన్యుల మృతికి కారణమైన సిఎం చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు చేయడంలో తప్పులేదన్నారు. కాపు ఉద్యమం సమయంలో జరిగిన రైలు దహన సంఘటనకు ఆర్థిక శాఖ మంత్రి యనమల కుటుంబ సభ్యులే కారణమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి కాపులను బిసిల్లో చేరుస్తామని చంద్రబాబే వాగ్దానం చేసినట్లు చెప్పారు. ఇటీవల కిర్లంపూడిలో ఇంటికో కానిస్టేబుల్‌ను పెట్టి కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రను ఆపాల్సిన అవసరం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం హయాంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని విమర్శించారు. పలు ప్రాజెక్టుల్లో తెదేపా నేతలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు ఆలస్యం కావడానికి ప్రభుత్వమే ప్రధాన కారణమన్నారు. నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరడం ఖాయమన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలను ఆపేందుకు స్థానిక టిడిపి నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ముత్తా శశిధర్, మాజీ కార్పొరేటర్లు పట్టాభి రామయ్య (బాబు), కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాచరికం నుంచి జగన్ బయటికి రాలేదు

మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి- నంద్యాల

వైఎస్. జగన్మోహన్ రెడ్డి రాచరిక వ్యవస్థ నుంచి బయటికి రాలేదని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్, పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియ, టిడిపి అధికార ప్రతినిధి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని నంద్యాలలోని 42వ వార్డులోని తెలుగుతోట, పెద్దబండ ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం మీడియాతో నక్కా ఆనంద్‌బాబు మాట్లాడారు. రాజు చనిపోతే రాజకుమారుడు రాజు అయినట్లుగా జగన్మోహన్‌రెడ్డి కూడా తన తండ్రి మరణానంతరం సిఎం కావాలని అనుకుంటున్నారన్నారు. అధికార దాహంతో జగన్ తీవ్ర పరుష పదాలు వాడుతున్నారన్నారు. గతంలో ఎన్‌టి రామారావు, వైఎస్‌ఆర్, చంద్రబాబు ప్రతిపక్ష నేతలుగా ఉండి ఆ స్థానానికి వన్నె తెచ్చారని చెప్పారు.

మాట ఇచ్చి తప్పారు

తమిళ సినిమా నిర్మాతల మండలి తీరుపై కార్మికుల ఆగ్రహం



చెన్నై : తమిళ సినిమా నిర్మాతల మండలి తీరుపై సినీరంగ కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్చలు ద్వారా సమస్య పరిష్కరించుకుందామని మాట ఇచ్చి తప్పారని కార్మికులు అన్నారు. నిర్మాతలు హామీ ఇవ్వడంతోనే సమ్మెను నిలిపివేశామని, తీరా సమ్మె విరమించాక నిర్మాతల మండలి తప్పించుకుంటున్నదనివారు వాపోయారు. ఇటు కూలీ పోయి, అటు పని పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నామని చెప్పారు. రోజు కూలీ పెంపునకే డిమాండ్‌తో కార్మికులు జీవిక సమ్మె చేపట్టారు. అయితే రజనీకాంత్, పలువురు సీనియర్లు వివాదాలు పక్కనబెట్టి సమస్య పరిష్కరించుకోవాలని సూచించడంతో చర్చలకు ఎఫ్ఇఎఫ్ఎస్ఐ అంగీకరించింది. గురువారం సమ్మెను కూడా కార్మికులు నిలిపేశారు. అయితే శుక్రవారం చర్చలకు గంట ముందు "తమను మాత్రమే పిలవాలి, ఎఫ్ఇఎఫ్ఎస్ఐని పిలవకూడదనే డిమాండ్ చేసింది. ఈ సమ్మెకు మేం కారణం కాదు. మా షరతులకు అంగీకరించే వారితోనే 'మేం పనిచేస్తాం'" అని నిర్మాతల మండలి ప్రకటించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మిక సంఘం అధ్యక్షుడు ఆర్కె సెల్వమణి "మేం అటువంటి నిబంధనేమీ పెట్టలేదు. అలా పెట్టే హక్కు ఎవరికీ లేదు" అని వివరణ ఇచ్చారు. కానీ చర్చలు జరగకపోవడంతో సమస్య ఎటూతేలకుండానే ఉండిపోయింది. దీనిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. పన్నెండు గంటలు పనిచేస్తే భోజనానికి సరిపడా డబ్బులు కూడా చేతికి రావట్లేదని వారు వాపోయారు.

అమెరికా అధికారుల అతి ప్రవర్తన

సీటు బెల్టులు సక్రమంగా లేవని ఆరోపణ


ఎయిరిండియా విమానం నిలిపివేత

8 గంటల అనంతరం అనుమతించిన వైనం

న్యూయార్క్ : నిబంధనల ప్రకారం కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోకపోతే పోలీసులు ఫైన్ విధించడం తెలిసిన సంగతే. అయితే అమెరికాలో ఎయిరిండియా విమానానికి, అధికారులకూ వింత పరిస్థితి ఎదురైంది. అమెరికాలోని చికాగోలో టేకాఫ్ సమయంలో అధికారులు బోయింగ్ విమానం 777ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీటు బెల్ట్ ట్యాగ్ నంబర్లు సక్రమంగా లేవంటూ ఫ్లైట్‌ను టేకాఫ్ కాకుండా ఆపారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విమానంలో సీటు బెల్టులకు ఉండాల్సిన సాంకేతిక సమస్యలు తప్పుగా ఉన్నట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. ఇది భద్రతాపరమైన సమస్య కానప్పటికీ ఎఫ్ఎఎ సిబ్బంది విమానం టేకాఫ్ కావడానికి ఒప్పుకోలేదు. విమానంలో మొత్తం 342 సీట్లు ఉండగా వీటిలో 44 ప్రయాణికుల సీట్లు, 12 సిబ్బంది సీట్ల టీఎస్ఓ నంబర్లు సక్రమంగా లేవని పేర్కొన్నారు. దీంతో న్యూయార్క్‌లోని జాన్ కెన్నడీ విమానాశ్రయంలోని పార్కింగ్‌లో ఉన్న మరో విమానం నుంచి హుటాహుటిన సీటు బెల్టులు తెప్పించి ఈ విమానానికి అమర్చిన తర్వాత తిరిగి ప్రయాణానికి అనుమతించారు. దీంతో ఎనిమిది గంటలపాటు ఫ్లైట్ ఆలస్యమైంది. ఈ ఘటన నేపథ్యంలో అమెరికా అధికారులపై ఎయిరిండియా మండి పడుతోంది. సీటుబెల్టుల నంబర్లు సక్రమంగా లేనంత మాత్రాన టేకాఫ్‌కు అనుమతించకపోవడం దారుణమనీ, ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. కొత్త సీటు బెల్టులు కోసం ఆర్డర్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సెన్సార్ బోర్డులో విభేదాలు

పహ్లాజ్ నిహ్లానీ తొలగింపునకు బిజెపి సభ్యుని డిమాండ్



ముంబయి : సెన్సార్ బోర్డులో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో సిబిఎఫ్‌సి చీఫ్‌గా పహ్లాజ్ నిహ్లానీని తొలగించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి స్మృతీ ఇరానీకి బోర్డులోని బిజెపి సభ్యుడు అర్జున్ గుప్తా ఆగస్టు 3న లేఖ రాశారు. 'బాబూమోషాయి బందూక్‌బాజ్' అనే హిందీ సినిమాకు 48 చోట్ల కోతలు విధించడంతో పాటు నిర్మాత కిరణ్ శ్యామ్ ష్రాఫ్ వస్త్రాలకంరణపై బోర్డులోని ఇద్దరు సభ్యులు వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడమే ఈ విభేదాలకు కారణమని తెలుస్తోంది. సినిమాలో కొన్ని చోట్ల అసభ్య పదజాలం, శృంగార పాళ్లు ఎక్కువైన చోట కోతలు విధించినట్లు బోర్డు సభ్యులు చెప్పారు. అయితే కోతలకు అర్జున్ గుప్తా అంగీకరిస్తూనే..నిర్మాత కిరణ్ శ్యామ్‌ను కించపరిచేలా బోర్డులో ఆ ఇద్దరు సభ్యులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని చెప్పారు. ఇంతవరకూ వారిపై చర్యలు తీసుకోని నిహ్లానీని తొలగించాలని డిమాండ్ చేశారు. భారత టివి, చలనచిత్ర దర్శకుల సమాఖ్య(ఐఎఫ్‌టిడిఎ) చైర్మన్ అశోక్ పండిట్‌కు అర్జున్ గుప్తా సన్నిహితుడనీ, అందుచేతనే దీన్ని వివాదం చేస్తున్నారని, నిబంధనల ప్రకారమే కోతలు విధించామని బోర్డు సభ్యులు మరోవైపు వాదిస్తున్నారు. ఇటీవల బాబూమోషాయి బందూక్‌బాజ్ చిత్ర దర్శకుడు కుషాన్ నందికి మద్దతుగా ఐఎఫ్‌టిడిఎ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే మోడీ భజనపరునిగా పేరుపొందిన పహ్లాజ్ నిహ్లానీని తొలగిస్తారా? లేదా? అనేది తెలుసుకోవాలంటే వేచి చూడాలి. ఇటీవల అమర్త్యసేన్ రచన ఆధారంగా రూపొందించిన "ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్' డాక్యుమెంటరీ, ఎమర్జెన్సీ నేపథ్యంలో రూపొందిన 'ఇందు సర్కార్' చిత్రాల విషయంలోనూ పహ్లాజ్ నిహ్లానీ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్న సంగతి తెలిసిందే.

మనీ లాండరింగ్

షబీర్ షా సహాయకుడు వని అరెస్టు



న్యూఢిల్లీ : పదేళ్ళ నాటి మనీ లాండరింగ్ కేసులో కాశ్మీర్ వేర్పాటు వాది షబీర్ షా సహాయకుడు, హవాలా డీలర్ మహ్మద్ అస్లామ్ వనిని ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) అరెస్టు చేసింది. రాష్ట్ర పోలీసుల సహకారంతో శ్రీనగర్‌లో వనిని అరెస్టు చేశామని ఇడికి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వనిని శ్రీనగర్ నుంచి ఢిల్లీకి తీసుకెళ్ళి ఆదివారం సాయంత్రం స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పరిచి, మరి కొంత కాలం కస్టడీ విధించాలని కోరినట్లు చెప్పారు. వనీపై ఢిల్లీ కోర్టు ఇటీవల నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ కేసులో తమ ఎదుట హాజరు కావాలంటూ అంతకుముందు ఇడి సమన్లు జారీ చేసింది. కాని వనీ ఇడి ఎదుట హాజరు కాలేదు. దీంతో నాన్ బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేయాల్సి వచ్చిందని, దర్యాప్తు ముందుకు సాగేందుకు షబీర్ షాతో పాటు మరి కొందరిని వని ఎదుర్కోవలసి ఉంటుందని ఆ అధికారి పేర్కొన్నారు. షబీర్ షా ప్రస్తుతం ఇడి కస్టడీలో ఉన్నాడు. షాను కూడా జులై 26న శ్రీనగర్‌లో అరెస్టు చేశారు.

యుపిలో ఎస్ఐ నియామకాలకు సుప్రీంకోర్టు పచ్చజెండా

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో గత ఆరేళ్లుగా నిలిచిపోయిన ఎస్ఐ నియామకాల ప్రక్రియను పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు ఆదివారం పచ్చజెండా ఊపింది. నియామకాలు నిలిచిపోవడంతో అధికారుల కొరత ఏర్పడిందని, తక్షణమే నియామకాలు పూర్తి చేయాల్సిన అవసరం ఏర్పడిందని యుపి ప్రభుత్వం చేసుకున్న విన్నపానికి జస్టిస్ కురియన్ జోసెఫ్, ఆర్ భానుమతిలతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. రెండు వారాల్లోగా శిక్షణను పున:ప్రారంభించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 22కు వాయిదా వేసింది. పోలీసు శాఖలో 4010 ఎస్ఐ ఖాళీల భర్తీ ప్రక్రియ మే 19, 2011లో ప్రారంభమైంది. శిక్షణకు ఎంపికైన వారి తుది జాబితా కూడా విడుదలైంది. అయితే రాతపరీక్షలో 810 మంది వైట్నర్ వినియోగించి అవకతవకలకు పాల్పడ్డారంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. అప్పట్లో అధికారంలోవున్న బిఎస్‌పి ప్రభుత్వం దీన్ని ముందుకు తీసుకెళ్లలేదు. తరువాత వచ్చిన సమాజ్‌వాది ప్రభుత్వం కొంత ప్రయత్నించి విఫలమైంది. అయితే తుది జాబితాలోని 3533 అభ్యర్థులను నవంబరు, 2015లో శిక్షణకు పంపించింది. వారిలో చాలా మంది శిక్షణ పూర్తయిందని యుపి ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ వాదనలు విన్న ధర్మాసనం కోర్టుకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. శిక్షణ పూర్తయిన అభ్యర్థులను విధుల్లోకి తీసుకోవచ్చని తెలిపింది. నియామకాలను రద్దు చేయాలని కోరుతూ 37 పిటిషన్లు వేసిన 237 మంది అభ్యర్థులకు తిరిగి బృందచర్చలు, శరీర ధారుడ్య, వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో ఎంపికైన వారిని మిగిలినవారితో కలిపి రెండు వారాల్లోగా శిక్షణను పున:ప్రారంభించాలని చెప్పింది. అవకతవకలకు పాల్పడిన 810 మంది అర్హతపై పూర్తి నివేదికను రెండు వారాల్లోగా సమర్పించాలని కోరింది. ఆగస్టు చివరి నాటికి ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి రానున్నట్లు సీనియర్ అధికారులు పేర్కొన్నారు.

మరింత పతనం దిశలో వెస్టింగ్‌హౌస్

రెండు అణుప్లాంట్ల నిర్మాణం నుండి తొలగింపు



న్యూఢిల్లీ : కొవ్వాడ అణువిద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏరికోరి ఎంపిక చేసుకున్న వెస్టింగ్‌హౌస్ సంస్థ రోజురోజుకి పతనం దిశలో ప్రయాణం చేస్తోంది. ఇప్పటికే దివాలా ప్రకటన చేసిన ఆ సంస్థ తాజాగా మరో రెండు అణుప్లాంట్ల నిర్మాణం నుండి తప్పుకోవాల్సివచ్చింది. ప్రణాళిక ప్రకారం పనులు చేయడంలో నిర్లక్ష్యం, తీవ్ర జాప్యం వంటి కారణాలతో అమెరికాలోని దక్షిణ కరోలినాలో చేపట్టిన రెండు ప్లాంట్ల నిర్మాణ పనుల నుండి ఆ సంస్థను భాగస్వామ్య సంస్థలు పక్కనబెట్టాయి.

నిర్మాణంలో చోటుచేసుకున్న జాప్యంతో ధరలు అనూహ్యంగా పెరగడంతో దక్షిణ కరోలినాలోని విసి సమ్మర్‌ప్లాంట్ పనులను నిలిపివేశారు.ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేస్తున్నట్లు వెస్టింగ్‌హౌస్ భాగస్వామ్య సంస్థ సాంటీ కూపర్ కొద్దిరోజుల క్రితం ప్రకటించింది. దీని ప్రభావం జార్జియాలో సదరన్ కంపెనీ భాగస్వామ్యంతో ప్రారంభమైన మరో అణుప్లాంట్‌పై కూడా పడింది. వరుస ప్లాంట్ల మూతతో జపాన్‌కు చెందిన వెస్టింగ్‌హౌస్ మాతృసంస్థ తోషిబా కంపెనీ కూడా తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కుంటోంది. ఒకప్పటి ఆ సంస్థ పేరు ప్రతిష్టలు చూసి దానితో చేతులు కలిపిన భాగస్వామ్య సంస్థలు ఇప్పుడు తమ నిర్ణయం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తున్నాయి. 'అణు ప్రాజెక్టుల డిజైన్, నిర్మాణంలో వెస్టింగ్‌హౌస్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు, పేరు ప్రతిష్టలు ఉన్నాయి. దురదృష్టవశాత్తు ఆ సంస్థ తన మునుపటి సామర్థ్యాన్ని ప్రదర్శించడంలో, ప్రతిష్టను కొనసాగించడంలో విఫలమైంది' అని సాంటీ కూపర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లోనే కార్టర్ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన విశ్లేషణ ప్రకారం దక్షిణ కరోలినాలో చేపట్టిన విసి సమ్మర్ ప్లాంట్ పనులు వెస్టింగ్‌హౌస్ నిర్వాకం కారణంగా నిర్దేశించిన లక్ష్యం కన్నా ఐదు సంవత్సరాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇదే జరిగితే నిర్మాణ వ్యయం రెట్టింపుకన్నా అదనంగా పెరిగిపోతుంది. ఇది వినియోగదారులపై పెనుభారంగా మారుతుంది. 'మా వైపు నుండి జరిగిన లోపం కారణంగా నష్టదాయకంగా మారిన ప్రాజెక్టుకు నిధులు సమకూర్చాలని వినియోగదారులని అడగలేం.' అని ఆయన అన్నారు.'అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ సాయం కోసం ప్రయత్నిస్తున్నాం. మరి కొన్ని సంస్థలతోనూ సంప్రదిస్తున్నాం. నిధులు సర్దుబాటైతే పనులు తిరిగి ప్రారంభించే విషయాన్ని ఆలోచిస్తాం.' అని ఆయన చెప్పారు. సాంటీ కూపర్ మాతృసంస్థ స్కానా కార్పొరేషన్ ఛైర్మన్ కెవిన్ మార్ష్ మరింత తీవ్రంగా స్పందించారు. 'మాకు మరో మార్గం లేదు. ఇదే చివరి అవకాశం. ఆలస్యమైనా మంచి నిర్ణయం' అని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ...

అంతర్జాతీయంగా వెస్టింగ్‌హౌస్ పనితీరుపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. అణువిద్యుత్ ప్లాంట్‌తో జరిగే విధ్వంసానికి వ్యతిరేకంగా స్థానికంగా వ్యక్తమవుతున్న తీవ్ర ఆందోళనను బేఖాతరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్లాంట్ నిర్మాణ పనులను వెస్టింగ్‌హౌస్‌కే కట్టబెట్టాలని నిర్ణయించింది. ఆ సంస్థ దివాళా ప్రకటన చేసిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో ఎటువంటి మార్పు లేకపోవడం వివాదాస్పదంగా మారుతోంది. మరో వైపు ఇతర దేశాల్లో ఇప్పటికే వాడి పక్కన పడేసిన, మరికొన్ని చోట్ల తిరస్కరించిన అణురియాక్టర్లను కొవ్వాడలో ఏర్పాటు చేయడానికి వెస్టింగ్‌హౌస్ సంస్థ సిద్ధమౌతోందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కరంగా మారుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిఉంది.

గుజరాత్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



కర్నాటక: బెంగళూరులోని రిసార్టులో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం తిరిగి గుజరాత్ చేరనున్నారు. గుజరాత్ కాంగ్రెస్‌లో ఫిరాయింపులు నేపథ్యంలో కర్నాటకలో ఆ రాష్ట్ర ఇంధన వనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ వారికి ఆతిథ్యమిచ్చాడు. బెంగళూరులోని ఎగ్లేషన్ రిసార్టులో ఉన్న ఈ 44 మంది ఎమ్మెల్యేలు ఆగస్టు 8న గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలకు హాజరై ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. ఇదే నేపథ్యంలో కాంగ్రెస్ మంత్రి శివకుమార్ ఇంటిపై ఐటి దాడులు జరిగాయి. ఈ దాడిలో రూ.10 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎన్నికలకు ఒకరోజు ముందు సోమవారం ఎమ్మెల్యేలు తిరిగి గుజరాత్ వెళ్లనున్నారు. ఈ ఐటి దాడులు రాజకీయ కక్ష సాధింపు చర్యగా జరుగుతున్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సంఘ్వీ ఆరోపించారు. ప్రస్తుతం భారత్‌లో కక్ష సాధింపు రాజకీయాలు నడుస్తున్నాయనీ ప్రజాస్వామ్యయుతంగా పాలన నడవడం లేదని అన్నారు. ప్రతిపక్ష నేతల ఇళ్లపై సిబిఐ దాడులు చేస్తోందన్నారు. అయితే వ్యాసం స్కాంలో సిబిఐ ఎందుకు నిద్ర నటిస్తుందని ప్రశ్నించారు. ఇక గుజరాత్‌లో మాజీ కాంగ్రెస్ చీఫ్ విప్ బల్వంత్‌సింగ్ రాజ్‌పుట్ సహా ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్‌బై చెప్పడం, వారిలో ముగ్గురు బిజెపిలో చేరిన సంగతి తెలిసిందే.

తుపాకి కాల్పుల బాధితులకు చికిత్స నిరాకరిస్తున్న ఆసుపత్రులు

ప్రభుత్వం, పోలీసుల వివరణ కోరిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : తుపాకి కాల్పులకు గురైన బాధితులకు చికిత్స అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు నిరాకరించడంపై ఢిల్లీ కోర్టు అటు ప్రభుత్వం, ఇటు ఢిల్లీ పోలీసుల స్పందనను కోరింది. తుపాకి కాల్పులకు గురైన బాధితులకు చికిత్స అందించేందుకు ఆసుపత్రులు నిరాకరించడంతో జరిగిన జాప్యం వల్ల వారు మృతి చెందారని పేర్కొంటూ పత్రికలలో ప్రచురితమైన కథనం ఆధారంగా న్యాయవాది వరుణ్ గొసైన్ ఢిల్లీ హై కోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ఇటువంటి కేసులలో తక్షణమే చికిత్స అందించేలా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆదేశించాలని గొసైన్ తన పిటిషన్‌లో కోరారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తులు జిఎస్ సిస్తాని, చంద్రశేఖర్‌తో కూడిన ఢిల్లీ హై కోర్టు బెంచ్ కేంద్ర ప్రభుత్వం, పోలీసులు తదుపరి విచారణలోగా తమ స్పందనలు తెలియచేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది. ఇటువంటి సంఘటనలలో ప్రత్యక్ష సాక్షులకు తగిన రక్షణ కల్పిస్తూ, దర్యాప్తును వేగవంతం చేసేలా కోర్టు పోలీసులను ఆదేశించాలని న్యాయవాది తన పిల్‌లో కోరారు.

ఆర్టికల్ 35 ఎను మార్పు చేయాలి

బిజెపి డిమాండ్



న్యూఢిల్లీ : రాష్ట్రంలోని శాశ్వత నివాసులను నిర్వచించడానికి జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వాన్ని ప్రోత్సహిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 35 ఎను మార్చాలని బిజెపి సానుభూతి పరులలో కొంతమంది డిమాండ్‌చేస్తున్నారు. భారత దేశ రాజ్యాంగంలోని అధికరణ 35 ఏ ప్రకారం జమ్మూ కాశ్మీర్‌కు ప్రభుత్వానికి పర్మినెంట్ రెసిడెంట్లను నిర్వచించే అధికారం ఉంది. పర్మినెంట్ రెసిడెంట్లకు ప్రత్యేక హక్కులు, అధికారాలను ఇది కల్పిస్తోంది. ఈ ఆర్టికల్ పరాయీకరణను ప్రోత్సహించడమే కాకుండా ప్రత్యేక గుర్తింపు భావనను బలపరుస్తోందని, జమ్మూ కాశ్మీర్‌కు, మిగతా దేశానికి మధ్య రాజకీయ అంతరాన్ని కూడా పెంచుతుందని బిజెపి విమర్శిస్తోంది. ఈ ఆర్టికల్ నేపథ్యంలో రాష్ట్ర చట్టాలు రాష్ట్రంలో నాన్ రెసిడెంట్లు భూమిని కొనుగోలు చేయడంపై నిషేధాన్ని విధిస్తున్నాయి. చారు వాలీఖాన్ అనే మహిళ ఇటీవల సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఒక పిటిషన్ నేపథ్యంలో ఆర్టికల్ 35ఎ అంశం వెలుగులోకి వచ్చింది. ఆర్టికల్ 35ఎలో మార్పులు చేయాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. తాను జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం వెలుపల నివసిస్తున్నప్పటికీ వారసత్వపు హక్కులు కావాలని ఆమె పేర్కొన్నారు. చారువాలీ ఖాన్ పిటిషన్‌పై స్పందిస్తూ సుప్రీం కోర్టు గత నెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు పంపింది. కాగా దీనిపై కె. వేణు గోపాల్ స్పందిస్తూ ఆర్టికల్ 35 ఎ విస్తృత చర్చకు దారితీసే సున్నితమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని న్యాయమూర్తులు జెఎస్ ఖేహార్, డివై చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్‌కు విన్నవించారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని ముగ్గురు సభ్యులున్న ధర్మాసనం పరిశీలనకు పంపింది. దీనిపై తుది నిర్ణయం ప్రకటించేందుకు ఆరు వారాలు గడువు విధించడంతో సెప్టెంబరు తొలి వారంలో ధర్మాసనం తన తీర్పును వెలువరించే అవకాశముంది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిపై స్పందిస్తూ ప్రతి ఒక్కరూ తీర్పుకోసం వేచి చూడాలని, ఆ తీర్పుకు అందరం కట్టుబడి ఉండాలన్నారు. జమ్మూ కాశ్మీర్ బిజెపి నేతలు మాత్రం ఆర్టికల్ 35ఎను తొలగించాలన్న తమ వాదనను బలంగా వినిపిస్తున్నారు. ఆర్టికల్ 35 ఎ రాజ్యాంగ తప్పిదమని, రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దీనిని రాజ్యాంగంలో చేర్చారే కాని, పార్లమెంట్ ప్రక్రియ ద్వారా కాదని జమ్మూ కాశ్మీర్‌కు చెందిన బిజెపి ఎమ్మెల్సీ సురేందర్ అంబరదర్‌పేర్కొన్నారు.

'ఎఐజెఎస్' ను వ్యతిరేకించిన తొమ్మిది హైకోర్టులు

రెండు హైకోర్టుల మద్దతు

న్యూఢిల్లీ: దిగువ న్యాయవ్యవస్థలో నియామకాల కోసం సిబిఎస్ఇ, నీట్ తరహాలో 'అఖిల భారత న్యాయవ్యవస్థ సర్వీసు(ఎఐజెఎస్)'ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను తొమ్మిది హైకోర్టులు వ్యతిరేకించాయి. కేవలం రెండు హైకోర్టులు మాత్రమే మద్దతు తెలపడం విశేషం. ప్రతిపాదిత నియమావళిలో కొన్ని నిబంధనలను మార్పు చేయాలని ఎనిమిది హైకోర్టులు కోరినట్లు కేంద్ర న్యాయశాఖ ఆదివారం ప్రకటించింది. దీనికి సంబంధించిన పత్రాలను 'లా అండ్ జస్టిస్'పై నియమించిన పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సభ్యులకు పంపించింది. "దేశంలోని 24 హైకోర్టులో దాదాపుగా అన్ని కోర్టులు దిగువ న్యాయస్థానాల నిర్వహణపై అధికారాన్ని ఉంచుకోవాలని భావిస్తున్నాయి" అని ఆ పత్రాల్లో న్యాయశాఖ పేర్కొంది. తొలిసారిగా 1960లో ఎఐజెఎస్‌ను అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. మళ్లీ ఇన్నాళ్లకు ఇది తెరపైకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, బాంబే, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పాట్నా, పంజాబ్, హర్యానా హైకోర్టులు ఎఐజెఎస్‌ను వ్యతిరేకించగా.. సిక్కిం, త్రిపుర హైకోర్టులు మద్దతు తెలిపాయి. అలహాబాద్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, ఉత్తరాఖండ్ హైకోర్టులు మార్పులను సూచించాయి. ఎఐజెఎస్ ఏర్పాటు ప్రతిపాదనను ఇంకా పరిగణలోకి తీసుకోలేదని రాజస్థాన్, జార్ఖండ్ హైకోర్టులు కేంద్రానికి తెలపగా..కలకత్తా, జమ్మూకాశ్మీర్, గౌహతి హైకోర్టులు ఇంత వరకు స్పందించలేదని ఆ పత్రాల్లో న్యాయశాఖ వివరించింది.

దిగువ స్థాయి కోర్టుల్లో 4452 న్యాయమూర్తుల పోస్టుల ఖాళీ

దిగువ స్థాయి కోర్టుల్లో 4,452 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు డిసెంబరు 31, 2015న న్యాయశాఖ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అయితే వాటిని భర్తీ చేయడానికి సిబిఎస్ఇ, నీట్ లేదా యుపిఎస్సీ తరహాలో కేంద్రీకృత పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుందని గతంలో సుప్రీంకోర్టుకి కేంద్రం తెలిపింది. అవసరమైతే ఆ సంస్థలే పరీక్షలు నిర్వహిస్తాయని పేర్కొంది. అవన్నీ సుప్రీంకోర్టు మార్గదర్శకంలో పనిచేస్తాయని స్పష్టం చేయడంతో పాటు నియామకాల ప్రక్రియ వేగవంతం చేయడానికి ఇదే సరైన మార్గమని వివరించింది. న్యాయశాఖ కార్యదర్శి అయితే ఐబిపిఎస్ తరహా పరీక్షను సూచించింది. ప్రస్తుతం రాష్ట్ర సర్వీసు కమిషన్లు, హైకోర్టులు న్యాయ అధికారుల నియామకాలు చేపడుతున్న సంగతి తెలిసిందే.

మహారాష్ట్ర మంత్రి రాజీనామాకు ఒత్తిడి

- మా జీవితాలు నాశనం చేస్తున్నారు :విద్యార్థులు
- ఆన్‌లైన్ పద్ధతి రద్దుకు డిమాండ్

ముంబయి : మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ తవడే రాజీనామాకు ముంబయి వర్శిటీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు ముగిసి 111 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఫలితాలు విడుదల చేయకపోవడంతో వర్శిటీ ఉపకులపతి డా.సంజయ్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వర్శిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ మహారాష్ట్ర ప్రభుత్వం వారి ఆందోళనను పట్టించుకోవట్లేదు. తమ పదవులు, ఉద్యోగాలు కాపాడుకుంటున్నారే తప్ప విద్యార్థుల భవిష్యత్తు గురించి విద్యా శాఖ మంత్రి, ఉపకులపతులు ఆలోచించట్లేదని విద్యార్థులు విమర్శిస్తున్నారు. గవర్నర్ ఈ వివాదాన్ని సుమోటాగా స్వీకరించి విచారణ జరిపిన ట్టైతే పరిస్థితి ఇంతలా దిగజారేది కాదని విద్యార్థులు అంటున్నారు. ఏప్రిల్ 24న పరీక్షలు ముగిశాయని, నిబంధనల ప్రకారం 45 రోజుల్లో ఫలితాలు వెల్లడించాల్సి ఉందని, కానీ 111 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఫలితాలు ఎప్పుడు విడుదలౌతాయో వర్శిటీ అధికారులు వెల్లడించలేదని పేర్కొన్నారు.

ఒక ఏడాది వృథా అవుతుంది

అమెరికా, దుబాయ్‌ల్లో వర్శిటీ నిర్మాణ కార్యకలాపాల్లో బిజీగా గడుపుతున్న సంజయ్ దేశ్‌ముక్ ముంబయి వర్శిటీ బాధ్యతలను గాలికొదిలేశారు. సొంత లాభం కోసం పనిచేస్తున్న ఆయన విద్యార్థుల భవిష్యత్తు గురించి పట్టించుకోవట్లేదు. ఇప్పటికీ ఫలితాలు విడుదల కాకపోతే విద్యార్థులు సర్టిఫికేట్లు పొందేది ఎప్పుడు? పై తరగతుల్లో చేరేది ఎప్పుడు? విదేశాల్లో పైచదువుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి పరిస్థితి ఏంటి? అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్ విధానం వల్లనే ఇదంతా!

ఈ ఆలస్యానికి ఆన్‌లైన్‌లో పరీక్షా పత్రాలు దిద్దడమే కారణమని విద్యార్థులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మంత్రి చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప తగు చర్యలు తీసుకోవట్లేదని, ఈ ఆలస్యానికి బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అత్యంత కాలుష్య ప్రాంతంగా ఉత్తర భారతం

34రెట్లు పెరిగిన వాతావరణ కాలుష్యం

న్యూఢిల్లీ : ప్రపంచంలో అత్యంత కాలుష్య ప్రాంతంగా ఉత్తర భారతం రికార్డులకెక్కింది. అయితే ఈ కాలుష్యానికి కారణం ఏమిటన్న విషయం పలువురిని తికమకపెడుతోంది. సాధారణంగా రైతులు తమ పంట కోతల అనంతరం మిగిలిన మోళ్లను పొలంలోనే దగ్ధం చేస్తుంటారు. ఉత్తర భారతంలోని వివిధ రాష్ట్రాల్లో రైతులు ఈ విధంగా మోళ్లను తగులపెడుతుండటంతో దట్టమైన పొగ ఆయా ప్రాంతాలను కమ్ముకుని ప్రజలకు ఊపిరాడకుండా చేస్తోంది. ఈ ఊపిరి సంబంధిత సమస్యల నుండి బయటపడేందుకు అనేక మంది రైతులు ఔషధాలను ఉపయోగిస్తూ మరింత అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఈ కాలుష్య సమస్యను ఏ విధంగా ఎదుర్కోవాలన్న అంశం ఇటు విధానకర్తలను, అటు రాజకీయ వేత్తలను తీవ్రంగా తికమకపెడుతోంది. ఉత్తర భారతంలో రైతులు బలమైన ఓటర్ల వర్గంలో వుండటంతో పాటు వారికి ఉచిత విద్యుత్, వ్యవసాయ రుణాల వంటివి కూడా ప్రభుత్వం నుండి అందుతున్న నేపథ్యంలో వారు అనుసరిస్తున్న విధానాలను మార్చటం అనుకున్నంత సులభసాధ్యం కాదు. దేశ రాజధాని ఢిల్లీకి ఇరుగు, పొరుగున వుండే పంజాబ్, యుపి, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పంట మోళ్లను తగుల బెట్టటం వంటి చర్యలను నిషేధించినప్పటికీ ఈ విధానం ఇప్పటికీ నిరాటంకంగా కొనసాగుతూనే వుంది. ఇందుకు ప్రత్యామ్నాయాలను చూపకుండా రైతులను శిక్షించటం, వారికి జరిమానాలు విధించటం అన్యాయమని పలువురు సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ కాలుష్యానికి కారణ మవుతున్న రైతుల చర్యలపై చర్యలు తీసుకోవాలంటూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి పెరుగుతున్నప్పటికీ దీనికి ముందుగా అనేక వ్యవస్థీకృత సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం వుందని వారంటున్నారు. ఉత్తర భారతంలో గత ఏడాది కన్నా ఈ ఏడాది దాదాపు 36 శాతం మేర ఈ మోళ్ల దగ్ధం పెరిగిందని నేషనల్ ఎయిరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జూన్ 1 నుండి ప్రారంభమైన వర్షాకాలంలో భారత్‌లోని అధికశాతం ప్రాంతాలు ఎక్కువ వర్షపాతాన్నే అందుకున్నాయి. దాదాపు రెండేళ్ల వర్షపు లోటు అనంతరం విస్తారంగా వర్షాలు పడిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా దాదాపు 3.82 కోట్ల ఎకరాలలో వరిసాగు పూర్తియిందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబు తున్నాయి. అదే సమయంలో రాజధాని హస్తినలో వాతావరణంలో కాలుష్య కారకాలు ఘనపు మీటర్‌కు 850 మైక్రో గ్రాముల వంతున పెరిగాయని వాతావరణశాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ఈ పరిమితి ఘనపు మీటర్‌కు కేవలం 25 మైక్రోగ్రాములు మాత్రమే. అంటే దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం నిర్దిష్ట పరిమితి కన్నా 34 రెట్లు ఎక్కువగా వుంటోందని ఈ లెక్కలు వివరిస్తున్నాయి. దీనికి తోడు దీపావళి పండుగ సందర్భం లో, వివిధ ఉత్సవాల నేపథ్యంలో కాల్చే బాణసంచా ప్రభావం చలికాలంలో వాతావరణాన్ని మరింత దిగజారుస్తోంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య దేశాలలో భారత్ 14వ స్థానంలో వున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి.

జాతికి సేవ చేస్తా

నీతి అయోగ్ వైస్ ఛైర్మన్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్‌కుమార్‌ను ప్రకటించింది. జాతికి సేవచేయాలనే సంకల్పంతో ముందుకు పోనున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఈ పదవికి ఆగస్టు 1న పనగరియా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. నూతన వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ పలు ప్రభుత్వ శాఖల్లోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్‌లో డిపిల్ చేసిన ఆయన లక్నో యూనివర్శిటీలో పిహెచ్‌డి పూర్తి చేశారు. 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్' విభాగంలో చాలాకాలంపాటు సేవలందించారు. ఐసిఆర్ఐఇఆర్‌కు డైరక్టర్‌గా కూడా వ్యవహరించారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్‌లోనూ సీనియర్ అధికారిగా ఉన్నారు.

పదేళ్ల నాటి ట్రక్కులు ఆపేశారా?

ఆయిల్ కంపెనీలను ప్రశ్నించిన ఎన్‌జిటి

న్యూఢిల్లీ: మండే స్వభావం కలిగిన పెట్రోలు, డీజిల్ వంటి ద్రవరూప ఇంధనాల తరలింపునకు పదేళ్ల నాటి ట్రక్కులు వాడటంపై ఆయిల్ కంపెనీలను జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జిటి) ప్రశ్నించింది. ఆగస్టు 8లోగా దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం సంస్థలను కంపెనీలను జస్టిస్ స్వతంత్రకుమార్ ధర్మాసనం ఆదేశించింది. పదేళ్ల క్రితం కొన్న ట్రక్కుల వినియోగాన్ని ఆపేసి, వాటి విడిభాగాలను అమ్మేసినట్లుగా ధృవీకరించే పత్రాలతో సహా పూర్తి నివేదిక ఇవ్వాలని ఎన్‌జిటి పేర్కొంది. ఆ మూడు కంపెనీలకు చెందిన సీనియర్ అధికారులు వ్యక్తిగతంగా ట్రిబ్యునల్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు దేశ రాజధాని పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో సిఎన్‌జిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని చెప్పింది.

ఐదేళ్లలో నిరక్షరాస్యత కనుమరుగు

కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్

జైపూర్ : రానున్న ఐదేళ్లలో భారత్‌లో నిరక్షరాస్యత కనుమరుగవుతుందని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. దీని కోసం చదువుకున్న విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఆరు నుంచి 12 తరగతి పిల్లలు ఇంటి వద్ద తమ తల్లిదండ్రులకు చదువు నేర్పితే నిరక్షరాస్యతను రూపమాపడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. రాజస్తాన్ ప్రభుత్వం, జెమ్స్ ఎడ్యుకేషన్ ఇండియాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న విద్యా ఉత్సవాన్ని శనివారం ప్రారంభించిన సందర్భంగా పైవ్యాఖ్యలు చేశారు. నేర్పడం, నేర్చుకోవడం ద్వారా ఆనందాన్ని పొందాలని సూచించారు. బోధించడం ద్వారా ఆనందాన్ని నింపలేకపోతే చదువు మానేసే విద్యార్థులు ఎక్కువ అయిపోతారని ఉపాధ్యా యులనుద్దేశించి చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో అక్షరాస్యత 18 శాతమని, ఇప్పుడు 80 శాతానికి చేరుకున్నామని పేర్కొన్నారు.

కీళ్ళ వ్యాధికి మాట్‌లు

అభివృద్ధి చేసిన ఐఐటి శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ : కీళ్ళ వ్యాధుల నివారణలో ఉపయోగించేందుకు వీలుగా గౌహతి ఐఐటికి చెందిన శాస్త్రవేత్తలు సిల్కు మాట్‌లను అభివృద్ధి చేశారు. సిల్కు ప్రొటీన్లు, బయో యాక్టివ్ గ్లాస్ ఫైబర్‌లతో కృత్రిమ మాట్‌లను వారు రూపొందించారు. కీళ్ళ నొప్పులతో బాధపడుతున్న రోగులలో కీళ్ళ మరమ్మత్తులు, ఎముకకు సంబంధించిన కణాలు వృద్ధి చెందించడం వంటి వాటిల్లో ఇవి ఎంతగానో ఉపయోపడతాయి. సాధారణంగా మోకాళ్ళు, తుంటి భాగంలోనూ. చేతులు, పాదాలు, వెన్నెముక తదితర భాగాలలో కీళ్ళ నొప్పులు వస్తాయి.

400 మంది ఉద్యోగులను గెంటేసిన కాంగ్నిజెట్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఐటి సేవల సంస్థ కాగ్నిజెట్ 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఉద్వాసన పలికింది. తొమ్మిది నెలల వేతనంతో సంస్థ నుంచి స్వచ్ఛందంగా ఉద్యోగ వివరణ చేయడానికి ఉద్యోగులు అంగీకరించారని ఆ సంస్థ తెలియజేసింది. ప్రపంచంలోని పలు దేశాల్లో ఆ సంస్థకు మొత్తం 2.5 లక్షల ముంది ఉద్యోగులున్నారు. వీరిలో 400 మంది ఉద్యోగ విరమణకు అంగీకరించారు. వీరిలో ఎక్కువ మంది భారతీయ ఉద్యోగలేని భావిస్తున్నారు. సంస్థ నుంచి వీరు వైదొలగడంతో సంస్థకు 60 మిలియన్ డాలర్ల ఆదా అవుతుందని ఆ సంస్థ సిఇఒ మెక్లీన్ పేర్కొన్నారు. సమర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగుల నిష్క్రమణ రేటు ఎక్కువగా ఉందని తెలిపారు.

థాడ్ ఏర్పాట్లకు తక్షణమే తెర

అమెరికాకు చైనా డిమాండ్

ఐక్యరాజ్యసమితి: ఉభయ కొరియాల సరిహద్దుల్లో ఏర్పాటు చేయతలపెట్టిన క్షిపణి నిరోధక వ్యవస్థ (థాడ్) ఏర్పాట్లకు తక్షణమే తెరదించాలని చైనా అమెరికాను డిమాండ్ చేసింది. ఐరాసలో చైనా రాయబారిగా వ్యవహరిస్తున్న లియు జియి భద్రతా మండలి భేటీలో మాట్లాడుతూ దక్షిణ కొరియా సరిహద్దుల్లో ఇప్పటికే ఏర్పా టు చేసిన థాడ్ పరికరాలను తక్షణమే తొలగించాలని సూచించారు. ఉ.కొరియా అణు, క్షిపణి ప్రయోగాల సమస్యకు థాడ్ ఏర్పాటుతో పరిష్కారం లభించదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతనలు రెచ్చగొట్టే చర్యలకు ఇప్పటికైనా స్వస్తి చెప్పాలని ఆయన ఉ.కొరియా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉత్తర హమాపై ఐఎస్ దాడులు

తిప్పికొట్టిన సిరియా సైన్యం

డెమాస్కస్/బీరూట్: సెంట్రల్ సిరియాలోని హమా ప్రావిన్స్ ఉత్తర ప్రాంతంలో ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్లు ప్రారంభించిన దాడులను తాము తిప్పికొట్టినట్లు సిరియా సైనిక వర్గాలు ప్రకటించాయి. అల్ మాఫ్కర్ నగర సమీపం లోని తూర్పు సలామియా ప్రాంతంలో భారీ పోరాటం జరుగుతోందని తొలుత మిలిటెంట్లు కొంత మేర ముందుకు చొచ్చుకొచ్చినప్పటికీ తాము వారిని విజయవంతంగా తిప్పికొట్టామని ఈ వర్గాలు వివరించాయి. సైన్యంలోని 11వ డివిజన్ ట్యాంకు దళం, నేషనల్ డిఫెన్స్ దళాలు ఉమ్మడిగా చేపట్టిన దాడుల్లో మిలిటెంట్లను తరిమికొట్టాయని, దాదాపు పదిమంది మిలిటెంట్లు సైన్యం చేతుల్లో హతం కావటంతో పాటు ఒక యుద్ధ ట్యాంక్‌ను, సాయుధ శకటాన్ని కోల్పోవటంతో ఐఎస్ మిలిటెంట్లు వెనుకంజ వేశారని సైనిక వర్గాలు తెలిపాయి.

ఐఎస్ చివరి స్థావరం కూడా సైన్యం స్వాధీనం

గత కొన్నేళ్లుగా ఐఎస్ మిలిటెంట్లు తిష్ట వేసిన చివరి స్థావరం సిరియా తూర్పున వున్న హామ్స్ ప్రావిన్స్‌లోని అల్‌సుఖ్నా నగరాన్ని తాము స్వాధీనం చేసుకున్నట్లు సిరియా సైన్యాన్ని ఉటంకిస్తూ సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స సంస్త వెల్లడించింది. సిరియా ఈశాన్య ప్రాంతాన వున్న పల్మైరా నగరానికి 50 కి.మీ దూరంలో వున్న అల్ సుఖ్నా నగరాన్ని ప్రభుత్వ దళాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈ సంస్థ వెల్లడించింది. ఇప్పటి వరకూ పూర్తిగా ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్ల ఆధీనంలో వున్న డీర్ అల్ జోర్ ప్రావిన్స్‌కు ఈ నగరం 50 కి.మీ దూరంలో వుంది. శనివారం నాడు ఈ నగరాన్ని చుట్టుముట్టి ముప్పేట దాడి చేసిన సైన్యం అక్కడి మిలిటెంట్లను తరిమికొట్టిందని సిరియా అధికార వార్తా సంస్థ సనా వెల్లడించింది. రష్యా వాయుసేన, ఇరాన్ మిలిషియా సంస్థల దన్నుతో సిరియా బలగాలు హమా ప్రావిన్స్‌తో పాటు దక్షిణాన వున్న రక్కా ప్రావిన్స్‌లోని అనేక ప్రాంతాలలో ఐఎస్‌పై వరుస విజయాలతో దూసుకెళ్తున్నాయి.

2020 ఎన్నికలకు కసరత్తు

ట్రంప్ బరిలో లేకుండా వుంటేనే తాము పోటీలో వుంటామంటున్న ఆశావహులు



వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు ఆర్నెల్లు పూర్తయిన నేపథ్యంలో అధికార రిపబ్లికన్ పార్టీలో 2020 ఎన్నికల కసరత్తు లాంఛనంగా ప్రారంభమైంది. ట్రంప్ తొలి పదవీ కాలం కేవలం వార్మింగ్ అప్ ఎక్సర్‌సయిజ్‌గా మారుతుండటంతో పలువురు సెనెటర్లు తాము తిరిగి పోటీ చేసేందుకు అనువైన స్థానాలను వెతుక్కుంటున్నారు. సెనేటర్లు టామ్ కాటన్, బెన్ సాస్సెలు ఇయోవా స్థానానికి పోటీ పడుతుండగా గవర్నర్ జాన్ కసిచ్ న్యూహాంప్‌షైర్ స్థానంపై కన్నేశారు. ఇక ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ పూర్తి స్థాయి రాజకీయ కార్యకలాపాలలో మునిగి పోవటంతో ఆయన మరోసారి ఉపాధ్యక్ష స్థానంపై కన్నేసి నట్లు రిపబ్లికన్ నేతలు ఛలోక్తులు విసురుకుంటు న్నారు. జరగబోయే ఎన్నికలకు అభ్యర్థులను పార్టీకి భారీ విరాళా లిచ్చిన ప్రముఖ డోనార్లనుండి ఎంపిక చేసే అవకాశాలుండ టంతో ఆ దిశగా సంబంధిత గ్రూప్‌ల వ్యక్తులు తమ ప్రొఫైల్స్‌ను అధినాయకత్వం ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. తాను రెండో పర్యాయం పోటీ చేయబోనన్న సంకేతాలను ట్రంప్ ఇప్పటి వరకూ వెలువరించనప్పటికీ ఆయన చుట్టూ తీవ్ర అసంతృప్తి అలుముకుంటోంది. 2020 నాటి ఎన్నికల అభ్యర్థులపై మీడియా ప్రతినిధులు అడిగిన ఒక ప్రశ్నకు వైట్‌హౌస్ ప్రతినిధి లిండ్సే వాలంటర్ బదులిస్తూ 'అధ్యక్షుడు ఇప్పటికీ ఇయోవా స్థానంలో బలంగానే వున్నారని, ఆ స్థానంపై ఆశపడుతున్న ప్రతి రిపబ్లికన్‌కూ ఈ విషయం తెలుస'ని అన్నారు. అయితే 2020 నాటి ఎన్ని కల్లో ట్రంప్ పోటీ చేసే పరిస్థితిపై అనేక సందేహాలు ముసురుకుంటుండటంతో పార్టీలోని ప్రతి ఒక్కరూ తమదైన ప్రణాళికతో పావులు కదుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ట్రంప్ అభ్యర్థిత్వంపై తీవ్ర అనిశ్చితి నెలకొన్న విషయం వివిధ స్థాయిల్లోని దాదాపు 75 మంది పార్టీ నేతలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, డోనార్లు, వ్యూహకర్తలను చేసిన ఇంటర్వ్యూల్లో స్పష్టమైంది. పార్టీ అంతర్గత రాజకీయాలకు సంబంధించిన నిబంధనలను ట్రంప్ గత ఏడాది సమూలంగా మార్చివేయ టంతో రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు ప్రముఖులు గత ఏడాది ఎన్నికల్లో కనీసం నామినేషన్ దశకు కూడా చేరు కోలేకపోయారు. ఇప్పుడు అనేక మంది ఆశావహులు రిపబ్లి కన్ డిన్నర్లలో రాబోయే అధ్యక్ష అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ గురించే చర్చించుకుంటుండటం విశేషం. అయితే రాబోయే ఎన్నికల్లో ట్రంప్ పోటీకి దిగకపోతేనే తాము బరిలోకి దిగుతామంటూ అనేక సందర్భాలలో షాడో అభ్య ర్థులు సంకేతాలు పంపుతున్నారు. ముఖ్యంగా ఉపాధ్యక్షుడు పెన్స్ ఈ విషయాన్ని పార్టీ డోనార్లకు స్పష్టంగా చెబుతున్నారు.

చర్చలకు రండి...!

ఉ.కొరియాకు చైనా సూచన



మణిలా : క్షిపణి ప్రయోగాల పరంపరను ఆపి చర్చలకు ముందుకు రావాలని చైనా ఉ.కొరియాకు హితవు పలికింది. ఇక్కడ జరుగుతున్న ఆసియాన్ కూటమి విదేశాంగ మంత్రుల సదస్సుకు హాజరైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌ఇ ఉ.కొరియా విదేశాంగ మంత్రి రియాంగ్ హోకు ఈ మేరకు సూచన చేశారు. ఆదివారం ఉదయం మంత్రుల స్థాయి సదస్సు ప్రారంభానికి ముందు ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ఉద్రిక్తతలను పెంచటం ఆపాలని వాంగ్ ద.కొరియా, అమెరికాలకు హితవు పలికారు. అన్ని వర్గాలు చర్చలకు కూర్చుని విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని వాంగ్ సూచించారు. వరుస అణు పరీక్షలు, క్షిపణి ప్రయోగాలతో అంతర్జాతీయ సమాజాన్ని కవ్వించటం మంచిది కాదని, ఐరాస తీర్మానాలకు తలొగ్గి చర్చలు ప్రారంభించా లని ఆయన ఉ.కొరియా విదేశాంగ మంత్రికి సూచించారు.

కెన్యా ఎన్నికల ప్రచారంలో హింస

రేపు ఎన్నికలు

నైరోబీ : మంగళవారం జరుగనున్న కెన్యా అధ్యక్ష ఎన్నికల ప్రచారం చివరిదశలో హింసాకాండతో హోరెత్తింది. ప్రస్తుత అధ్యక్షుడు ఉహురు కెన్యట్టా, ఆయన ప్రత్యర్థి రైలా ఒడింగాకు మధ్య హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీలో ఓట్ల రిగ్గింగ్, హింసాకాండ చోటు చేసుకుంటుందన్న భయాందోళనల మధ్య పోలిం గ్‌కు రంగం సిద్ధమయింది. ప్రచారం చివరి దశలో ఎన్నికల అధికారి ఒకరు హత్యకు గురికావటం దేశవ్యా ప్తంగా సంచలనం సృష్టించింది. ఓట్ల లెక్కింపు కేంద్రా లపై పోలీసులు దాడి చేసి భయానక వాతావరణం సృష్టించేందుకు కుట్ర పన్నారని ప్రతిపక్షం ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తోంది. దాదాపు దశాబ్ద కాలం క్రితం జాతి విద్వేష దాడులతో హోరెత్తి వివాదాస్పదంగా మారిన ఎన్నికల అనంతరం మంగళ వారం జరుగనున్న ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. అప్పటి ఎన్నికల్లో చెలరేగిన హింసాకాండలో దాదాపు 1,100 మంది మరణించగా, ఆరులక్షల మంది నిర్వాసితులైన విషయం తెలిసిందే. కెన్యన్లు ఇప్పటి వరకూ ఆరు ఎన్నికలను చూసినప్పటికీ ప్రస్తుత ఎన్నికలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై వుండటం విశేషం. ప్రధాన కూటమి అయిన నేషనల్ సూపర్ అలయెన్స్ (నాసా)కు నేతృత్వం వహిస్తున్న 72 ఏళ్ల ఒడింగా ప్రస్తుత ఎన్నికల్లో చావో రేవో తేల్చుకునే విధంగా పోరాడుతున్నారు. గతంలో 2007, 2013ల్లో జరిగిన ఎన్నికల ఫలితాలను కెన్యట్టా నేతృత్వంలోని జూబ్లీ పార్టీ తమ నుండి కొల్లగొట్టిం దని, ఇప్పుడు కూడా అదే తరహా ప్రయత్నాలకు అధికార పార్టీ తెర తీసిందని నాసా కూటమి ఆరోపి స్తోంది. ఎన్నికల కమిషన్‌పై నానా టికీ వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఓటును భద్రం చేసు కోవాలంటూ ఒడింగా తన మద్దతుదారు లకు పిలుపునిచ్చారు. ఇరువురు నేతలూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, వారు ఏదో ఒక సమయం లో కుమ్మక్కు కావటం ఖాయమని బర్మింగ్‌హామ్ యూని వర్శిటీలో ఆఫ్రికన్ రాజకీయ శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న నిక్ చీజ్‌మన్ చెబుతున్నారు.

భారీ భద్రత

మంగళవారం నాటి ఎన్నికలకు దేశవ్యాప్తంగా దాదాపు 1,80,000 మంది భద్రతా సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ ఎన్నికల్లో దేశాధ్యక్షుడితో పాటు గవర్నర్లు, చట్టసభల ప్రతినిధులు, సెనేటర్లు, కౌంటీ ప్రతినిధులు, స్థానిక సంస్థల మహిళా ప్రతినిధులను కూడా కెన్యన్లు ఎన్నుకోనున్నారు. దాదాపు 1.9 కోట్ల మంది కెన్యన్లు 40 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటింగ్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగుతుంది.

ఇయుకు 4 వేల కోట్ల యూరోల పరిహారం

చెల్లించేందుకు సిద్ధమవుతున్న బ్రిటన్

లండన్ : ఐరోపా కూటమి (ఇయు) నుండి నిష్క్రమించనున్న బ్రిటన్ ఆ కూటమికి దాదాపు 4 వేల కోట్ల యూరోల పరిహారాన్ని చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు బ్రిటన్ మీడియా తన తాజా వార్తా కథనాలలో వెల్లడించింది. బ్రెగ్జిట్‌కు సంబంధించిన సంక్లిష్ట అంశాలను పరిష్కరించుకునేందుకు చర్చలు ప్రారంబించటానికి ముందు బ్రిటన్ దాదాపు 6 వేల కోట్ల యూరోల పరిహారాన్ని చెల్లించాల్సి వుంటుందని ఐరోపా కూటమి ఇంతకు ముందు లెక్క తేల్చిన విషయం తెలిసిందే. సండే టెలిగ్రాఫ్ పత్రిక తాజా సంచికలో ప్రచురితమైన ఈ కథనంపై స్పందించేందుకు బ్రిటన్ ప్రభుత్వ విభాగాలు నిరాకరించాయి. అయితే ఇయుకు తాము ఎంత మొత్తం చెల్లిస్తామన్న విషయంపై బ్రిటన్ ఇప్పటి వరకూ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయకపోవటం విశేషం. 2019 మార్చిలో ఇయు నుండి నిష్క్రమించిన తరువాత బ్రిటన్ కూటమికి ఏటా వెయ్యి కోట్ల యూరోల వంతున మూడేళ్ల పాటు చెల్లించే విధంగా బ్రిటన్ అధికారులు ప్రతిపాదించనున్నారని ఈ పత్రిక తన కథనంలో వివరించింది. ఇయుతో సమగ్ర వాణిజ్య చర్చల అనంతరం పరిహారం మొత్తాన్ని అధికారికంగా ఖరారు చేస్తారని తెలిపింది. చెల్లింపులన్నీ వాణిజయ ఒప్పందంలో భాగంగానే జరుగుతాయని ఈ పత్రిక వెల్లడించింది.

ఆ ఆరోపణలు సరికాదు

మయన్మార్ ప్రభుత్వం

యాంగాన్ : గత ఏడాది రోహింగ్యా ముస్లింలపై జరిగిన దాడుల్లో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ ఐరాస చేసిన ఆరోపణలను మయన్మార్ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ విషయాన్ని ఐరాస భూతద్దంలో చూస్తూ విమర్శలు గుప్పిస్తోందని మయన్మార్ విమర్శించింది. గత ఏడాది అక్టోబర్‌లో సైన్యం ముస్లిం మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతూ అమాయక గ్రామీణులను అన్యాయంగా కాల్చిచంపుతోందని, ఇళ్లను దగ్ధం చేస్తోందని ఆరోపిస్తూ రోహింగ్యా మిలిటెంట్లు జరిపిన దాడిలో తొమ్మిది మంది సరిహద్దు గార్డులు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణల్లో దాదాపు 75 వేల మంది ముస్లింలు పొరుగునే వున్న బంగ్లాదేశ్‌కు వలస వెళ్లిపోయారు. ఈ ఘటనను పరిశీలించిన ఐరాస బృందం మయన్మార్ భద్రతా దళాలు రోహింగ్యా ముస్లింలను తుడిచిపెట్టే లక్ష్యంతో వారిపై దాడులు జరిపినట్లు ప్రకటించి దీనిపై విచారణ బృందాన్ని నియమించింది. అయితే ఐరాస విచారణ బృందం తమ దేశంలో పర్యటించటంపై మయన్మార్ ప్రభుత్వం నిషేధం విధించింది.

ఎమెన్ పౌరులపై వైమానిక దాడులకు ఐరాస ఖండన



దుబాయ్: ఎమెన్‌లో దాదాపు 12 మంది చిన్నారులు, కొంతమంది పౌరులను బలిగొన్న వైమానిక దాడులను ఐరాస తీవ్రంగా ఖండించింది. యెమెన్‌లో కొనసాగుతున్న అంతర్గత పోరులో పౌరుల భద్రతపై అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇది తాజా ఉదాహరణ అని అక్కడి ఐరాస మానవతా వ్యవహారాల సమన్వయ కర్త జెమీ మెక్ గోల్డ్‌రిక్ విమర్శించారు. యెమెన్‌లోని సదా ప్రావిన్స్‌లో ఒక ఇల్లు, ప్రైవేటు వాహనంపై జరిగిన వైమానిక దాడిలో కొంతమంది చిన్నారులతో సహా 12 మంది పౌరులు మరణించగా, మరో పది మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు, ఆరుగురు చిన్నారులు మరణించినట్లు మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. అంతర్యుద్ధంలో చోటు చేసుకుంటున్న కిరాతకత్వానికి తాజా ఘటనలు అద్దం పడుతున్నాయని మెక్‌గోల్డ్‌రిక్ తన ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

రెండంకెల గ్రాఫ్

కెసి కెనాల్ ఆయకట్టు బీడు పడ్డట్లే. సోమశిలలో సైతం నీరు లేనందున పెన్నాడెల్టాకు ఇబ్బందిగా మారింది. గోదావరిడెల్టాకు మట్టుకు ఖరీఫ్‌లో సమస్య ఉండదని అధికారులు అంచనా వేశారు. పత్తి సాగు మొదట్లో ఊపినా వర్షాభావం వలన సాగు నత్తనడకన సాగుతోంది. వర్షాభావంతో పాటు నిరుడు ధర లేనందున కంది సాగు తగ్గింది. మిర్చిదీ ఇదే పరిస్థితి. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు, ఉల్లి, పసుపు దాదాపు పంటల సాగు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. రబీలోనూ రిజర్వాయర్లు నిండకపోతే వరి తగ్గుతుందని, మూడేళ్లగా అదే జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ ఒరవడి ఇలానే కొనసాగితే నాలుగో సంవత్సరం కూడా సాగు తగ్గుతుందని అంచనా వేశారు.

సామాన్యుడి బిడ్డనైతే నా గతేంటీ?

ఒక సామాన్యుడి కూతురునైవుంటే పోలీసులు ఇంత వేగంగా స్పందించేవారా అని ప్రశ్నించారు. కేసును ఇంత సీరియస్‌గా పరిగణించేవారా అని ఆమె నిలదీశారు. బిజెపి నేత తనయుడు తనను వెంబడించిన తీరును, పోలీసులు స్పందించిన తీరును బాధిత యువతి ఆదివారం నాడు మీడియాకు తెలియజేశారు. 'ఇంటికి వెళ్తున్న సమయంలో వికాస్, అతని స్నేహితుడు నన్ను వెంబడించారు. నా కారును ఆపి బెదిరించేందుకు ప్రయత్నించారు. ఊహించనిరీతిలో కారు ముందుకు వచ్చి దారికి అడ్డుపడ్డారు. నేను కారును వెంటనే రివర్స్ తీసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాను. వారు జరిగిందంతా విని సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆ వెంటనే నిందితులను అరెస్టు చేశారు. సకాలంలో వచ్చి రక్షించిన పోలీసులకు కృతజ్ఞతలు' అని ఆమె అన్నారు. ఈ విషయమై ఫేస్‌బుక్‌లోనూ ఆమె స్పందించారు. తాను సామాన్యుడి కూతురు కానందుకు అదృష్టవంతురాలిననీ, సామాన్యుడి కూతురునైవుంటే అలాంటి విఐపీలకు వ్యతిరేకంగా పోలీసులు స్పందించేవారా అని ఆమె సందేహం వ్యక్తం చేశారు. పోలీసుల సమయస్ఫూర్తితో అత్యాచారానికి, హత్యకు గురికాకుండా తాను బయటపడగలిగానని, దానికి కూడా తాను అదృష్టవంతురాలినని ఆమె పేర్కొన్నారు. తనను వేధింపులకు గురిచేసిన ఇద్దరూ బలమైన రాజకీయ నేపథ్యమున్న కుటంబాల వారేనని తెలిపారు.

నిందితులకు బెయిల్

వికాస్ అతని స్నేహితు అశీష్ కుమార్‌కు అరెస్టు చేసిన వెంటనే బెయిల్ మంజూరయ్యింది. వీరిద్దరిపై ఐపిసి సెక్షన్ 354డి కింద వెంబడించి వేధించడం, మోటర్ వాహనాల చట్టం సెక్షన్ 185 కింద తాగి డ్రైవ్ చేయడం అభియోగాల కింద కేసు నమోదు చేశారు.

సుభాష్‌కు సంబంధం లేదు : ఖట్టర్

తనయుడు చేసిన నేరానికి తండ్రికి శిక్ష విధించడం సరికాదనీ, ఈ కేసుతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాలకు సంబంధం లేదని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకుంటారని ఆయన అన్నారు. కాగా నిందితులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత అశోక్ తన్వార్ డిమాండ్ చేశారు.

బాధితను కించపరుస్తూ వికాస్ కుటుంబ దుష్ప్రచారం

వేధింపులకు గురైన యువతిని కించపరుస్తూ నిందితుడు వికాస్ కుటుంబం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోంది. ఇద్దరు వ్యక్తులతో కలిసి ఉన్న బాధితురాలి ఫొటోను వికాస్ కుటుంబ సభ్యులలో ఒకరు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి సంఘటన జరిగిన సమయంలో ఆమె తాగి ఉన్నారని పేర్కొన్నారు. అయితే నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో సదరు పోస్టును తొలగించారు.

'కొకైన్' ముఠా అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఒకప్రక్క డ్రగ్స్ కేసులో ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నా మత్తు దందా హైదరాబాద్‌లో ఏదో ఒక మూలన జరుగుతూనే ఉంది. టాస్క్‌ఫోర్సు పోలీ సులు రోజుకో ముఠాను అరెస్టు చేస్తున్నా రు. ఆదివారం నార్త్‌జోన్, ఎస్‌ఆర్ నగర్ పోలీసులు కొకైన్ విక్రయిస్తున్న నైజీరియన్ జాన్ బాస్కో, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మహ్మద్ జహరుల్లాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 180 గ్రాముల కొకైన్, సెల్ ఫోన్లు, హోండా యాక్టివా స్వాధీనం చేసుకున్నారు. జాన్ బాస్కో బిజి నెస్ వీసాపై 2016 జూన్‌లో ఇండియాకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉండే మహ్మదు ల్లాతో పరిచయం ఏర్పరుచుకొని డ్రగ్స్ అమ్మకాలు సాగించారు. ముంబై కేంద్రంగా డ్రగ్స్ దందా నడుస్తున్నట్లు విచారణలో వెల్ల డయ్యింది.గ్రాము కొకైన్ వారు రెండు వేల కు కొని కస్టమర్లకు ఆరువేలకు విక్రయిస్తూ ఈజీ మనీకి అలవాటు పడ్డారు. దందాలో భాగంగా ఆదివారం ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసు కున్నారు.

హోరాహోరీ



(మొదటి పేజీ తరువాయి)

పది మంది మంత్రులు నంద్యాల ఉప ఎన్నికపైన కేంద్రీకరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రచార అర్భాటానికి నేతలు దిగుతున్నారు. తామేమి తక్కువేమి కాదని ప్రతిపక్షం వైకాపా నంద్యాల ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించింది. నాయకత్వ లేమితో దిక్కుతోచని స్థితిలో ఉన్న పార్టీలో అధినేత జగన్‌మోహన్ రెడ్డి శిల్పామోహన్‌రెడ్డిని టిడిపి నుంచి రప్పించి టిక్కెట్ ఇవ్వడంతోపాటు ఆయన సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డినీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి పార్టీలోకి చేర్చుకున్నారు. దీంతో వైసిపి శ్రేణులకు కొత్త ఉత్సాహం వచ్చినట్లైంది. ఆర్థికబలం, అంగబలం ఉన్న శిల్పామోహన్‌రెడ్డి అడగడుగునా ప్రచారంలో దూసుకెళు తుండడంతో టిడిపి తనదైన పద్ధతిలో కౌంటర్‌నిస్తోంది. నోటిఫికేషన్ వచ్చాక జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావడంతో టిడిపికి గుండెల్లో రైలు పరుగెత్తినట్లైంది. బహిరంగ సభలో జగన్, శిల్పా చక్రపాణిరెడ్డిలు చేసిన వ్యాఖ్యలను ఆసరా చేసుకొని సమస్యను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు టిడిపి వ్యూహం పన్నుతోంది. జగన్ వ్యాఖ్యలపై ఈసీ స్పందించి సుమోటోగా నమోదు చేసింది. చక్రపాణిరెడ్డి మహిళలను అవమానించారంటూ మహిళలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటిముందు ఆందోళనకు దిగారు. అయితే మహిళలకు రూ.300ల చొప్పున ఇచ్చి టిడిపి ఆందోళన చేయించినట్లు దీనిపై చర్చ జరిగింది. నంద్యాల కేంద్రంగా వైసిపి రాష్ట్ర ముఖ్య నేతలు బొత్స సత్యనారాయణ, రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు మకాం వేసి వ్యూహరచన చేస్తున్నారు. వీధుల్లో ప్రచారానికి వెళ్లిన రోజాను టిడిపి మహిళలు నిలదీశారు.

గెలుపే లక్ష్యంగా డబ్బుల కుమ్మరింపు

ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున డబ్బులు కుమ్మరిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ప్రచారం ఉన్నా లేకున్నా ప్రతి ఇంటికీ ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా టిడిపి, వైసిపి డబ్బులందిస్తుండడంతో నంద్యాల ఉప ఎన్నికల వాతావరణం కోలాహలంగా తయారైంది. సాయంత్రం కాగానే ప్రతి వీధిలోనూ ఎవరెవరికి ఎంత ఇచ్చారు, కుటుంబానికి ఎంత ఇచ్చారనేది లెక్కలు వేసుకుంటున్న పరిస్థితి ఏర్పడిందంటే బరిలో ఉన్న అభ్యర్థులు ఏ మేర డబ్బును వెదజలుతున్నారో అవగతమవుతోంది. 2014 ఎన్నికల్లో 2,500 ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ ఈ సారి డిపాజిట్ స్థాయిలో ఓట్లను తెచ్చుకునేందుకు నియోజికవర్గంలో గణనీయమైన సామాజికవర్గం ఉండే అబ్దుల్‌ఖాదర్‌ను రంగంలోకి దింపింది.

ఏకంగా రఘువీరారెడ్డి నంద్యాలలో తిష్ట వేసి నామినేషన్ నుంచి ప్రచార కార్యక్రమం వరకూ భుజాన ఎత్తుకున్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పోటీ చేయడం ద్వారా ఎవరి ఓట్లకు గండిపడుతుందనేది టిడిపి, వైసిపి అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు బరిలో ఉన్న టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి మధ్య కాకుండా జగన్, చంద్రబాబు మధ్యనే పోటీ జరగుతుందన్నంతగా వాతావరణం నెలకొందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

సంకటంలో బిపిఒలు

ఆటోమేషన్‌తో ఊడనున్న ఉద్యోగాలు

న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో ఐటి ఉద్యోగాల కోతకు ఆటోమేషన్ విధానం ప్రధాన కారణం కానుందనీ అమెరికాకు చెందిన హెచ్‌ఎఫ్‌ఎస్ పరిశోధనల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రానున్న కాలంలో ఉద్యోగులపై, ఉద్యోగార్థులపై ఈ ప్రభావం తీవ్రంగా పడనున్నట్లు నివేదికలు స్పష్టం చేశాయి. డిజిటలై జేషన్, ఆటోమేషన్ విధానం ద్వారా వ్యాపార సంస్థలు వారి వినియోగదారులను చేరువయ్యే అవ కాశం ఉందని పేర్కొన్నాయి. ఈ విధానంలో తమ సంస్థ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా ఉద్యో గుల సంఖ్యను గణనీయ స్థాయిలో తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఇదే జరిగితే తమ పరిస్థితి ఏమిటని పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారనీ, తమ ఉద్యోగం లేనివారిగా మారడం తథ్యమని పేర్కొంటున్నారని నివేదిక తెలియజేసింది. ఈ ఆటోమేషన్ విధానం 14 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని అంచనా వేసింది. భారతదేశంలో 2021 నాటికి 4,80,000 మంది ఉద్యోగాలపై ఆ ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేసింది, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, బిపిఒలపై తీవ్రస్థాయిలో ప్రభావం పడుతుందని అంచనా వేసింది. రానున్న ఐదేళ్లకాలంలో ఐటి ఉద్యోగాలు భారీగా క్షీణించే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఆరుతున్న నిప్పుపై జైట్లీ ఆజ్యం

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న జైట్లీ కేరళ రాష్ట్రంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎం కార్యకర్తలు ఉగ్రవాదులనీ, కేరళ ఉగ్ర రాష్ట్రమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ ప్రజానీకానికి శాంతి అవసరమనీ, ఎల్‌డిఎఫ్ అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆయన ఆరోపించారు. ఆరెస్సెస్ కార్యకర్తపై దాడి చేస్తున్న సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపించారు.

శాంతికి అఖిలపక్షం కట్టుబాటు

కేరళ ఓ సమస్య సుడిగుండంగా మారుతోందంటూ దుష్ప్రచారం చేయడం తగదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. హింసకు ముగింపు పలకాలని అన్ని పార్టీలకు ఆయన పిలుపునిచ్చారు. కేరళలో శాంతి స్థాపనపై చర్చించేందుకు ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సిపిఎం, కాంగ్రెస్, బిజెపి, పలు పార్టీలు ఈ సమావేశానికి హాజరయ్యాయి. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పార్టీలన్నీ మద్దతు ప్రకటించాయి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంపై జరుగుతున్న దుష్ప్రచారం అన్ని విధాలా తీవ్ర ప్రభావం చూపుతుందనీ, ముఖ్యంగా పెట్టుబడుల సానుకూలతపై ప్రభావం పడుతుందనీ, ఇది చాలా ప్రమాదకరమనీ ఆయన అన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం

ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీటి మట్టం తగ్గిపోతుండటంతో రైతాంగం ఆందోళనలో పడింది. ఈ రిజర్వాయర్‌కు 1.68 టిఎంసిల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉంది. ప్రస్తుత సమయంలో కొంతమేర పిఎబిఆర్ డ్యాంకు నీటిని అందించి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇటీవల రాప్తాడు నియోజకవర్గంలోని కొన్ని చెరువులకు, ధర్మవరం, బుక్కపట్నం చెరువులకు జీడిపల్లి రిజర్వాయర్‌లోని నీటిని వదిలారు.

అంతా 'సెల్ఫ్ ఫైనాన్సే'


(మొదటి పేజీ తరువాయి)

మరలా పునరుద్ధరించాలని జీవోలో పేర్కొంది. ఇందులో భాగంగానే పదేళ్ల పాటు ఈ కోర్సులు ఉండేలా విజన్ డాక్యుమెంటరీ ఉండా లని తెలిపింది. పరిశ్రమలు, ఉద్యోగావకాశాలు కల్పించే సంస్థల సంప్రదింపు లతో ఉద్యోగావ కాశాలకు వీలైన కరికులమ్‌ను ఏర్పాటు చేయాలి. కనీసం 20శాతం కోర్సులు పారిశ్రామిక ముఖ్యుల భాగస్వామ్యంతో నడిచేలా చూడాలి. బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు ఇతర వ్యవయా లకు సంబంధించిన నిధులకు తగ్గ ఆదాయం ఈ కోర్సుల ద్వారానే సాధించాలి. ఖర్చులకు అనుగు ణంగా ప్రతి ఏటా ఫీజులను సరిచేసుకునే అవకా శం ఉంది. పరిశ్రమల నుంచి సామాజికబాధ్యతా నిధులు, విరాళాల ద్వారా ఈ కోర్సులను ఆయా యూనివర్సిటీలు పరిపుష్టం చేసుకోవాలి.

వ్యాపార కేంద్రాలుగా మార్చేందుకే: నూర్ మహమ్మద్ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

సమాజ అభివృద్ధికి మేధోసంపత్తి కేంద్రాలుగా ఉన్న యూనివర్సిటీలను వ్యాపార కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ప్రభుత్వమే ఇలా చేస్తే ప్రైవేట్ విద్యాసంస్థలకు, ప్రభుత్వం విద్యాసంస్థలకు తేడా ఉండదు. ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార కోసమే నడుస్తాయి. ప్రభుత్వ దురదృష్టితో కాకుండా వ్యాపార దృష్టితో ఈ నిర్ణయం తీసుకుంది.

ఉపాధి కూలీల ముసుగులో నిధులు స్వాహా



గుంటూరు జిల్లా మాచర్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- అభివృద్ధి పనుల్లో జన్మభూమి కమిటీలదే కీలక పాత్ర
- బినామీ పేర్లతో నేతల చేతివాటం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలోని గ్రామీణ పేదలకు ఏటా కనీసం 100 రోజులు పని కల్పించే ఉద్దేశ్యంతో 2006లో కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికార పార్టీ నేతలకు, జన్మభూమి కమిటీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. నిరుపేదలైన కూలీల పేరున జన్మభూమి కమిటీల వారే బినామీ పేర్లతో పనులు చేసినట్లు చూపించి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేస్తున్నట్టు సమాచారం. సగటున 75 పనిదినాలు మాత్రమే వారికి ఉపాధి లభిస్తోంది. వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత పనులు చేపట్టాల్సి ఉండగా ఇటీవల కాలంలో అన్ని పనులకూ ఉపాధి హామీ నిధులను అనుసంధానం చేసి చేపట్టడం వల్ల ఆయా పనుల్లో వ్యవసాయ కార్మికులను వినియోగిస్తున్నట్లు చూపి సాధారణ కూలీలను వినియోగిస్తున్నారు. వ్యవసాయ కార్మికులకు మాత్రం పనులు కల్పించడం లేదు. అదేమంటే అసలు కూలీలు ఎవ్వరూ ముందుకు రాకపోవడం వల్ల పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని మాత్రం అధికారులు సమీక్షా సమావేశాల్లో చెబుతున్నారు. అసలైన వ్యవసాయ కార్మికులకు, జాబ్ కార్డు ఉన్నవారికి పనులు కల్పించకుండా స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కూలీలను వినియోగించుకుని వారికి ఉపాధి హామీ నిధులు ఇప్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో గతంలో పోస్టాఫీసుల్లో ఉన్నప్పుడు కొన్ని అవకతకవలు బయటపడ్డాయి. ప్రతి అభివృద్ధి పనిలో జన్మభూమి కమిటీలు కీలక భూమిక పోషిస్తున్నాయి. మండల స్థాయి అధికారులు ఉపాధి కూలీల పనిని పర్యవేక్షించాల్సిన మేట్స్‌పై వత్తిడి తెచ్చి జన్మభూమి కమిటీల ద్వారా పనులు మార్పిడి చేసి వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులకు వినియోగించే కూలీలనే ఉపాధి కూలీలుగా చూపి నిధులు డ్రా చేసుకుంటున్నారు. నీరు చెట్టు, పంట సంజీవని, సిమెంట్ రోడ్లు, గృహ నిర్మాణం, మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉద్యాన పంటల మొక్కలు నాటడం తదితర పనుల్లో వాస్తవ కూలీల కన్నా ఇతరులు పనిచేసినా ఉపాధి హామీ నిధులను వారికి ఉపయోగించడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదు. గతంలో ఉపాధి హామీ పథకం అమలు చేయడం వల్ల వ్యవసాయ కూలీలు దొరకడం లేదని కొంత మంది వితండవాదం చేయడం వల్ల వ్యవసాయానికి ఉపాధి నిధులు అనుసంధానం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు అన్ని పథకాలకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం చేసి పనులు చేపడుతుతోంది. దీని వల్ల వ్యవసాయ రంగంలో ఉన్న కూలీలకు లభించాల్సిన కనీస పనిదినాలు లభించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

లక్నోకు భరత్


మహేష్ బాబు

మహేష్ బాబు వరుసపెట్టి సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మురగదాస్ దర్శకత్వంలో చేసిన 'స్పైడర్' చిత్రం ఈ దసరాకు విడుదల కాబోతుంది. మొన్న చివర గీతంతో చిత్రీకరణ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు మహేష్ తర్వాత సినిమా 'భరత్ అనే నేను' పనుల్లో బిజీగా ఉన్నాడు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. 'స్పైడర్' షూటింగ్ ఉండగానే కొరటాల చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. త్వరలో మరో షెడ్యూల్ కోసం లక్నో వెళ్లేందుకు రెడీ అవుతోందీ చిత్రబృందం. రెండు వారాల పాటు జరగనున్న ఈ షెడ్యూల్ ఈ నెల 10న మొదలవుతుంది. ఈ షెడ్యూల్‌లో లక్నోలోని జహంగీరాబాద్ ప్యాలెస్, నాద్వా కాలేజ్, లక్నో యూనివర్సిటీలో షూటింగ్ జరపనున్నారు. అక్కడ మహేష్ చిత్రం షూటింగ్ జరగడం ఇదే మొదటిసారి కానుందట. దేవీ శ్రీ ప్రసాద్ బాణీలు సమకూరుస్తున్న ఈ సినిమాను డివివి దానయ్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.


రాశీ ఖన్నా

సినిమా విడుదల విషయంలో ఎవరూ తగ్గడం లేదు

నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు



కిరణ్ రెడ్డి, డి. సురేష్ బాబు, భరత్ చౌదరి

'నేనే రాజు నేనే మంత్రి' సినిమా ఈనెల 11న విడుదలవుతుంది. అదే రోజున నితిన్ 'లై', బోయపాటి 'జయ జానకి నాయక' కూడా విడుదలవుతున్నాయి. దీని వల్ల థియేటర్స్ విషయంలో కొన్ని సమస్యలున్నాయి. ఇలా ఓ మోస్తారు సినిమాలు ఒకే రోజున కావడం మంచిది కాదని నా అభిప్రాయం. అందువల్ల మిగిలిన ఇద్దరితో కూడా మాట్లాడటానికి ప్రయత్నించాను. కానీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు" అని నిర్మాత సురేష్ బాబు అన్నారు.

రానా దగ్గుబాటి చేస్తున్న పొలిటికల్ థ్రిల్లర్ 'నేనే రాజు నేనే మంత్రి'. సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తేజ దర్శకత్వం వహిస్తున్నారు. డి. సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి. భరత్ చౌదరి నిర్మాతలు. కాజల్ అగర్వాల్, కేథరిన్ నాయికలు. నవదీప్ కీలక పాత్రధారి. నిర్మాతలు ఆదివారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో విలేకరులతో మాట్లాడారు.

డి.సురేష్ బాబు మాట్లాడుతూ 'ఈ కథను ముందు వినగానే రానాకు సూట్ అవుతుందనిపించింది. సినిమాల్లోకి రావాలని చాలా మంది కలలు కంటుంటారు. కానీ ఆ కలను కొంతమందే నేరవేర్చుకుంటారు. సినిమాలు తీసి విడుదల చేస్తే హ్యాపీగా అనిపిస్తుంది. చాలా మందికి వీడికేం ఇండస్ట్రీలోకి వచ్చేశాడు. అన్ని సుఖాలే అనుకుంటారు. కానీ అనుకున్నంత సుఖంగా ఎవరూ ఉండలేరు. ఇక రానాను హీరోగా చేయాలనిపించగానే తనతో ఎలాంటి సినిమా చేయాలా? అని చాలా ఆలోచించాను. తనతో 'ఖైదీ' వంటి సినిమా చేయాలని కోరిక ఉండేది. ఆ సమయంలో శేఖర్ కమ్ముల వచ్చి 'లీడర్' కథ చెప్పాడు. వెంకటేష్‌తో చేయమని అంటే.. శేఖర్ మాత్రం ఈ సినిమాను రానాతోనే సినిమా చేస్తానని అన్నాడు. రానా తొలి సినిమాను వేరే సంస్థతో చేస్తున్నప్పుడు తండ్రిగా నేను టెన్షన్‌గానే ఫీలయ్యాను. హీరో అయిన తర్వాత తను చేసిన కొన్ని సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించాయి. కొన్ని సరిగా ఆడలేదు. నేను మాత్రం తనకు సూపర్ హీరో కథనో, సూపర్ విలన్ కథనో ఇవ్వాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. రానా 'కృష్ణం వందే జగద్గురమ్' చేసిన తర్వాత రాజమౌళి తనకు బాహుబలిలో అవకాశం ఇవ్వడం, బాహుబలికి ఎంతో పేరు రావడం, 'ఘాజీ' పెద్ద హిట్ కావడం జరిగాయి. ఆ సమయంలో తేజ 'అహం' అనే కథతో నన్ను కలిశాడు. కథ చెప్పి రానా విలన్‌గా చేయాలని అన్నాడు. రానా కథ విని సూపర్బ్‌గా ఉందని అన్నాడు. అప్పుడు బ్లూ ప్లానెట్ వాళ్లతో కలసి సినిమా అనుకోగానే, అందరం కలిసి కథను సిద్ధం చేశాం. ఫైనల్‌గా చూస్తే క్లాసిక్ మూవీలా తయారైంది. సినిమాలో రానా యాక్టింగ్ చూశాను. మూడు నాలుగు సన్నివేశాల్లో నన్నైతే ఏడిపించేశాడు. తన నటన పట్ల నేను సంతృప్తి చెందాను. తేజ దర్శకుడు అనగానే ఆయనకు సక్సెస్‌లు లేవు కదా, అని చాలా మంది అన్నారు. కానీ తనెంటో అందరికీ తెలుసు. టాలెంట్ ఉండి సక్సెస్‌లు లేకపోయినా, మంచి సినిమా తీస్తారనే నమ్మకంతో తనతో సినిమా చేశాం. తేజగారి వైఫ్ కూడా రీసెంట్‌గా సినిమా చూసి చాలా బాగా చేశావ్ అని మెచ్చుకున్నారు. సినిమాలో జోగేంద్ర, రాధ క్లాసిక్ భార్యభర్తలుగా నటించారు. మూడో కోణంలో మరో లేడీ కూడా ఉంటుంది. మనకు పెద్దవాళ్లు ఓ లక్ష్యాన్ని ఇస్తారు. ఆ లక్ష్య సాధనలో మనం కొన్నిసార్లు దారి తప్పుతాం. అలా తప్పుదారి పట్టిన హీరో తన తప్పును ఎలా కరెక్ట్ చేసుకున్నాడనేదే కథ. నాయగన్ వంటి కథ ఇది.

నేను టెక్నికల్‌గా చాలా విషయాలు నేర్చుకోవాలి. నేను కూడా జీవితంలో నేర్చుకుంటున్నాను. నాకు కూడా విజువల్ ఎఫెక్ట్స్‌పై పెద్దగా నాలెడ్జ్ లేదు. ఉదాహరణ చెప్పాలంటే వెంకటేష్ హీరోగా జంతువులపై ఓ సినిమా చేయాలనుకుంటున్నాను. కానీ నాకు ఎలా చేయాలో నాలెడ్జ్ లేదు. కథ విన్నవారందరూ వారికి తోచిన విధంగా సలహాలు ఇస్తున్నారు. బిగ్ బడ్జెట్ సినిమాలంటే విజువల్ ఎఫెక్ట్స్ లేకుండా ఉండవు. కాబట్టి ఆ నాలెడ్జ్ వస్తే, తప్పకుండా నేను పెద్ద ప్రాజెక్ట్స్ చేయడానికి సిద్ధం. ఇప్పుడు మా బ్యానర్‌లో 'అదుగో' సినిమా కూడా వరాహంపై ఉంటుంది. టెక్నికల్ సినిమా. సినిమా పూర్తయిపోయి ఎనిమిది నెలలు అవుతుంది. మరో రెండు నెలలు తర్వాతే సినిమా విడుదలకు సిద్ధమవుతుంది. కుదిరితే నేను రాజు నేనే మంత్రి సినిమా సమయంలో అదుగో సినిమా ట్రైలర్ విడుదల చేసేలా ప్లాన్ చేశా' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి పాల్గొన్నారు.

రేపటి గురించి ఆలోచించను

'నేను చాలా సెక్యూర్ యాక్టర్‌ను. కెరీర్‌లో పలానా స్థాయికి చేరుకోవాలనే కోరికైతే నాకు లేదు. ప్రస్తుతం నేను చేస్తున్న పని, ఉన్న స్థాయితో చాలా ఆనందంగా ఉన్నా. రేపటి గురించి నేను ఆలోచించను' అని తమిళ్ హీరో ధనుష్ అన్నాడు. ఆయన హీరోగా చేసిన 'వీఐపీ2' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కాజోల్ ప్రతినాయకురాలుగా చేస్తోంది. అమలా పాల్ కథానాయిక. తమిళ్, తెలుగు భాషల్లో రూపొందిన 'రఘువరన్ బీటెక్'కు ఇది సీక్వెల్ సినిమా. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ధనుష్ ఆదివారం మాట్లాడాడు. దేవుడు తనకు ఏవీ ఎక్కువగానూ, తక్కువగానూ ఇవ్వలేదని చెప్పారు. 'నేను పోయేటప్పుడు (చనిపోయేటప్పుడు) నాతో పాటు ఏమీ తీసుకెళ్లిపోను' అని పేర్కొన్నాడు ధనుష్. తనకంటే ముందున్న వారిపై పైచేయి సాధించాలనే ఆలోచన తనకెప్పుడూ ఉండని, అసలు ఆ తరహా పోటీయే సరికాదని చెప్పాడు. చిత్రసీమలో పోటీ అన్నదే అవసరం లేదని తెలిపారు. పోటీ అంటే కారణముంటుంది. సినిమాల్లో మన పని మనం బాగా చేయగలిగితే అప్పుడు వృత్తి పరంగా విజేతలైనట్టేనన్నారు. 'నాకు నేనే పోటీ అని నమ్ముతాను. ఎందుకంటే ఇప్పుడు చేసిన సినిమా కంటే తర్వాత చిత్రం ఇంకా మెరుగ్గా చేయాలని అనుకుంటాను" అని చెప్పాడు ధనుష్

మామను మించేసిన అల్లుడు

ఈనెల 11వ తేదీన విడుదల కానున్న ధనుష్ చిత్రం 'వీఐపీ2' మలేషియాలో స్క్రీన్ల పరంగా సరికొత్త రికార్డు సృష్టించింది. అక్కడ మొత్తం 550 స్క్రీన్లపై 'వీఐపీ 2'ను ప్రదర్శిస్తున్నట్లు చిత్ర నిర్మాత కలైపులి ఎస్ థాను ట్వీట్ చేశారు. ఇది గత ఏడాది విడుదలైన రజనీకాంత్ 'కబాలి' స్క్రీన్ల సంఖ్య కన్నా ఎక్కువ కావడం విశేషం. మలేషియాలో 'కబాలి'ని 480 స్క్రీన్లపై ప్రదర్శించారు.


ధనుష్

బహుభాషా నటి!

రాశీ ఖన్నా...పరిచయం అక్కర్లేని పేరు. తెలుగు చిత్రసీమలో స్టార్ హీరోయిన్ తరహాలోనే వెలుగొందుతోంది. ఈ మధ్య మాత్రం అవకాశాలు కాస్తా తగ్గాయి...అని తన అభిమానులు కలవరపడ్డారట. దానిపై రాశీ ఖన్నా స్పందించింది. అవకాశాలు తగ్గడమేమీ లేదు కానీ దక్షిణాది భాషలు అన్నింటిలోనూ నటించాలని కోరిక ఉంది. అందుకే తమిళ్, కన్నడ, మలయాళంలో సినిమాలను చేసేందుకు ప్రిపేర్ అవుతున్నా అని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అనుష్క, సమంత, కాజల్ అగర్వాల్‌ల వంటి ప్రముఖ కథానాయికల బాటలో రాశీఖన్నా పయనం మొదలెట్టిందన్న మాట. తొలుత బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసి ఆ తరువాత తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించింది. ఇప్పుడు తమిళ్‌లో సినిమాలు చేస్తోంది. సిద్దార్థ్‌తో 'సైతాన్ కా బచ్చా', నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఇమైకా నోడిగళ్' చిత్రంలో అధర్వకు జంటగానూ నటిస్తోంది. వీటిలో 'ఇమైకా నోడిగళ్' చిత్రం వచ్చే నెలలో తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. ఇవి కాకుండా మలయాళంలో మరో సినిమా చేస్తోంది. మోహన్ లాల్ కథానాయకుడిగా చేస్తున్న 'విలన్'లో నటిస్తోంది. అదే భాషలో మరో సినిమా కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మొత్తానికి బహుభాషా నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని రాశీ ఖన్నా ఆలోచన.

అప్పుడే కామెంట్స్ ఆగాయ్

బాలీవుడ్ యాక్షన్ హీరో అక్షయ్ కుమార్ గత ఏడాది మూడు సినిమాలు చేశాడు. అందులో 'ఎయిర్‌లిఫ్ట్', 'రుస్తోమ్', 'హౌస్‌ఫుల్' చిత్రాలు ఉన్నాయి. వీటిల్లో 'హౌస్‌ఫుల్' ఒకే అనిపించింది. మిగిలిన రెండూ బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించాయి. అందుకే 2016ను అక్షయ్ కుమార్‌కు బాగా కలిసొచ్చిందని సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ విధంగా ప్రతీ ఏటా ఆయన చేసిన సినిమాలు విజయం సాధిస్తున్నాయి, బాక్సాఫీస్ వద్ద రికార్డు మోగిస్తున్నాయి కానీ తనకు మాత్రం ఎటువంటి అవార్డులు తెచ్చిపెట్టడం లేదు. తన 25ఏళ్ల సినీ కెరీర్‌లో పురస్కారాలు రాకపోవడం విశేషం. అప్పటికే తన భార్య రాజేష్ ఖన్నా తనయ ట్వింకిల్ ఖన్నా తన తల్లితరఫు కుటుంబ సభ్యులంతా చాలా అవార్డులు పొందారు. కానీ అక్షయ్‌కు ఒక్క అవార్డు రాకపోవడంతో కామెంట్స్ చేసేవారట. దాని వల్ల అక్షయ్ ఇబ్బంది పడినట్టుగానే ఉన్నాడు. అందుకే ఆ విషయాన్ని వెల్లడించాడు. ఈ ఏడాది ప్రకటించిన 64వ జాతీయ అవార్డుల జాబితాలో అక్షయ్ పేరు కూడా ఉంది. అదీ కూడా ఉత్తమ నటుడిగా అవార్డు వరించింది. 'రుస్తోమ్' చిత్రంలో అతని నటనకు ఈ పురస్కారం లభించింది. ఇక అప్పటి నుంచి అక్షయ్‌పై కామెంట్స్ చేయడం ఆగిందట. ఈ విషయాన్ని జైపూర్ జరిగిన ఎడ్యూకేషన్ ఫెస్టివల్‌లో ఈ యాక్షన్ హీరోనే స్వయంగా ఆదివారం వెల్లడించాడు. " మా వాళ్లందరికీ చాలా అవార్డులు వచ్చాయి కానీ మీకు మాత్రం ఒక్క అవార్డూ రాలేదని నా భార్య నన్ను కామెంట్ చేస్తూ ఉండేది. జాతీయ అవార్డు వచ్చిన తర్వాత మాత్రమే ఆ కామెంట్స్ ఆగాయి' అని పేర్కొన్నాడు అక్షయ్. గతంలో కూడా 'ఎయిర్‌లిఫ్ట్' సినిమా సక్సెస్ సాధించినప్పుడు విలేకరులతో అక్షయ్ మాట్లాడుతూ అవార్డు విషయం గురించి చెప్పారు. ' నాకు అవార్డు రాలేదన్న దానిపై వివిధ రకాలుగా చర్చించుకోవడం నేను 25ఏళ్లుగా వింటూనే ఉన్నాను. అది కొత్త కాదు. కొందరు అయితే వివాదాస్పదం కూడా చేశారు. చాలా మందికి అవార్డులు వస్తున్నాయి కానీ నాకు మాత్రం రావడం లేదని అనుకునేవారు' అని అన్నారు. మొత్తానికి సినీ ఇండస్ట్రీలో 26 తర్వాత ఉత్తమ నటుడు అవార్డు వచ్చిందని చెప్పారు. ఈ హీరో ప్రస్తుతం టాయిలెట్ : ఎక్తా ప్రేమ్ కథ' సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. భూమి పండ్నేకర్ కథానాయిక. దీంతో పాటు రజనీకాంత్‌తో '2.0'లో ప్రతినాయకుడిగా చేశాడు. ఈ రెండు చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి.


అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా

అలా అయితే హోస్ట్‌గా చేయను

-కమల్ హాసన్




కమల్‌హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్' రియాలిటీ షో వివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయనే బిగ్‌బాస్ నుంచి తప్పుకొంటానని హెచ్చరించారు. షోలో నటి ఓవియా ఆత్మహత్యాయత్నం చేసిందన్న సంఘటన కలకలం సృష్టించింది. దీనిపై కమల్ మీడియా ద్వారా స్పందిస్తూ 'ఇలాంటి కఠిన టాస్కులు నిర్వహించడంపై మండిపడ్డారు. పోటీలో పాల్గొనేవారు మానసిక వికలాంగులుగా నటించాలని 'బిగ్‌బాస్ బృందం' టాస్క్ ఇచ్చింది. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరిగింది. ఇలాంటి టాస్కులు చేసి వికలాంగుల మనోభావాలను దెబ్బతీయకండి. ఈ విషయంలో నేను సీరియస్‌గా ఉన్నాను. ఇలాంటి టాస్కులు మళ్లీ కంటెస్టెంట్లకు ఇవ్వకూడదని బిగ్‌బాస్ బృందాన్ని కోరుతున్నా. ఇలాంటివి మళ్లీ జరిగితే బిగ్‌బాస్ నుంచి తప్పుకొంటాను. సినిమాల్లో వికలాంగుల పాత్రలు పోషిస్తున్నారు కదా అని మీరు నన్ను అడగొచ్చు. నిజమే. కానీ అలాంటి పాత్రలు నా సినిమాల్లో కామెడీగా చూపించం. నా సినిమాలో వికలాంగుడి పాత్ర ఉంటే అతన్నే హీరోగా పెట్టి సినిమా తీస్తాను' అని మీడియా ద్వారా వెల్లడించారు కమల్.

బాలయ్య కారు స్టంట్

బాలకృష్ణ, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా 'పైసా వసూల్'. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమాలో బాలయ్య సరసన శ్రియ, ముస్కాన్ సేథిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమా కోసం బాలయ్య కొన్ని రిస్కీ స్టంట్స్ చేశారని గతంలో పూరీ ప్రకటించాడు. బాలయ్య స్వయంగా చేసిన కార్ స్టంట్ కు సంబంధించిన మేకింగ్ వీడియోను ఆదివారం రిలీజ్ చేశారు. శ్రియతో పాటు కారులో వెళ్తున్న బాలయ్య జీర్ కట్ చేసి యూనిట్ సభ్యులను ఆశ్చర్యపరిచాడు. అందుకే స్టంట్ ను చూపిస్తూ స్పెషల్ టీజర్ రిలీజ్ చేసిన యూనిట్ 'హీ నీడ్స్ నో స్టంట్ డ్రైవర్' (ఇతనికి స్టంట్ డ్రైవర్ అవసరం లేదు) అంటూ టీజర్‌ను ముగించారు. ఈ సినిమా భవ్య క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈనెల 17న ఆడియో విడుదల కానుంది.





బీమా పాలసీ ఎప్పుడు అవసరం?

జీవితబీమా పథకం అంటే జీవితానికి ఆపదకాలంలో భరోసాను ఇచ్చేదని అర్థం. మిగతా పెట్టుబడి పథకాలతో పోలిస్తే బీమా పథకాలు భిన్నమైనవి. అనుకోని పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చే ఒక ప్రత్యేక రక్షణ పథకం ఇది. కేవలం బీమానే కాకుండా పొదుపు, మదుపులకూ అవకాశాన్ని ఇస్తుంది. అయితే, మార్కెట్లో అనేకరకాల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏది మనకు సరిపోతుందో నిర్ణయించుకోవడం.. ఎంపిక చేసుకోవడం ముఖ్యం. అందుకే ఎవరు? ఎలాంటి బీమా పథకాలు ఎంచుకోవాలి? అనే విషయాలు ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం!!

అనుకోని సంఘటనలు ఎదురై.. కుటుంబంలో ఆర్జించే వ్యక్తి అకస్మాత్తుగా దూరమైనప్పుడు.. అతనిపై ఆధారపడిన వారికి ఆర్థిక రక్షణ బీమా పాలసీల ద్వారా లభిస్తుంది. కాబట్టి, బీమా పాలసీలు తీసుకునేప్పుడు పాలసీదారుడు అతనికి ఉండే లక్ష్యాలు, ఉన్న బాధ్యతలను దృష్టిలో పెట్టుకోవాలి. దాన్నిబట్టి ఏరకం పాలసీని ఎంచుకోవాలో నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు ఇప్పుడిప్పుడే సంపాదిస్తున్న 20 ఏళ్ల వ్యక్తికి ఉండే అవసరాలతో పోలిస్తే.. వివాహమై, పిల్లలు ఉన్న 40 ఏళ్ల వ్యక్తి అవసరాలు భిన్నంగా ఉంటాయి. మన అవసరం, బాధ్యతలు, లక్ష్యాలు.. ఆధారంగా ఏ తరహా పాలసీలను.. ఎప్పుడు తీసుకోవాలన్నది తెలుసుకోవాలి.

బీమా.. ఓ బాధ్యత



కుటుంబంలో ఆర్జించే వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. అందుకే, సంపాదించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి పేరు మీద ఓ టర్మ్ పాలసీ ఉండేలా చూసుకోవాలి. సంపాదన ప్రారంభమైన వెంటనే దీన్ని తీసుకోవడం మేలు. మరి పాలసీ మొత్తం ఎంతుండాలన్నదీ ముఖ్యమే. మీ ప్రస్తుత ఆదాయం.. భవిష్యత్తులో మీరు ఎన్నాళ్లపాటు పనిచేస్తారు.. అనేదానిపై పాలసీ మొత్తాన్ని నిర్ణయించుకోవాలి. చిన్న వయసులోనే పాలసీ తీసుకోవడం ద్వారా ప్రీమియం ధరలు చాలా తక్కువగా ఉంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ప్రీమియం కూడా పెరుగుతూ ఉంటుంది. కొన్ని టర్మ్ పాలసీల్లో నిర్ణీత సమయం తర్వాత పాలసీ విలువ పెరుగుతూ ఉంటుంది. ఇలాంటి వాటిని ఎంచుకున్నప్పుడు.. జీవితంలో మారుతున్న దశలను బట్టి, మరో కొత్త పాలసీని తీసుకోవాల్సిన అవసరాన్ని తప్పిస్తుంది. టర్మ్ పాలసీలతో పాటు, క్రిటికల్ ఇల్‌నెస్, డిజేబిలిటీ బీమా పాలసీలను తీసుకోవడం కూడా మర్చిపోవద్దు. ఎందుకంటే పాలసీదారుడు మరణించినప్పుడే కాదు.. అతనికి అనుకోని వ్యాధులు, ప్రమాదాల వల్ల సంపాదన ఆగిపోయినప్పుడూ ఆర్థిక రక్షణ అవసరం. అందువల్ల పూర్తి టర్మ్ పాలసీతో ప్రత్యేకంగా వీటినీ తీసుకోవడం మర్చిపోకండి.

పిల్లల చదువుకు.. బీమా!



ప్రతి తల్లిదండ్రులూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనే లక్ష్యంతో ఉంటారు. చాలామంది తమ ఆర్థిక ప్రణాళికల్లో దీన్ని కీలకాంశంగా పరిగణిస్తారు. ఈ ప్రధానమైన ఆర్థిక బాధ్యతలను నిర్వర్తించేందుకు అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది కదా! ఇలా పిల్లల కోసం ప్రత్యేకంగా మదుపు చేయాలనుకునే వారికి పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలు మంచి ప్రయోజనాలు అందిస్తాయి. ఇందులో ఇతర పెట్టుబడి, బీమా పథకాల్లో లేని అదనపు వెసులుబాట్లూ ఉంటాయి. ఏదైనా అనుకోని సంఘటన జరిగి, పాలసీదారుడు దూరమైనప్పుడు.. పిల్లల పాలసీలు అతని బాధ్యతను తీసుకుంటాయి. పాలసీకి చెల్లించాల్సిన ప్రీమియాలను బీమా సంస్థ చూసుకుంటుంది. ఈ పాలసీలు ఎంచుకోవాలని అనుకున్నప్పుడు.. పిల్లలు చిన్న వయసులోనే ఈ పాలసీలను ఎంచుకోవడం మేలు. అప్పుడు పిల్లలు పెరుగుతున్న కొద్దీ.. వారి కోసం చేసిన పెట్టుబడుల్లోనూ వృద్ధి కనిపిస్తుంది. పాలసీ వ్యవధి తీరే నాటికి పిల్లల చదువులు, ఇతర అవసరాలకు అవసరమైన ఖర్చులకు డబ్బు చేతికి అందుతుంది.

పదవీ విరమణ తర్వాత

ఉద్యోగ జీవితానంతరం ఎవరిపైనా ఆధారపడకుండా ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండటమూ ఎంతో ముఖ్యం. అయితే, ఇతర బాధ్యతలను నిర్వర్తించే లక్ష్యంతో చాలామంది దీన్ని విస్మరిస్తుంటారు. ఇది ఏమాత్రం సరికాదు. సంపాదన ప్రారంభించినప్పటి నుంచే క్రమశిక్షణతో పదవీ విరమణ, తదనంతర జీవితానికి అవసరమైన నిధి కోసం మదుపు చేయాలి. దీనికోసం మార్కెట్లో అనేక పొదుపు/ పింఛను పాలసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎంచుకోవడం ద్వారా పదవీ విరమణ తర్వాత ఆరోగ్య ఖర్చులకు, నెలవారీ ఖర్చులకు అవసరమైన పెద్ద మొత్తంలో నిధి చేతిలో ఉంటుంది. ఇది ఎంత మొత్తం అవసరం అనేది ముందే నిర్ణయించుకొని, దాన్నిబట్టి ప్రీమియం చెల్లించాలి.

పదవీ విరమణ తర్వాత వచ్చిన మొత్తంతో, ఈ పాలసీల ద్వారా అందిన డబ్బును కలిపి ఎలా వినియోగించు కుంటారన్నదీ ముఖ్యమే. కొన్ని బీమా పథకాలు.. పదవీవిరమణ అనంతరం ప్రయోజనాలు అందిస్తాయి. అంటే పాలసీదారుడికి జీవితాంతం వరకూ.. ఆ తర్వాత అతని భాగస్వామికీ పింఛను ఇస్తాయి. ★

గుండెకు బరోసా క్యాన్సర్‌కు ఆసరాగా...!!




మనలో చాలామంది సంపాదన గురించి ఆలోచిస్తూ.. తమ ఆరోగ్య విషయాలను పట్టించుకోరు. డబ్బే లక్ష్యంగా సాగే ప్రయాణంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు అనివార్యంగా వచ్చేస్తుంటాయి. ఫలితంగా.. ఆరోగ్య సమస్యలు వెంటాడతాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధుల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దాదాపు 50 శాతం మరణాలు ఈ రెండు వ్యాధులతోనే సంభవిస్తున్నాయి. అందుకే తీవ్రమైన వ్యాధులకు గురైనప్పుడు వైద్య ఖర్చులకు చింత లేకుండా బీమా పాలసీలు తోడుగా ఉండాల్సిన అవసరం ఉంది.

నివేదికల ప్రకారం మన దేశంలో అత్యధిక గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. ఏటా దాదాపు రెండు లక్షలకు మించి, గుండె శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఇక క్యాన్సర్ కూడా మన దేశంలో తీవ్రంగానే ప్రభావం చూపిస్తోంది. 2020 నాటికి క్యాన్సర్ కేసులు 25 శాతం పెరిగే ప్రమాదం ఉందని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి.

అయితే వైద్యరంగంలో వచ్చిన అభివృద్ధి కారణంగా ఇప్పుడు అత్యవసర వ్యాధుల్ని పూర్తిస్థాయిలో నయం చేయడమూ సాధ్యమే. అయితే సరైన సమయానికి సరైన వైద్యం అందడమే ముఖ్యం. గుండె, క్యాన్సర్ వంటి రోగాలకు సంబంధించిన వైద్యం ఖరీదైనదే. ఈ రెండు వ్యాధులనూ తీవ్ర వ్యాధులుగానే పరిగణించాలి. పైగా వీటికి దీర్ఘకాలం వైద్య చికిత్స, మందులు వాడాలి. తరచూ ఆసుపత్రికి వెళ్లాలి. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందన్నదీ కచ్చితంగా చెప్పడమూ కష్టమే.

అవగాహన ఉండాలి

ఒకసారి ఇలాంటి వ్యాధులు సోకితే చికిత్స కోసం ఎంత ఖర్చవుతుందనేది ప్రతి కుటుంబానికీ తెలిసి ఉండాలి. ఆర్జించే ప్రతి వ్యక్తీ తాను దీనికి సిద్ధంగా ఉన్నానా అనేది పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. గుండెపోటు వచ్చినప్పుడు ఆసుపత్రిలో చేరితే.. బైపాస్‌లాంటివి అవసరం అయినప్పుడు దాదాపు రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుంది. క్యాన్సర్ బారినపడ్డప్పుడు కీమోథెరపీ కోసం దాదాపు రూ.15 లక్షల వరకూ కావాల్సి వస్తుంది. చేరిన ఆసుపత్రి, కీమోథెరపీలను బట్టి, ఇంతకన్నా అధికంగానే అవసరపడొచ్చు. కుటుంబంలో ఆర్జించే వ్యక్తికే ఇలాంటి వ్యాధులు వస్తే.. పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

ఆరోగ్య బీమాతోపాటు

ప్రతి వ్యక్తికీ ఆరోగ్య బీమా ఉండాలనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే, సాధారణంగా ఒక వ్యక్తి దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ మాత్రమే ఆరోగ్య బీమా తీసుకుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఏమాత్రం సరిపోదనే చెప్పుకోవాలి. ముఖ్యంగా గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చినప్పుడు అయ్యే ఖర్చుకూ.. ఉన్న బీమాకూ ఏమాత్రం పొంతన ఉండదు. అందులోనూ ఆరోగ్య బీమా పాలసీ ఆసుపత్రిలో చేరినప్పుడు అయ్యే ఖర్చులకు మాత్రమే పరిహారం ఇస్తుంది. దీర్ఘకాలిక అవసరాలకు సరిపోయేలా ఆర్థిక భద్రత లభించదు. ఈ నేపథ్యంలోనే గుండె, క్యాన్సర్ వ్యాధులకు ప్రత్యేక పాలసీల అవసరం పెరుగుతోంది. ఇవి అందుబాటు ధరల్లోనే లభిస్తాయి. ఉదాహరణకు 30 ఏళ్ల పొగతాగని వ్యక్తి ఏడాదికి రూ.1200 వరకూ చెల్లిస్తే చాలు.. రూ.10 లక్షల హార్ట్ కవర్ తీసుకోవచ్చు. అదే క్యాన్సర్ కవర్ అయితే రూ.20 లక్షల వరకూ లభిస్తుంది.

ప్రస్తుతం కొన్ని జీవిత బీమా సంస్థలు గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించగానే పరిహారం అందించేలా పాలసీలను అందిస్తున్నాయి. దీనివల్ల పాలసీదారుడు తనకు ఇష్టం వచ్చినచోట మంచి చికిత్స పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడులు, పిల్లల చదువులకు దాచుకున్న మొత్తం, ఇంటి కొనుగోలు, పదవీ విరమణకు దాచుకున్న మొత్తాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవచ్చు.



- వి. చైతన్య



గుర్తించండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలు వాటి నీడలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఒకదానికొకటి కలపండి!



పొడుపు కథ



ఆకులా ఉంటా కానీ
పువ్వునే మరి నేనెవరినీ?

జోక్ :

టీచర్ : పిల్లలు మిమ్మల్ని పది ప్రశ్నలు అడగనా లేక ఒకటే కష్టమైన ప్రశ్న అడగాలా?

పిల్లలు : కష్టమైన ప్రశ్న ఒక్కటి అడగండి టీచర్

టీచర్ : రోజులో ముందు ఏది వస్తుంది పగలా, రాత్రా?

పిల్లలు : పగలు ..!

టీచర్ : రైట్ ..! ఎలా చెప్పగలిగావ్?

పిల్లలు : సారీ టీచర్ మీరు ఒకే ప్రశ్న అడుగుతా అన్నారుగా?!.

టీచర్ : ఆ..!!??

వజ్రం ఎందుకు మెరుస్తుంది?



వజ్రాలు సృష్టిలో చాలా అరుదుగా లభిస్తాయి. అందుకే వజ్రానికి అంత విలువ. అంతేకాకుండా అన్ని పదార్థాలలోకి వజ్రం చాలా దృఢమైనది. అన్నిటికి మించి వజ్రం ఎంతో అందంగా, కాంతివంతంగా మెరిసి! ఏ రకమైన ప్రకృతి ప్రభావాలకూ లోనుకాక ఎంతకాలమైనా నిలిచిఉండేది అవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులు ఆభరణాలతో వజ్రాన్ని వాడుతూ వచ్చారు. మొట్ట మొదటి వజ్రాన్ని 1430వ సంవత్సరంలో 'ఆగెస్ సోరెల్' అనే యువతి ధరించింది. ఆ తరువాత వజ్రాల వాడకం బాగా పెరిగింది. వజ్రం అంటే కార్బన్ పరమాణువుల సమ్మేళనం వల్ల అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత వద్ద ఏర్పడే స్ఫటికం. ఇది ముడి రూపంలో దొరికినప్పుడు కాంతి విహీనంగా, గుర్తు పట్టలేనంతగా ఉంటుంది. వజ్రానికి సానపెట్టి ఎన్నో ముఖాలు కలుగచేసినప్పుడు కాంతి పెరుగుతూ ఉంటుంది. ఇక చిన్న వజ్రానికి కనీసం 58 నుంచి 70 ముఖాల వరకూ చెక్కవచ్చు. ఈ చెక్కే ముఖాల సంఖ్య, వజ్రం యొక్క రంగులేని తనం, భారాన్ని బట్టి వజ్రం నాణ్యత నిర్ణయిస్తారు. వజ్రానికి అత్యధిక వక్రీభవన గుణకం 2.5 ఉండటం వలన దీనిపై కాంతికిరణం పతనం అయినప్పుడు 'సంపూర్ణ అంతర పరావర్తనం' చెంది కాంతిలోన బంధింపబడుతుంది. దీని కారణంగా వజ్రం మెరిసినట్లనిపిస్తుంది. ★



మనదే సిరీస్

కొలంబో : శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో భారత క్రికెట్ జట్టు ఇన్నింగ్స్, 53 పరుగులతో ఘన విజయం సాధించింది. ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 386 పరుగులకు ఆలౌటయింది. రెండు వికెట్ల నష్టానికి 209 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం ఆటను ప్రారంభించిన శ్రీలంకను రవీంద్ర జడేజా చావుదెబ్బ తీశాడు. రవిచంద్రన్ అశ్విన్, హార్ధిక్ పాండ్య, ఉమేష్ యాదవ్‌లు కూడా చక్కగా రాణించడంతో శ్రీలంక బ్యాట్స్‌మెన్లు నిలబడలేకపోయారు. శనివారం చూపిన పోరాటాన్ని ఆదివారం శ్రీలంక బ్యాట్స్‌మెన్లు కొనసాగిం చలేకపోయారు. శనివారం ఆటలో కరుణరత్నే, మెండిస్ (110) రాణించిన సంగతి తెలిసిందే. 92 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఆదివారం ఆటను కొనసాగించిన కరుణరత్నే సెంచరీ (141) పూర్తి చేసుకున్నాడు. టెస్టులో 6వ సెంచరీ చేసిన తరువాత కరుణ రత్నే ఐదో వికెట్‌గా జట్టు స్కోరు 310 వద్ద అవుటయ్యాడు. 307 బంతులు ఎదుర్కొన్న కరుణ రత్నే 16 ఫోర్లతో 141 పరుగులు చేశాడు. కరుణ రత్నే, మెండిస్ తరువాత శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో మాథ్యుస్ (36), దిక్‌వాల్ల (31) మాత్రమే ఆకట్టుకున్నారు. భారత బౌలర్లలో జడేజా 5 వికెట్లు సాధించగా, అశ్విన్, పాండ్యలకు రెండేసి వికెట్లు, ఉమేష్‌కు ఒక్క వికెట్ దక్కింది. మొత్తంగా 10 వికెట్లు తీయడంతో పాటు, అర్ధ సెంచరీ కూడా చేసిన రవీంద్ర జడేజాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఏడాది కాలంలో టెస్టుల్లో జడేజాకు ఇది నాలుగో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు.



- రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్, 53 పరుగులతో ఘన విజయం
- వరసగా ఎనిమిదో సిరీస్ గెలుచుకున్న టీమిండియా
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జడేజా

కాగా, ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. అలాగే భారత్‌కు ఇది వరసగా ఎనిమిదో టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 2015లో శ్రీలంకపైనే తొ లి విజయాన్ని భారత్ సాధించింది. అత్యధిక వరస టెస్టు సిరీస్ విజయాలు (9)ను సమం చేయడానికి భారత్ ఇంకా ఒక విజయం దూరంలో మాత్రమే వుంది. 2005-2008లో ఆస్ట్రేలియా వరసగా 9 టెస్టు సిరీస్ విజయాలు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అలాగే ఇంగ్లాండ్ 1884-1892 మధ్య కాలంలో 8 వరస టెస్టు సిరీస్ విజయాలు సాధించింది.

మూడో టెస్టుకు జడేజా దూరం

ఈ నెల 12న పల్లేకలేలో భారత-శ్రీలంక మధ్య ప్రారంభం కానున్న మూడో టెస్టుకు రవీంద్ర జడేజా దూరంగా వుండనున్నాడు.

రెండో టెస్టులో నిబంధనలను అతిక్రమించాడనే కారణంతో అధికారులు మూడో టెస్టుకు అతనిపై వేటు వేశారు. శనివారం ఆటలో 58వ ఓవర్‌లో జడేజా విసిరిన బంతి శ్రీలంక బ్యాట్స్‌మెన్ కరుణరత్నేకు తగులుతూ వెళ్లింది. కరుణ రత్నే క్రీజులో వున్నప్పుడు జడేజా అనవసరంగా అతడిపైకి బంతి విసిరాడు. నేరాన్ని జడేజా అంగీకరించాడు. ఇది లెవల్-2 తప్పిదం కావడంతో జడేజా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత కూడా విధించారు. గత ఆరు నెలల కాలం నుంచి జడేజా డిమెరిట్ పాయింట్లు 24కు చేరుకున్నాయి. దీంతో అతనిపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధించారు.

నేనే గ్రేట్ : బోల్ట్

లండన్ : చివరి రేసులో కాంస్య పతకం సాధించినంత మాత్రాన తన గొప్పతనం ఏమీ తగ్గిపోదని ఉసేన్ బోల్ట్ వ్యాఖ్యానించాడు. తన కెరీర్ చివరి 100 మీటర్ల పరుగులో బోల్ట్ మూడో స్థానంలో నిలిచాడు. గాట్లిన్‌కు స్వర్ణం దక్కింది. ఈ నేపథ్యంలో బోల్ట్ మాట్లాడుతూ 'ప్రపంచ గొప్ప అథ్లెట్లలో నేను ఒక్కడ్ని అని ఎప్పుడో నిరూపించుకున్నా. లండన్ వ్యక్తిగత పరుగులో కాంస్య పతకంతో సరిపెట్టుకోవడం నా ఆధిపత్యాన్ని ఏమీ తగ్గించదు. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చా. కాంస్యం నన్ను నిరూత్సాహానికి గురి చేయడం లేదు. నాపై కాస్త ఒత్తిడి పడింది. సరైన ఆరంభాన్ని ఇవ్వకపోతే నేను వెనుకబడిపోతాను అని ఒత్తిడికి లోనయ్యా. నేను రేస్‌లో వెనుకబడటానికి కారణం కూడా అదే. కొద్ది తేడాలో ప్రథమ స్థానాన్ని కొల్పోయా' అని బోల్ట్ అన్నాడు.



ఉసేన్ బోల్ట్‌కు పాదాభివందనం చేస్తున్న స్వర్ణ పతక విజే. గాట్లిన్

సెమీస్‌కు నిర్మలా షెరన్



లండన్: ఇక్కడ జరుగు తున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల 400 మీటర్ల లో భారత్‌కు చెందిన నిర్మల షరోన్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. మిగిలిన విభాగాల్లో భారత్‌కు నిరాశే ఎదురయింది. 400 మీటర్ల తొలి రౌండ్ పోటీలో 22 ఏళ్ల నిర్మల 52.01 సెకన్లలో లక్ష్యాన్ని చేరి నాలుగో స్థానంలో నిలిచింది. సోమవారం జరిగే సెమీస్‌లో రాణించి ఫైనల్‌కు చేరుకోవాలని హర్యానాకు చెందిన నిర్మల భావిస్తోంది. మహిళల హెప్టాత్లోన్‌లో స్వప్న బర్మన్ 27వ స్థానంలో నిలిచింది. పురుషుల మారథాన్‌లో టి.గోపి 28వ స్థానంలో నిలిచాడు. 110 మీ హర్డిల్స్‌లో సిద్ధాంత తింగలయ ఏడో స్థానంలో నిలిచాడు.

పతకం వద్దు.. శాంతే ముద్దు



న్యూఢిల్లీ : తనకు టైటిల్స్ వద్దు.. ప్రపంచ శాంతే ముఖ్యమని భారత బాక్సర్ విజేందర్ సింగ్ వ్యాఖ్యానించాడు. శనివారం రాత్రి ముంబయిలో జరిగిన బౌట్‌లో చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైటయాలిని ఓడించి ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను విజేందర్ సాధించిన సంగతి తెలిసిందే. అయితే డోక్లామ్ సరిహద్దులో నెలకొన్న ప్రతిష్టంభన దృష్ట్యా తన టైటిల్‌ను వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమని విజేందర్ తాజాగా ప్రకటించాడు. 'డోక్లామ్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ సామరస్యపూర్వక వాతావరణం నెలకొనాలని ఆశిస్తున్నాను. ప్రశాంత వాతావరణం నెలకొనాలని ఈ సందేశం ఇస్తున్నాను. నా టైటిల్‌ను ఇచ్చేందుకు సిద్ధం' అని విజేందర్ పేర్కొన్నాడు.

'టాప్'లో షపత్ భరద్వాజ్

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్) పథకానికి 15 సంవత్సరాల షూటర్ షపత్ భరద్వాజ్ ఎంపికయ్యాడు. దీంతో ఈ పథకానికి ఎంపికమైన అత్యంత పిన్నవయసు అథ్లెట్‌గా షపత్ నిలిచాడు. మీరట్‌కు చెందిన షపత్ ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌ల్లో ఢిల్లీ, మెక్సికోల్లో జరిగిన ప్రపంచకప్‌ల్లో షపత్ 10, 12 స్థానాల్లో నిలిచాడు. మేలోజరిగిన ప్రపంచప్‌లో ఫైనల్లో ఆరవ స్థానంలో నిలిచాడు. జులైలో ఫిన్‌లాండ్‌లో జరిగిన జూనియర్ షాట్‌గన్ కప్‌లో షపత్ స్వర్ణం సాధించాడు. అభినవ్ బింద్రా నేతృత్వంలోని కమిటీ టాప్ పథకానికి అథ్లెట్లను ఎంపిక చేస్తున్న సంగతి తెలిసిందే.

బెంగాల్, పాట్నా భారీ విజయాలు

- చిత్తుగా ఓడిన యుపి యోధా
- పోరాడి ఓడిన బెంగళూరు బుల్స్

నాగ్‌పూర్ : ప్రొ కబడ్డీ లీగ్ 2017లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో యుపి యోధపై బెంగాల్ వారియర్స్ 40-20 పాయింట్లతో ఘన విజయం సాధించింది. బెంగాల్‌కు వరసగా ఇది రెండో గెలుపు. ఈ మ్యాచ్‌లో ప్రారంభం నుంచి యుపి యోధాపై బెంగాల్ వారియర్స్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి బెంగాల్ 22-8 పాయింట్లతో ముందంజలో వుందంటే ఆ జట్టు ఆటగాళ్ల ప్రదర్శన ఏ స్థాయిలో వుందో వుహించుకోవచ్చు. తరువాత కూడా బెంగాల్ వారియర్స్ జోరు అదే స్థాయిలో కొనసాగింది. రెండో అర్ధ భాగంలో యుపి యోధా ఆటగాళ్లు కొన్ని పాయింట్లు సాధించినా బెంగాల్ దూకుడును అడ్డుకోలేకపోయారు. బెంగాల్ జట్టులో వినోద్ కుమార్ 8, జాన్ కున్ లీ 7, మణిందర్ సింగ్ 6 పాయింట్లు సాధించారు. యుపి యోధా జట్టులో సురేందర్ సింగ్ అత్యధికంగా 6 పాయింట్లు సాధించాడు.

పాట్నా పరైట్స్ గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మరొక మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌పై పాట్నా పరైట్స్ 46-32 పాయింట్లతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో పాట్నాకు ఇది మూడో గెలుపు. ఆదివారం మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు బుల్స్ పాయింట్ల ఖాతా ప్రారంభించింది. ప్రారంభంలో బెంగళూరుదే అధిక్యం. అయితే తరువాత కొద్ది సేపటికే పరిస్థితి మారిపోయింది. పాట్నా ఆటగాళ్లు పాయింట్లతో అదరగొట్టారు. దీంతో తొలి అర్ధ భాగం ముగిసే సరికి పాట్నా ఏకంగా 23-11 పాయింట్లతో ఆధిక్యంలో వుంది. రెండో అర్ధ భాగంలోనూ ఇదే జోరు సాగింది. దీంతో ఒక దశలో పాట్నా ఆధిక్యం 40-26 పాయింట్లుగా వుంది. అయితే మ్యాచ్ మరో 7 నిమిషాలో ముగుస్తుందనగా బెంగళురు బుల్స్ ఆటగాళ్లు పాయింట్లు సాధించారు. దీంతో ఆ జట్టు ఓటమి అంతరం తగ్గింది. పాట్నా పైరేట్స్ కెప్టెన్ పర్దీవ్ నర్వాల్ 15 రైట్ పాయింట్లు సాధించాడు.



సోమవారం ప్రొ కబడ్డీ లీగ్‌లో విశ్రాంతి దినం కాబట్టి నేడు ఎలాంటి మ్యాచ్‌లు జరగవు

16న ప్రభుత్వానికి సమ్మె నోటీసు

- క్రమబద్ధీకరణపై కాలయాపన
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తీర్మానం
- సంపూర్ణ మద్దతు తెలిపిన
- ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు రంగంలో కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, పిఎస్‌రేటు రద్దు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల పరిష్కారానికై ఈ నెల 16న ప్రభుత్వానికి సమ్మె నోటిసు ఇవ్వాలని నిర్ణయించారు. విద్యుత్ రంగంలోని కాంట్రాక్టు ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సమావేశానికి హాజరైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు హామీనిచ్చారు. తెలంగాణలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల్ని ఆ ప్రభుత్వం విలీనం చేసిందని, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రప్రభుత్వాలు క్రమబద్ధీకరణ చేశాయని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఎందుకు చేయదని ప్రశ్నించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మూడేళ్లు కాలయాపన చేసిన కమిటీ, కోర్టు తీర్పులు అడ్డంకులుగా ఉన్నాయనే సాకుతో క్రమబద్ధీకరణ కుదరదంటూ కార్మికుల్ని దగా చేసిందని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగికి చెల్లించే కనీస మూల వేతనం, ఇతర సౌకర్యాలను కాంట్రాక్టు ఉద్యోగికి కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎం బాలకాశి, కెఎన్‌వి సీతారం, సుబ్బిరెడ్డి, ఎం శ్రీనివాస్, ఏసోబులు అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సమావేశంలో ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, ఇతర విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘాల నాయకులు కాశి మధుబాబు, వాసు, సాంబిరెడ్డి, బివి సురేష్, శివారెడ్డి, ఎండి కలీలుల్ల, మల్లిఖార్జున రావు, వెంకట అప్పారావు, బాబి, ముస్తాఫ, రామాంజనేయులు, శ్రీనివాసులు, రాయప్ప, సురేష్ తదితర 20 సంఘాల నాయకులు తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబ్రహ్మచారి, కోశాధికారి ఎల్ రాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

సమావేశంలో తీర్మానాలు

కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరణ లేదా విలీనం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులందర్నీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లకు పీస్‌రేటు రద్దుచేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించి, కుటుంబ సభ్యులకు సంస్థలో ఉద్యోగం కల్పించాలి. ప్రతి నెలా ఒకటో తేదీన బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలి. ఈపిఎఫ్, ఈఎస్‌ఐ, సక్రమంగా అందరికీ అమలు చేయాలి.

ట్రైబల్, మున్సిపల్ టీచర్లను ఏకీకృత సర్వీస్ రూల్స్‌లో చేర్చాలి

- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల్ని ఏకీకృత సర్వీస్‌రూల్స్ పరిధిలోకి చేర్చాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. విజయవాడలోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ చట్టం -2017ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలు మూడపడ తాయని, కార్పొరేట్ విద్యాసంస్థలకు మాత్రమే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. బదిలీల ప్రక్రియలో ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్, వొకేషనల్ టీచర్ల బదిలీలను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల కౌన్సిలింగ్‌లో ఉపాధ్యా యుల అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, నెలవారీ ప్రమోషన్ల ప్రక్రియలో భాగంగా అన్ని జిల్లాల్లోనూ అన్ని కేడర్ల ప్రమోషన్లు నిర్వహించాలన్నారు. ఫెడరేషన్ అధ్యక్షులు ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఫ్యాప్టో ఆధ్వర్యంలో మున్సిపల్ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తున్నట్లు తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రమోషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలని కోరారు. ఐటిడిఎ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న జడ్పీ, ఎంపిపి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని మండల, పట్టణ శాఖ లు నిర్వహించాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎన్ నరసింహుడు, సహాధ్యక్షులు కె విజయగౌరి, ఎన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కెఎస్‌ఎస్ ప్రసాద్, షేక్ సాబ్జీ, మహమ్మద్ జిలానీ, డి రాము, ఎన్ జయప్రభ, బి లక్ష్మీరాజా తదితరులు పాల్గొన్నారు.

రూ.104కోట్లతో గిరిజన గ్రామాలకు తాగు నీరు

- విశాఖ జిల్లాలో అత్యధిక గ్రామాలకు నీటి సరఫరా
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మారుమూల గిరిజన గ్రామాల్లో తాగు నీరును అందించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సుమారు 699 గ్రామాల్లో తాగు నీరు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు గాను రూ. 104.99 కోట్లను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామీణ తాగు నీటి సరఫరా శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నీటి సరఫరా చేయాలని నిర్ణయించిన గ్రామాల్లో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలోనే ఉండటం గమనార్హం. ఈ జిల్లాలో సుమారు 465 గ్రామాల్లో నీటి సరఫరా చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని 75 గ్రామాల్లో రూ. 11.07 కోట్లతో నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా విజయనగరం జిల్లాలో 33 గ్రామాలకు రూ. 3.09 కోట్లు, తూర్పు గోదావరిలో 108 గ్రామాలకు రూ. 11.99 కోట్లు, పశ్చిమ గోదావరిలో 9 గ్రామాలకు రూ. 1.10 కోట్లు, గుంటూరులో 2 గ్రామాలకు రూ. 0.33 కోట్లు, ప్రకాశంలో 6 గ్రామాలకు రూ. 1.35 కోట్లు, కర్నూలు జిల్లాలో ఒక గ్రామానికి రూ. 0.05 కోట్లతో నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు.

గిరిజన గ్రామాల్లో తాగు నీటి సరఫరా కార్యక్రమాన్ని క్వార్టర్‌ల ప్రకారం పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా 699 గ్రామాలకు తాగు నీటి సరఫరా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండో క్వార్టర్ పూర్తి కావస్తున్న నేపథ్యంలో మూడో క్వార్టర్ నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తున్నారు. మూడో క్వార్టర్ సమయం ముగిసే సమయానికి 85 గ్రామాలకు నీటిని అందించే దిశగా పనులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే తొలి దశ కింద శ్రీకాకుళం జిల్లాలో 15, విజయనగరంలో 8, విశాఖపట్నంలో 50, తూర్పు గోదావరిలో 10, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఒక్కో గ్రామం చొప్పున తాగు నీటిని సరఫరా చేయనున్నారు. నాలుగో క్వార్టర్ కింద మిగిలిన 614 గ్రామాలకు తాగు నీటి సరఫరా చేయాలని నిర్ణయించినట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గిరిజన ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా ఏజెన్సీ ఏరియాల్లో మంచి నీటి సదుపాయం లేక, కలుషిత నీరు తాగడం వల్ల గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇటీవల కాలంలో రంపచోడవరం ఐటిడిఏ పరిధిలోని చాపరాయిలో 26 మంది గిరిజనుల మరణాల ఉదంతమే దీనిని నిదర్శనం. ఈ నేపథ్యంలోనే గిరిజన గ్రామాలకు మంచి నీటి సరఫరా చేయాలన్న ఉద్దేశంతో రూ. 104 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రత్యేకహోదా కోసం రాఖీలతో నిరసన

- ప్రధానికి ఫేస్‌బుక్, ట్విట్టర్ సందేశాలు
- పోస్టర్‌ను విడుదల చేసిన పిసిసి అధ్యక్షులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు మహిళలంతా ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల ద్వారా ప్రధాని మోడీకి రాఖీలతో నిరసన తెలపాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి కోరారు. మోడీ ట్విట్టర్ ప్రధాని కాబట్టే ఆయనకు ఆ వేదిక అయితేనే అర్థమవుతుందన్నారు.. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో రాఖీ ప్రొటెస్ట్ ఫర్ స్పెషల్ స్టేటస్ ఫర్ ఎపి అనే పోస్టర్‌ను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా ఎపి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతి మహిళా మోడీకి నిరసన రాఖీలు పంపి 2014 ఎన్నికల ముందు రాష్ట్రానికి మోడీ ఇచ్చిన హామీలను గుర్తు చేయాలన్నారు. రాజధానికి, లోటు బడ్జెట్‌కు నిధులు, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, కడప రైల్వేజోన్, పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలని ఆయన్ని కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలనుకొండ శివాజి, సుంకర పద్మశ్రీ, వినయ్‌కుమార్, ఇందిర, కుర్తియ తదితరులు పాల్గొన్నారు.

దొండపాడు ఘటనలో టిడిపి నాయకుల్ని కఠినంగా శిక్షించాలి

క్షతగాత్రుల్ని పరామర్శించిన రఘువీరా

గుడివాడ రూరల్ మండలం దొండపాడులో దళితులపై జరిగిన దాడిని రఘువీరారెడ్డి ఖండించారు. అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు తవ్వుతున్న టిడిపి నాయకుల్ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై సిఎం చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. అంతకుముందు ఆయన దాడిలో గాయపడి, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68